ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 20 జులై 2026 | సంపుటి: 22 | సంచిక: 293 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## ఫేస్‌బుక్, ఇన్‌స్టా సేవల్లో
# అంతరాయం



మెటా సేవల్లో ప్రపంచవ్యాప్తంగా అంతరాయం ఏర్పడింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ , ఫేస్‌బుక్ మెసెంజర్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీడ్ లోడ్ అవ్వకపోవడం, సందేశాలు వెళ్లకపోవడం, లాగిన్ విషయంలో ఇబ్బందులు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఫొటోలు, వీడియోల అప్‌లోడింగ్‌లో విషయంలోనూ అంతరాయం ఏర్పడింది. –న్యూఢిల్లీ, (నినాదం) 2



## ఇరాన్‌పై అమెరికా
# ప్రతీకార దాడులు
2

ఇరాన్‌పై అమెరికా ఆదివారం మరోసారి దాడులకు దిగింది. జోరాన్‌పై ఇరాన్ చేసిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించడంతో వీటిని చేపట్టినట్లు అమెరికా వెల్లడించింది. ఇది వరుసగా ఎనిమిదో రాత్రి నిర్వహించిన దాడి అని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. –న్యూఢిల్లీ, (నినాదం)

## ఉద్యోగాలు... యువత భవిష్యత్తా?
# రాజకీయాల ఆయుధమా?

అంతర్మథనం

EDITORIAL

**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి యువత కేంద్ర బిందువుగా మారింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఉద్యోగాల అంశంపై సాగుతున్న మాటల యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం "70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం" అని ప్రకటిస్తుంటే, మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ "ఆ సంఖ్యను నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పకుంటాను" అంటూ సవాల్ విసురుతున్నారు. అధికార పక్షం ప్రతిసవాళ్లతో ఎదురుదాడి చేస్తోంది. ఇలా ఉద్యోగాల అంశం నిరుద్యోగ యువత ఆశలకు సంబంధించిన సమస్యగా కాకుండా, రాజకీయ బలపరీక్షగా మారడం ఆందోళన కలిగించే విషయం.**





6


బిజిగిరి శ్రీనివాస్
సంపాదకులు – నినాదం

*తెలంగాణ ఉద్యమ చరిత్రను తిరగేస్తే యువత పాత్ర అపారమైనది. వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువకులు తమ చదువులు, ఉద్యోగాలను పక్కనబెట్టి రాష్ట్ర సాధన కోసం పోరాడారు. "మన రాష్ట్రం వస్తే మన ఉద్యోగాలు వస్తాయి" అనే నమ్మకమే ఉద్యమానికి శక్తినిచ్చింది. రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా ఉద్యోగాల ప్రశ్న ఇప్పటికీ ఎన్నికల ప్రధాన అజెండాగా ఉండటం సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని చెబుతోంది.*

## జాతీయ పోలీస్ అకాడమీలో
# లైంగిక వేధింపులు
### ట్రైనీ ఐపీఎస్‌పై కేసు నమోదు

హైదరాబాద్ లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం రేగింది. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలపై ఒక ట్రైనీ ఐపీఎస్ అధికారిపై కేసు నమోదైంది. పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి తనను తీవ్రంగా వేధిస్తున్నాడంటూ బాధితురాలు అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించింది. ఉదయ్ కృష్ణారెడ్డి తనకు నిరంతరం అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ, మానసికంగా వేధిస్తూ, దుర్భాషలాడుతున్నాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.

**హైదరాబాద్, జులై 19 (నినాదం)**



2

# గాంధీభవన్‌కు రావొద్దు..
## నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు!

- **ఎస్ఐఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ వర్చువల్ సమీక్ష**
- **ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని నేతలకు సూచన**
- **నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక**
- **ఉత్తమ 100 బీఎల్‌ఏలకు రాహుల్‌తో కలిపిస్తామని హామీ**



2

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పార్టీ నాయకత్వాన్ని అప్రమత్తం చేశారు. ఎలాంటి నిర్ల క్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌పై ఆదివారం నిర్వహించిన వర్చువల్ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

**- హైదరాబాద్, జులై 19 (నినాదం)**

## సాగునీటి విషయంలోఎలాంటి
# భేషజాలు లేవు

- **ఎన్డీఎస్ఏ చెబితే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తాం**
- **ప్రతి జిల్లాలో ఎల్‌నినో కమాండ్ కంట్రోల్ రూమ్స్: మంత్రి శ్రీధర్ బాబు**

2



## పదేళ్ల మేత...
# 30 నెల్ల పట్టివేత

**పోకిరి సినిమాలో హీరో తండ్రిని పట్టుకున్న విలన్ నీ కొడుకు ఏం చేస్తున్నాడు ఎక్కడున్నాడు అని అడిగితే.. రాష్ట్రంలో వ్యవసాయం చేస్తున్నాడు అవినీతి చీడపురులను ఏరేస్తున్నాడు. సమాజంలో చట్టానికి చిక్కకుండా దోచుకుంటున్న ఒక్కొక్కరిని పట్టుకుంటున్నాడు అని గర్వంగా సమాధానం చెప్తాడు. 2014 నుంచి పదేళ్లపాటు సంక్షేమ పథకాల్లో అడ్డగోలుగాఅవినీతి మేతమేసి కోట్లు కూడ పెట్టిన అధికారుల పాలిట సీఎం రేవంత్ రెడ్డి సింహ స్వప్నం అయ్యారనేది అక్షర సత్యం.**

**- జగిత్యాల ప్రతినిధి జులై 19 (నినాదం )**




***రాష్ట్రంలో ఏసీబీ దూకుడు పెంచింది. 10 ఏళ్లు అడ్డగోలుగా మేసిన అవినీతి అధికారుల గుండెల్లో రైలు పరిగెడుతున్నాయి రేవంత్ సర్కార్ కొలువు దీని నాటి నుంచి జూలై 10 వరకు అరెస్ట్ అయిన అధికారుల ఆస్తులు చేస్తే కళ్ళు బయలు కమ్మాల్సిందే.***

2023 డిసెంబర్ 7న రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టారు 10 ఏళ్ల టిఆర్ఎస్ పరిపాలనలో కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల్లో, గొర్రెలు, బర్రెలు, కెసిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక స్కీముల్లో అడ్డగోలు అవినీతి సొమ్మును మేసి కోట్లు కూడబెట్టిన అవినీతి అధికారుల భరతం పట్టడం కోసం రేవంత్ సర్కార్ ఏసీబీ ని రంగాల్లోకి దించింది.

## 511 మంది అధికారుల అరెస్ట్
## వేల కోట్ల ఆస్తులు సీజ్..!
## దూకుడు పెంచిన ఏసీబీ

ప్రజల రక్తం తిన మరిగి అడ్డగోలు సొమ్మును కూడా పెట్టిన అనకొండలు ఒక్కొక్కరుగా బయటపడుతున్నారు పట్టుబడిన అధికారుల ఇండ్లలో గుట్టలు గుట్టలుగా నగదు కిలోల కొద్ది బంగారం వజ్రాల కుప్పలు వెండి ఆభరణాలు కోట్లలో వెలుగు చూస్తోంది. 30 నెలల రేవంత్ రెడ్డి పరిపాలనలో జులై 10 వరకు దాదాపు 511 మంది అవినీతి అధికారులు పట్టుబడినట్లు ఏసీబీ లెక్కలు చెబుతున్నాయి.

*2024లో మొత్తం 152 కేసులు నమోదుకాగా వీటిలో 129 మంది లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన వారు ఉన్నారు. 223 మంది నిందితులు అరెస్ట్ అయ్యారు. 2025లో 199 కేసులు నమోదు కాగా 273 మంది అధికారులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో 224 మందిని అరెస్టు చేసినట్లు ఏసీబీ లెక్కలు చెబుతున్నాయి. 2026 జూలై 10 వరకు 86 మంది ని అక్రమ ఆస్తులు కేసులలో ఏసీబీ అరెస్టు చేసింది.*

**గుట్టల కొద్దీ నోట్ల కట్టలు, వజ్రాలు, వెండి, బంగారం**

ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పోలీస్, రిజిస్ట్రేషన్ శాఖల్లో విచ్చలవిడి అవినీతి జరుగుతుందని బయటపడుతున్న సంఘటనలు చెప్తున్నాయి. తండ్రి స్థానంలో ఉండాల్సిన పోలీస్ శాఖ లంచాల్లో మునిగితేలుతుంది. ఎస్ ఐ, సి ఐ, డి.ఎస్.పి స్థాయి అధికారులు లంచాలు తీసుకుంటూ దొరికిపోతున్నారు. అక్రమాస్తుల కేసులో అరెస్టయి జైలు పాలు అవుతున్నారు.ఇటీవల కాలంలో అవినీతి నిరోధక శాఖకు పట్టుబడుతున్న ప్రభుత్వ అధికారుల ఆస్తులను చూస్తే ఎవరైనా శాఖ వలసిందే. కార్పొరేట్ కంపెనీలు నడిపే యజమానులను మించిన అక్రమాస్తులు వెలుగుచూస్తున్నాయి. రాష్ట్రంలో లంచగొండి అధికారుల పై ఫిర్యాదులు ...మిగతా 2లో

## రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్షం భేటీ
### టీఎంసీ నిరసన, విపక్షాల వాకౌట్.. విపక్షాల వాకౌట్‌పై రిజిజు ఫైర్



పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్షం భేటీ జరిగింది పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశాన్ని విపక్షాలు వాకౌట్ చేయడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిస్థాయి బహిష్కరణ కాదని, కేవలం సింబాలిక్ నిరసన మాత్రమేనని అన్నారు. **–న్యూఢిల్లీ, జులై 19 (నినాదం)** 2



## ఫిఫా ఫైనల్‌కు
# కేరళలో సెలవు

- **అన్ని విద్యాసంస్థలకు వర్తింపు**
- **అర్ధరాత్రి మ్యాచ్ దృష్ట్యా నిర్ణయం**
- **పరీక్షలు మాత్రం యథాతథం**
- **అర్జెంటీనా-స్పెయిన్ ఫైనల్ పోరు**

2


## యూసీసీ బిల్లుకు
# మధ్యప్రదేశ్ కేబినెట్ ఆమోదం

- **ఇకపై రామ్, రహీమ్, రాబిన్‌లకు సమాన హక్కులు**
- **ఇకపై అన్ని మతాల వారికి సమాన హక్కులు లభిస్తాయని మధ్యప్రదేశ్ సీఎం వ్యాఖ్య**



2

## మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే
# ప్రజా ప్రభుత్వ లక్ష్యం
### ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరవేస్తాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్, రహదారులు, తాగునీరు వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి అభివృద్ధి ఫలాలను ప్రతి గ్రామానికి చేరవేస్తామని తెలిపారు. ఆదివారం కామేపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన సుమారు రూ.11.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

**-ఖమ్మం, జులై 19 (నినాదం)** 12




## తిరుమలలో గదుల కేటాయింపులో
# కొత్త విధానం
2

### సీఆర్వోలో రిజిస్ట్రేషన్, ఉప విచారణ కార్యాలయాల్లో కేటాయింపు

- **డిస్ప్లే బోర్డులు, ఎస్ఎంఎస్ ద్వారా భక్తులకు సమాచారం**
- **గదుల కేటాయింపు, ఖాళీ చేయడంపై కఠిన నిబంధనలు**
- **ఆన్‌లైన్‌లోనే రుసుము చెల్లింపు తప్పనిసరి**

## జమ్ముకశ్మీర్‌లో
# వరద బీభత్సం

- **17 మంది మృతి- పలువురు గల్లంతు**
- **జమ్ముకశ్మీర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు**
- **పూంచ్, రాజౌరిలో ఆకస్మిక వరదలు**

2



జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరిలో ఆదివారం కురిసిన భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో కనీసం 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. రహదారులు దెబ్బతినడం, వాగులు ఉప్పొంగడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ, పలు ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. **–జమ్ము (నినాదం)**



## ఫేస్‌బుక్, ఇన్‌స్టా సేవల్లో అంతరాయం

మెసెంజర్ ద్వారా వినియోగదారులు ఎవరికైనా సందేశాలు పంపించడానికి ప్రయత్నించినప్పుడు 'సైట్ సమస్య కారణంగా మీ ఖాతా తాత్కాలికంగా నిలిపివేయడమైనది. ప్రస్తుతం ఈ సేవలు అందుబాటులో లేవు. కొన్ని నిమిషాల తర్వాత తిరిగి ప్రయత్నించండి' అంటూ సందేశాలు దర్శనమిస్తున్నాయని వినియోగదారులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. భారత్ సహా కెనడా, బ్రిటన్, తుర్కియే వంటి దేశాల్లోనూ ఈ సమస్య ఎదురైనట్లు డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది. సాంకేతిక సేవల్లో అంతరాయంపై మెటా ఇంకా అధికారికంగా స్పందించలేదు.

## గాంధీభవన్‌కు రావొద్దు..

ఎస్ఐఆర్ బాధ్యతలు అప్పగించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, చివరి బాధ్యత వారిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడాన్ని అవకాశంగా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి 10 మంది ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూనే ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. బాధ్యతలు నిర్వర్తించని ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇప్పటివరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 489 ఎస్ఐఆర్ సమావేశాలు నిర్వహించినట్లు సీఎం తెలిపారు. వెనుకబడిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది నాయకులు హైదరాబాద్‌కే పరిమితమై పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు ఎవరూ రావొద్దని సీఎం స్పష్టం చేశారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగేవారికి నియామకాలు ఉండవని తేల్చిచెప్పారు. జులై 30న మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని వెల్లడించారు.

బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని సీఎం సూచించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నివేదికలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పార్టీ బీఎల్ఏలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

రానున్న పది రోజులు నాయకులంతా నియోజకవర్గాల్లోనే పర్యటించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్ బృందం బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని ప్రకటించారు.

## ఫిఫా ఫైనల్‌కు కేరళలో సెలవు

ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సందడి కేరళలో ప్రత్యేక నిర్ణయానికి దారి తీసింది. అర్ధరాత్రి జరిగే తుది పోరును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో పాటు ప్రతిపక్షాల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు, ప్రొఫెషనల్ కాలేజీలు కూడా సోమవారం మూసివేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు విడుదల కానున్నాయి. అయితే ముందుగానే షెడ్యూల్ చేసిన పరీక్షలు మాత్రం యథావిధిగా నిర్వహిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ అర్ధరాత్రి తర్వాత ముగియనున్నందున మరుసటి రోజు ఉదయం విద్యార్థులు తరగతులకు హాజరుకావడం కష్టమవుతుందని ఇటీవల మాజీ విద్యాశాఖ మంత్రి వి. శివన్‌కుట్టి అభిప్రాయపడ్డారు. అదే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, స్పెయిన్ జట్లు తలపడనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. ఫుట్‌బాల్‌పై అపారమైన అభిమానమున్న కేరళలో మాత్రం ఫైనల్ కోసం ఏకంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడం విశేషం.

## రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్షం భేటీ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్షం భేటీ జరిగింది పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశాన్ని విపక్షాలు వాకౌట్ చేయడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిస్థాయి బహిష్కరణ కాదని, కేవలం సింబాలిక్ నిరసన మాత్రమేనని అన్నారు. సమావేశం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, సమావేశం మొత్తం సానుకూల వాతావరణంలో సాగిందని తెలిపారు. అలాగే వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు మొత్తం ఎనిమిది బిల్లులను జాబితా చేసినట్లు పేర్కొన్నారు.

### పార్లమెంట్ సజావుగా సాగాలని విజ్ఞప్తి

దేశ ప్రజలు పార్లమెంట్ సమర్థంగా పనిచేయాలని కోరుకుంటున్నారని, సభ తరచూ అంతరాయం కలగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని రిజిజు అన్నారు. ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను బలంగా వినిపించవచ్చని, అయితే సభ కార్యకలాపాలు నిలిచిపోయేలా వ్యవహరించవద్దని కోరారు. సభ గౌరవాన్ని కాపాడేలా అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చే బిల్లులపై విస్తృతంగా చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని రిజిజు పేర్కొన్నారు. సభలో అంతరాయాలు ఏర్పడితే చిన్న పార్టీలకు మాట్లాడే అవకాశం కోల్పోతారని చెప్పారు. అనంతరం బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించారని ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రతి బిల్లును సభ్యులు పూర్తిగా పరిశీలించి అభిప్రాయాలు చెప్పిన తర్వాతే ఆమోదం పొందాలని ప్రభుత్వం కోరుకుంటోందని వివరించారు.

### 20 మంది ఎంపీలను ఎందుకు పిలవకూడదు?

ఎన్‌సీపీఐకి చెందిన 20 మంది లోక్‌సభ సభ్యులు కొత్త పార్టీతో అనుబంధం కోరుతూ స్పీకర్‌కు లేఖ ఇచ్చారని, వారికి ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేసినట్లు రిజిజు తెలిపారు. ఈ అంశం ప్రస్తుతం స్పీకర్ పరిశీలనలో ఉందని చెప్పారు. అలాంటి పరిస్థితిలో ఆ ఎంపీలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించకుండా ఎలా ఉండగలమని ప్రశ్నించారు. లోక్‌సభ అందరిదని, ప్రతి సభ్యుడికి హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. ఎంపీల గుర్తింపు, పార్టీ విలీనం వంటి అంశాలు పూర్తిగా లోక్‌సభ స్పీకర్ పరిధిలోకి వస్తాయని, ఆ అంశంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని రిజిజు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపడం ప్రభుత్వ బాధ్యత అని, ఏకాభిప్రాయం కోసం అందరినీ సమావేశాలకు ఆహ్వానించడం సహజ ప్రక్రియ అని చెప్పారు.

## ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు

ఇరాన్‌పై అమెరికా ఆదివారం మరోసారి దాడులకు దిగింది. జోర్డాన్‌పై ఇరాన్ చేసిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించడంతో వీటిని చేపట్టినట్లు అమెరికా వెల్లడించింది. ఇది వరుసగా ఎనిమిదో రాత్రి నిర్వహించిన దాడి అని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. జోర్డాన్‌లో అమెరికా సైనికులపై దాడి చేసిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ బలగాలను దెబ్బతీయడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశానుసారమే వీటిని జరిపినట్లు వెల్లడించింది. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని మరింత బలహీనపర్చడమే ఈ దాడుల ఉద్దేశమని పేర్కొంది.

# పదేళ్ల మేత... 30 నెల్ల పట్టివేత

**మొదటి పేజీ తరువాయి...**

అందుతుండడంతో వలపన్ని పట్టుకుంటున్నారు. అక్రమార్కుల ఇండ్లలో సోదాలు జరిపి ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించి జైలుకు పంపుతున్నారు. ఆస్తులు జప్తు చేస్తున్నారు. తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసిన లంచ అవతారాల ఆస్తులు చూస్తే కళ్ళు బైర్లు కమ్ముతాయి. ఒక్కొక్కరి ఆస్తుల విలువ వందల కోట్లు ఉండడం అడ్డు అదుపు లేని వారి అవినీతికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. పట్టుబడుతున్న వారు కొందరే ప్రభుత్వ శాఖల్లో తిష్ట వేసిన వారు అనేకమంది అనకొండలు ఇంకా పందికొక్కుల్లాగా మేస్తూనే ఉన్నారు. మిలమిలా మెరుస్తున్న బంగారు బిస్కెట్లు.. మిర్మిట్లు గొలిపే వజ్రాల నక్లెసులు.. ఖరీదైన ఆభరణాలు.. డైమండ్లు బ్యాంకు బ్యాలెన్స్ ఇంట్లో గుట్టలు గుట్టలుగా కరెన్సీ కట్టలు బయటపడుతున్నాయి.. విదేశీ మద్యం బాటిల్ ఖరీదైన సరుకు రాష్ట్రం నలుమూలల మహానగరాల్లో ఖరీదైన విల్లాలు బయటపడుతున్నాయి.

**సుంకరి నరహరి రావు. ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్**

దోచుకోవడం లో అల్టిమేట్ రేంజ్. ఈయన అక్రమాస్తుల చిట్టా విప్పడం కోసం ఏసీబీ అధికారులు షిఫ్ట్ సిస్టంలో పనిచేయాల్సి వచ్చింది. ఏకకాలంలో 10 12 లొకేషన్ లో దాడులు నిర్వహించగా కళ్ళుబైర్లు కమ్మే సొమ్ము కరెన్సీ బయటపడింది. బెడ్ కింద పరుపునిండా నోట్ల కట్టలు పెట్టుకొని వాటి మీద నిద్రపోతాడని ఏసీబీ అధికారులు చెప్పారు సజ్జల మీద కబోర్డ్ లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే.. మహేశ్వరంలో 1.4 నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి. పుప్పాలగూడలో 2500 స్క్వేర్ ఫీట్ గల ప్లాటు. నార్సింగ్ లో హైరేజ్ భవనంలో రెండు ప్లాట్లు. గచ్చిబౌలిలో టిఎన్జీవో కాలనీలో జి ప్లస్ త్రీ అంతస్త్ర భవనం. ఛత్రినాకలో జి ప్లస్ టు భవనం. నగదు 2.54 కోట్లు బ్యాంకు నిలువలు 2.2 కోట్లు.
ఫిక్స్డ్ డిపాజిట్లు. ఐదు కోట్లు . బంగారం కిలోన్నర. వెండి 8 కిలోలు. భార్య పేరు మీద మరో రెండు లాకర్లు. ఇవి పూర్తి వివరాలు కాదు...ఇంకా ఉంది.

**మోహన్ నాయక్**
**రోడ్లు భవన శాఖలో ఈ ఎన్ సి**

రోడ్లు భవనాల శాఖలో ఈఎన్సీ మోహన్ నాయక్ ఇంట్లో దాదాపు 17.4 కోట్ల అక్రమాస్తులు వెలుగు చూశాయి. ఏసీబీ మోహన్ నాయక్ ను అరెస్ట్ చేసింది. ఈయన ఆస్తులు బహిరంగ మార్కెట్లో 170 కోట్ల విలువ ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని 16 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదరులు నిర్వహించి ఎన్సీ మోహన్ నాయక్ ఆస్తుల చిట్టా గుట్టు విప్పారు.

**మురళీధర్ రావు చీఫ్ ఇంజనీర్ కాళేశ్వరం ప్రాజెక్టు**

కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ గా పనిచేసి పదవి విరమణ పొందిన మురళీధర్ రావు 150 కోట్ల ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు తేల్చారు. గత ప్రభుత్వం అధికారంలో తలపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి ఇచ్చిన సబ్ కాంట్రాక్టర్ ద్వారా అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. ఆదాయానికి మించి హాస్తుల్ను గుర్తించి అరెస్టు చేసింది. మురళీధర్ కలిగి ఉన్న ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో 170 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. మురళీధర్ పదవిలో ఉండగానే కాళేశ్వరం ఎత్తిపోతల పనులు జరిగాయి. మురళీధర్ రావుకు బేగంపేట, యూసఫ్ గూడా, కోకాపేట తో పాటు హైదరాబాదులో అత్యంత ప్రైమ్ లొకేషన్ లో కమర్షియల్ భవనాలు నాలుగు ఖరీదైన ఓపెన్ ప్లాట్లు, బంగారు ఆభరణాలు బెంజ్ కార్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

**నూనె శ్రీధర్. నీటిపారుదల శాఖ కాళేశ్వరం ప్రాజెక్ట్**

నీటిపారుదల శాఖలో ఇంజనీర్ గా పనిచేస్తున్న నూనె శ్రీధర్ అక్రమస్తులను ఏసీబీ గుర్తించింది ఎక్కువ కాలం కాళేశ్వరం ప్రాజెక్టులోని పని చేశారు. కొద్దికాలంలోనే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదోన్నతి పొందారు. శ్రీధర్ భార్య పిల్లలపై ఇతర బినామీలపై అడ్డగోలు ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. రంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ లో విలాసవంతమైన వీళ్ళ.. కరీంనగర్ వరంగల్ లో వాణిజ్య భవనాలు నగరంలోని షేక్పేట్ అమీర్పేట్ లో మొత్తం 19 చోట్ల ఫ్లాట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. మొత్తం 110 కోట్ల అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులు అంచనా వేశారు

**భూక్య హరి రామ్ కాళేశ్వరం ఎత్తిపోతల పథకం**

భూక్య హరి రామ్ కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకంలోముఖ్య భూమిక పోషించారు. గ్రామస్తులు కూడబెట్టడంలో ఈయన కూడా పోటీపడ్డారు. హైదరాబాద్ షేక్ పెట్ లో వాణిజ్య భవనాలు హైదరాబాద్ వరంగల్ కరీంనగర్ లో అత్యంత ఖరీదైన భవనాలు మొత్తం 19 స్థలాలు ఉన్నట్టు గుర్తించారు 16 ఎకరాల వ్యవసాయ భూమి 19 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు ఉన్నాయి. విలువైన బంగారు నగరాలు నగలు వివిధ బ్యాంకులో డిపాజిట్లు బహిరంగ మార్కెట్లో 110 కోట్లుగా అంచనా వేసింది.

**వంశీ మోహన్.. డిప్యూటీ కలెక్టర్**

ఉద్యోగంలో చేరినప్పటి నుంచి బల్ల కింద చేయి పెట్టడం అలవాటు చేసుకున్నాడు. అంచలంచలుగా పదోన్నతులు పొంది డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎదిగారు. ఉన్నత స్థాయికి చేరుకున్న బల్లకింద చేయి పెట్టడం మానవాతిని కొనసాగించారు. డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ అక్రమస్తులకు కూడబెట్టడంలో తెలివిగా వ్యవహరించారు. బంధువులు కుటుంబ సభ్యులు బినామీలుగా చేసుకొని గిఫ్ట్ డిడి ల పేరుతో అక్రమ సంపాదన పెంచారు. రియల్ ఎస్టేట్ కంపెనీ నుంచి 10 ఫ్లాట్లను గిఫ్ట్ డిడి రూపంలో పొందారు. హైదరాబాదు శివారు ప్రాంతంలో 100 కోట్ల విలువ చేసే భూముల పెట్టుబడి పత్రాలు ఏసీబీ తనిఖీల్లో పట్టుబడ్డాయి ఈయన ఆస్తి దాదాపు 120 కోట్లు ఉన్నట్లు ఏసీబీ నిర్ధారించింది.

**హెచ్ఎండిఏ శివ బాలకృష్ణ..**

అనుమతి కావాలంటే అడిగినంత చేయి తడిపితేనే ఫైల్ కదులుతుంది. ఈయన అక్రమ సంపాదనకు కఠినంగా పెట్టుకున్న నిబంధన ఇది. శివ బాలకృష్ణ బినామీ పేరు మీద 2004 ఎకరాల భూమి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బంధువులు కుటుంబ సభ్యులు స్నేహితుల పేర్లతో 150 సేల్ డి డాక్యుమెంట్లు నాలుగు పట్టాదారు పాస్ పుస్తకాలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 50 లక్షల విలువ చేసే నాలుగు కారు ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. శివ బాలకృష్ణకు తెలంగాణలోనే కాదు ఏపీలో కూడా భారీగా ఆస్తులు కూడా పెట్టారు. విశాఖపట్నంలో 29 ప్లాట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు వీటి విలువ 2 వేల కోట్ల విలువ పై మాటేనని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. బ్లాక్ లిస్టులో ఉన్న రెండు రియల్ ఎస్టేట్ కంపెనీలకు సంబంధించిన ఫైర్లు క్లియర్ చేయడంతో బిల్డర్ల భారీగా డబ్బు వసూలు చేశారు.

**నీఖేష్ కుమార్. అసిస్టెంట్ ఇంజనీర్ ఇరిగేషన్**

హైదరాబాద్ ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ నికేష్ కుమార్ అక్రమ ఆస్తులు చూస్తే ఏసీబీ అధికారులు శాఖ అయ్యారు. సారుది ఎన్వోసీల వ్యాపారమే . 2013లో ఉద్యోగం చేరిన నికేష్ అరెస్ట్ అయ్యేనాటికి ఆయన నికర ఆదాయం 6 కోట్ల 70 లక్షల మాత్రమే. 17.73 కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం నికేషాస్తుల విలువ 100 కోట్ల పై మాటే.. కిలోన్నర బంగారం ప్లాటినం వజ్రాలు ఆభరణాలు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నాం. ఎన్ఓసిల కింద కోట్లు కూడా పెట్టిన నికేష్ కుమార్ ఆయన పేరు మీద మూడిన్ఛ్లు ఫామ్ అవుదులు ఉన్నాయి. వీటి విలువ 80 కోట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు లెక్క కట్టారు. మొయినాబాద్ లో మూడు ఫామ్ అవ్వదున్నట్టు నిర్ధారించారు ప్రభుత్వ లెక్కల ప్రకారం 150 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు తేల్చారు.

**ఎరు అంబేద్కర్...విద్యుత్ శాఖ ఏ డి ఏ.**

దేశానికి రాజ్యాంగం రచించి దశ దిశ నిర్దేశించిన ఓ పవిత్రమైన పేరిది.. అంబేద్కర్ పేరు పెట్టుకుని ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంటో అక్రమ సంపాదన కు తెగబడిన అధికారి. టీడీఎస్ పీడీసీఎల్ లో విద్యుత్ శాఖ ఏడిఏ గా అంబేద్కర్ ఉద్యోగం వెలగబెడుతున్నారు. ఆయన ఇంట్లో ఏసీబీ అధికారులు రెడీ చేసి ఏకంగా రెండు కోట్ల పైగా నోట్ల కట్టలు స్వాధీనం చేసుకున్నారు. 1998లో ఉద్యోగంలో చేరిన అంబేద్కర్ ఏఈ గా ఉంటూనే తన కెమికల్ ఫ్యాక్టరీకి ఎండిగా వ్యవహరిస్తున్నారు. కుటుంబ సభ్యుల పేరిట ప్లాట్లు ఇండ్లు వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పెట్టారు నాలుగు పాయింట్ ఐదు కోట్లుగా ఏసీబీ అధికారులు తేల్చారు మొత్తం దీని ప్రస్తుతం మార్కెట్ విలువ 100 కోట్లుగా ఉంటుందని ఏసీబీ అధికారులు లెక్క కట్టారు.

**కిషన్ నాయక్ డిప్యూటీ కమిషనర్ ట్రాన్స్పోర్ట్**

రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్ నాయక్. 1994లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా చేరిన కిషన్ నాయక్ ఆర్టీవో గా పదోన్నతి పొందారు. తర్వాత డిటిసిగా కుర్చీలో కూర్చున్నారు. కుటుంబ సభ్యుల పేరిట 10.4 కోట్లు కూడా పెట్టినట్టు ఏసిబి అధికారులు గుర్తించారు. ఈసీబీ చరిత్రలో కిషన్ పట్టివేత అత్యంత ఖరీదైన కేసుగా అధికారులకు గుర్తించారు. బహిరంగ మార్కెట్లో కిషన్ ఆస్తుల విలువ 100 కోట్ల పైగా ఉంటుందని ఎసిబి అధికారులు నిర్ధారించారు. నిజాంబాద్ లో లహరి హోటల్లో 50% వాటా. రియల్ ఫర్నిచర్ షాప్ ఓనర్ షిప్. నిజాంబాద్ టౌన్షిప్ లో రెండు ప్లాట్లు. సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో 31 ఎకరాల వ్యవసాయ భూమి. 40 గజాల పౌలిహౌస్. నిజాంబాద్ లో 10 ఎకరాల వాణిజ్య స్థలం రెండు కిలోల బంగారం 25 కిలోల వెండి ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ సాధనం చేసుకున్నారు.

**రెండేళ్లలో 2007 మంది పట్టుబడ్డ ఉద్యోగులు**

గడిచిన రెండేళ్ల లో 207 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. ఇందులో తాసిల్దార్లు సబ రిజిస్టర్లు ఏఈలు విద్యుత్ శాఖ ఇరిగేషన్ మహిళా తాసిల్దారులు కూడా ఉండడం కలకలం రేపుతుంది ఉమ్మడి పలుమూరు జిల్లాలో 15మంది లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. బాలకృష్ణ జడ్.పి.హెచ్.ఎస్ హెడ్మాస్టర్ రిటైర్డ్ టీచర్ బిల్లులు మంజూరు చేయడం కోసం 20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చెక్కారు. మార్చి 12న మల్లెకల మండలం ఇరుకూరు గ్రామానికి చెందిన వీఆర్ఏ చిన్నయ్య 15 వేల లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. అచ్చంపేట నియోజకవర్గం బలమూరు ఎస్సై విక్రం కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇసుక ట్రాక్టర్ యజమానుల నుంచి 20,వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. షాద్నగర్ నియోజకవర్గం కేశంపేట ఎమ్మార్వో లావణ్య లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడింది. 15 ఆగస్టు రోజున ఉత్తమ కానిస్టేబుల్ గా అవార్డు తీసుకున్న మరుసటి రోజే మహబూబ్నగర్ వన్ టౌన్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి 17వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న పర్వతాలు రైతుకు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం కోసం 15,వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మైనింగ్ ఏడి జాకబ్ 20,వేలు లంచం తీసుకుంటూ ఆర్ఐ సాయిరాం తో పాటు దొరికిపోయారు. తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన పశువుల సంత్ర కాంట్రాక్టర్ వద్ద నెల నెల డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 15వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. బాచుపల్లి తాసిల్దార్ శ్రీదేవి మూడు లక్షలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇల్లంతకుంట తాసిల్దార్ రవి రాజ్ కుమార్ 2 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మద్ది వంచ విఆర్ఓ శివరాం 40000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. కొత్తకోట ఆర్డిఓ మనోహర్ రావు తాసిల్దార్ లు లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. సుద్దాల వీఆర్వో శ్రీనివాస్ 45వేలు తీసుకుంటూ దొరికిపోయారు. ఆర్మూర్ ఆర్టీవో 40వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అంబర్పేట్ ఎమ్మార్వో సంధ్యారాణి ఏడు లక్షల లంచం డిమాండ్ చేసి మూడు లక్షల అడ్వాన్స్ తీసుకుంటూ దొరికిపోయారు. నార్సింగ్ టౌన్ ప్లాన్ అధికారి మణిహారిక ఏసీబీకి పట్టుబడ్డారు. 2025 ఏడాదిలో 20 మంది మహిళ అధికారులు ఏసీబీకి చెక్కారు. హనుమకొండ సబ్ రిజిస్టర్ ఆనంద్ రామ్ నరసయ్య 30 డాక్యుమెంట్ తమ దగ్గర పెట్టుకొని నగదు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులు ట్రాప్ చేశారు.

**బచ్చు రవీందర్**
**హెచ్ఎండిఏ చీఫ్ ఇంజనీర్**

హెచ్ఎండిఏ చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ కు సంబంధించి ఆయన ఇల్లు తో పాటు ఏసీబీ అధికారులు ఏకకాలంలో 15 ప్రాంతాల్లో సోదరులు నిర్వహించారు. మూడు లాకర్లు తెలిసి పెద్ద ఎత్తున నగలు బంగారం వజ్రాలు సాధనం చేసుకుని బచ్చు రవీందర్ ను అరెస్టు చేశారు. 9.4 కోట్ల ఆస్తులు గుర్తించారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో 100 కోట్లు పైగా ఉంటుందని అంచనా వేశారు. ఐదు ఓపెన్ ప్లాట్లు.. నార్సింగ్ నానకరం గూడా లో నాలుగు విలాసవంతమైన ప్లాటుగా గుర్తించారు. కొత్తూరు మండలం గూడూరు వద్ద నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి మసీదు బండ కొండాపూర్ ప్రాంతాల్లో ప్లాట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.




## జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపులు

బాధితురాలు అందించిన ఫిర్యాదు ప్రకారం.. నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెను జూలై 9వ తేదీన జుట్టుపట్టుకుని బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి, మెడపై కత్తి పెట్టి బెదిరించాడు. అంతటితో ఆగకుండా, ఆమెకు సంబంధించిన కొన్ని ప్రైవేట్ వీడియోలను రికార్డ్ చేశాడు. అనంతరం ఆమె మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొని, ఆ ప్రైవేట్ వీడియోలను ఆమె భర్తకు వాట్సాప్ ద్వారా పంపాడని బాధితురాలు ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసులు ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ 74,75,77, 315(2), ఐటీ యాక్ట్ 66 (సి) కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. దీనిపై త్వరలోనే ఉదయ్ కృష్ణారెడ్డి స్టేట్మెంట్ ను నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రంలో.. కాబోయే ఐపీఎస్ అధికారుల మధ్య ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం పోలీస్ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తును వేగవంతం చేశారు

## తిరుమలలో గదుల కేటాయింపులో కొత్త విధానం

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే సామాన్య భక్తులు వసతి గదుల కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానమ్స్) స్వస్తి పలికింది. గదుల కోసం కేంద్రీయ విచారణ కార్యాలయం (సీఆర్వో) వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా, సులభతరమైన, ఆధునిక సాంకేతికతతో కూడిన నూతన విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానం ద్వారా ఉప విచారణ కార్యాలయాల ద్వారా భక్తులకు వేగంగా గదులను కేటాయిస్తూ వారి సమయాన్ని, శ్రమను ఆదా చేస్తోంది.

**రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా..**

వసతి గది కావాలనుకునే భక్తులు ముందుగా తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి గదులు అందుబాటులో ఉన్నంత వరకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. క్యూలైన్‌లో తమ వంతు వచ్చిన తర్వాత, భక్తులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా దాని జిరాక్స్ కాపీతో పాటు, ఫోన్ నంబర్‌ను అక్కడి కౌంటర్‌లో అందించాలి. అనంతరం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా వారి వివరాలను నమోదు చేసుకుంటారు. ఈ సమయంలో భక్తులు తమకు కావాల్సిన గది కేటగిరీని ఎంచుకోవచ్చు.
A కేటగిరీ: రూ.50, రూ.100 అద్దె గల గదులు ఉంటాయి. B కేటగిరీ: రూ.1000 అద్దె గల గదులు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే, రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్లు నిర్ధారిస్తూ భక్తులకు ఒక అక్నాలెడ్జ్మెంట్ స్లిప్ ఇస్తారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సౌకర్యార్థం టీటీడీ తాగునీరు, అల్పాహారం, మరుగుదొడ్ల వంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేసింది.
A కేటగిరీ: రూ.50, రూ.100 అద్దె గల గదులు ఉంటాయి. B కేటగిరీ: రూ.1000 అద్దె గల గదులు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే, రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్లు నిర్ధారిస్తూ భక్తులకు ఒక అక్నాలెడ్జ్మెంట్ స్లిప్ ఇస్తారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సౌకర్యార్థం టీటీడీ తాగునీరు, అల్పాహారం, మరుగుదొడ్ల వంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేసింది.

**గది కేటాయింపు సమాచారం**

రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక, భక్తులు సీఆర్వో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ డిస్ ప్లే బోర్డులను గమనిస్తూ ఉండాలి. రిజిస్ట్రేషన్ క్రమ సంఖ్యల వారీగా గదులు కేటాయించబడుతున్న సమాచారం ఈ బోర్డులపై కనిపిస్తుంది. తమ రిజిస్ట్రేషన్ నంబర్ డిస్ ప్లే అయిన 15 నిమిషాల్లోపే, వారు నమోదు చేసిన ఫోన్ నంబర్‌కు గది కేటాయింపునకు సంబంధించిన పూర్తి వివరాలతో ఒక ఎస్ఎంఎస్ వస్తుంది.

## యూసీసీ బిల్లుకు మధ్యప్రదేశ్ కేబినెట్ ఆమోదం

ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)తో ఇకపై రామ్, రహీమ్, రాబిన్‌లకు సమాన హక్కులు లభిస్తాయని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ కేబినెట్ ఆదివారం యూసీసీ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. ఉమ్మడి పౌర స్మృతికి ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తోందని, రాష్ట్ర జనాభాలో 93 శాతం కంటే ఎక్కువ మంది ఈ చట్టానికి మద్దతు ఇస్తున్నారని సీఎం మోహన్ యాదవ్ అన్నారు. ముస్లిం సమాజం నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించిన డేటాను ప్రస్తావిస్తూ, ఆ సమాజంలోని మెజారిటీ మహిళలు ఈ యూసీసీ చట్టానికి అనుకూలంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. "మా డేటా ప్రకారం, 80 శాతం మంది ముస్లిం మహిళలు, 40 శాతం ముస్లిం పురుషులు ఒకే విధమైన ఉమ్మడి చట్టం ఉండాలని విశ్వసిస్తున్నారు. మాకు 3 కోట్ల సందేశాలు (SMS) వచ్చాయి. మేము ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజాభిప్రాయాన్ని సేకరించాం. నేను స్వయంగా వివిధ ర్యాలీలు, సభల ద్వారా ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను కోరాను. ఏప్రిల్ 24న ఒక ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అందరి నుంచి సూచనలను ఆహ్వానించాం. యూసీసీ ఇప్పటికే అమలులో ఉన్న రాష్ట్రాలపై కూడా మేము అధ్యయనం చేశాం. మాకు మొత్తం 9.58 లక్షల సూచనలు వచ్చాయి. రాష్ట్రంలోని 93.54 శాతం మంది ప్రజలు ఈ చట్టానికి మద్దతు ఇచ్చారు" అని సీఎం మోహన్ యాదవ్ అన్నారు.



సమాజంలోని వివక్షను తొలగించడానికి, అన్ని వర్గాలను ఒకే చట్టపరమైన ఛత్రం కిందికి తీసుకురావడానికి ఈ యూసీసీ చట్టాన్ని రూపొందించినట్లు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ స్పష్టం చేశారు. "సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు లభించేలా చూస్తామని మేము సంకల్పం తీసుకున్నాం. అది రామ్ అయినా, రహీమ్ అయినా, రవీందర్ అయినా, రాబిన్ అయినా– ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలి" అని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పేర్కొన్నారు.



## జమ్ముకశ్మీర్‌లో వరద బీభత్సం

జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరిలో ఆదివారం కురిసిన భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో కనీసం 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. రహదారులు దెబ్బతినడం, వాగులు ఉప్పొంగడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ, పలు ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన దిల్లీ పర్యటనను మధ్యలోనే ముగించుకుని జమ్ముకు తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.



## సాగునీటి విషయంలో ఎలాంటి భేషజాలు లేవు

ఎన్డీఎస్ఏ చెబితే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ప్రతి జిల్లాలో ఎల్‌నినో సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. తాజా పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళిక అమలు చేస్తామన్నారు. సాగునీటి విషయంలో తమకు ఎలాంటి భేషజాలు లేవని, ఎన్డీఎస్ఏ చెబితే తప్పకుండా మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తామన్నారు. ఒక్కరోజు లక్ష క్యూసెక్కులు రాగానే విపక్ష నేతలు గోల చేశారని ప్రస్తుతం గోదావరిలో 16వేల క్యూసెక్కుల వరద కూడా లేదన్నారు. ఎల్‌నినో పరిస్థితులపై కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆదివారం మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై మంత్రుల బృందం సమీక్షించారు. వివిధ శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీధర్ బాబు.. భూగర్భ జలాల పరిరక్షణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించామన్నారు. ఒక సీనియర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించామన్నారు.

# సంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

**వర్షాలు లేక పంటలు నష్టపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**

**విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**


**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు**

**సంగారెడ్డి బ్యూరో, జులై 19 (నినాదం):** సంగారెడ్డి జిల్లాను ప్రభుత్వం తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, రైతులు వేసిన పంటలు ఎండి పోవడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి గా చుక్క రాములు తెలిపారు. ఈరోజు సిపిఎం సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతంగంలో తీవ్ర ఆందోళన నెలకొంటుందని, దీనికి తోడు విద్యుత్ కోతలు కూడా పెరిగిపోతున్నాయని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు లేక సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో వర్షాధార పంటలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ముఖ్యంగా పత్తి, కంది, మినుము వంటి పంటలు సాగు చేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తేమ లేకపోవడం వల్ల విత్తనాలు మొలకెత్తె దశలోనే ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సింగూర్ ప్రాజెక్టు రిపేర్ పనులలో జాప్యం జరుగుతుందన్నారు. దీంతో ఈ సారి కూడా రైతులకు పంటలకు, త్రాగడానికి నీళ్లు లేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇప్పటికే కొన్ని పట్టణాలు, గ్రామాల్లో త్రాగడానికి నీళ్లు సరఫరా లేక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమైన నేటికీ పూర్తిస్థాయిలో యూనిఫాం, బుక్స్, టాయిలెట్స్, ఇతర సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, ఎం. మాణిక్ రాజయ్య, సాయిలు, రాంచందర్ నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, నాగేశ్వర్ రావు, యాదగిరి, మహిపాల్, విద్యాసాగర్, రేవంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## గబ్బిలాల పేట పరిధిలో సర్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

**మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్**



**జవహర్ నగర్, జులై 19 (నినాదం):** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని జవహర్ నగర్ లో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఎస్ఐఆర్ (సర్) హెల్ప్ డెస్క్ ను మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ గబ్బిలాల పేటలో మాజీ మేయర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సర్ హెల్ప్ డెస్క్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ ప్రజలు ఎవరు తమ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని బిఎల్ఓలు, బిఎల్ఏ లకు సూచించారు. అలాగే గబ్బిలాల పేట కాలనీయే కాకుండా చుట్టుపక్కల కాలనీ ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కాలనీ ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## కుమ్మర్ల బోనాల పండుగ లో పాల్గొన్న డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

**అశాడ మాసం సందర్భంగా సంగారెడ్డి ఎఫ్అర్ఎస్ ఎల్లమ్మ కు తొలి బోనం సమర్పించిన కుమ్మర్లు**





**సంగారెడ్డి బ్యూరో, జులై 19 (నినాదం):** అశాడ మాసం సందర్భంగా సంగారెడ్డి పట్టణం లో బోనాల ఉత్సవాలు మొదల య్యాయి. ఆనవాయితీగా ఎఫ్అర్ ఎస్ ఎల్లమ్మ తల్లి కి కుమ్మర్లు తొలి బోనం సమర్పించారు. ఐబి నుండి మొదలుకుని ఎల్లమ్మ గుడి వరకు బోనాలను ఊరేగించారు. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఈ బోనాల ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆశాడమాసం అత్యంత పవిత్రమైన మాసం అన్నారు. ఆశాడ మాసం సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించడం తరతరాలుగా వస్తున్న ఆచారం అన్నారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ లు శైలేష్ రెడ్డి, కృష్ణ, అశ్విన్, కాంగ్రెస్ నాయకుడు శ్రీశైలం, కుమ్మరి సంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## సొసైటీకి చెందిన భూములు

# అన్యాక్రాంతానికి గురయ్యాయి

**విద్యుత్ నగర్ వాటర్ ట్యాంక్ మెయిన్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష**





**రామచంద్రపురం, జూన్ 19(నినాదం) :** రామచంద్రపురం భారతి నగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్ నగర్ కాలనీ సొసైటీకి చెందిన భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని ఆరోపిస్తూ, వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాలనీ సభ్యుడు గుండాల ముఖేష్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ నగర్ వాటర్ ట్యాంక్ సెంటర్ వద్ద రిలే నిరాహార దీక్ష ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ నగర్ ఎంఐజీ ఫేజ్--2 కాలనీ 2000 సంవత్సరంలో సుమారు 125 ఎకరాల విస్తీర్ణంలో బీహెచ్ఈఎల్ కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్ హౌసింగ్ కాలనీగా ఏర్పాటైందన్నారు. ప్రస్తుతం కాలనీలో సుమారు 1,924 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. కాలనీ ఏర్పడినప్పటి నుంచి కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పడి, ఇప్పటి వం-కు ఐదుసార్లు ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. అయితే, ఈ కాలంలో సొసైటీకి చెందిన విలువైన భూములను తక్కువ ధరలకు లీజు పేరుతో ప్రైవేటు సంస్థలకు, విద్యాసంస్థలకు అప్పగించడం జరిగిందని ఆరోపించారు. లీజు పేరుతో కాలనీ ఆస్తులను శాశ్వతంగా కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ ఏర్పడి 26 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఫైనల్ లేఔట్ రాకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కాలనీకి కేటాయించాల్సిన 10 శాతం కమ్యూనిటీ ల్యాండ్ అందుబాటులో లేకపోవడం వల్లే ఫైనల్ లేఔట్ పెండింగ్‌లో ఉందని పలువురు కాలనీవాసులు చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. భవిష్యత్ తరాల అవసరాల కోసం వినియోగించాల్సిన ఖాళీ స్థలాలను సొసైటీ నిర్వాహకులు ఇష్టానుసారంగా లీజుల పేరుతో ఇతరులకు అప్పగించడం వల్ల కాలనీ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, సహకార శాఖ, సంబంధిత ప్రభుత్వ అధికారులు సమగ్ర విచారణ జరిపి, కాలనీ భూముల అసలు స్థితిగతులు, లీజుల వివరాలు, ఆర్థిక లావాదేవీలు, భూముల వినియోగంపై పూర్తి సమాచారాన్ని కాలనీవాసులకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే, విచారణ పూర్తయ్యే వరకు సొసైటీ ఎన్నికలను నిర్వహించకూడదని, భూముల అంశంలో పూర్తి పారదర్శకత తీసుకొచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని గుండాల ముఖేష్ రెడ్డి కోరారు. కాలనీ రిలే నిరాహార దీక్షకు పలువురు కాలనీ సభ్యులు, యువకులు హాజరై సంఘీభావం ప్రకటించారు.

**బంగారు మైసమ్మ అమ్మవారికి సాక సమర్పించి**

## ప్రత్యేకపూజలు నిర్వహించిన మహిళలు



**మల్కాజిగిరి, జులై 19 (నినాదం):** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ లోని శ్రీ బంగారు మైసమ్మ అమ్మ వారి దేవాలయం వద్ద ఆషాడ మాసం మొదటి ఆదివారం సందర్భంగా కాలనీలోని మహిళలు అందరూ కలిసి కట్టుగా వచ్చి సాక పోసి, దీప, నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాడ మాసంలో వర్షాకాలం ప్రారంభమై, ప్రకృతిలో మార్పులు చోటుచేసుకుంటాయని, మనకు ఇష్టమైన దేవతలను పూజించుకోవడం జరుగుతుందని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ బోనాల ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనవా యితి అని, ఈ ఆదివారం నుండి బోనాలు ముగింపు వరకు మహిళలు బోనాలను ఎంతో వైభవంగా జరుపు కుంటారాని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ లోని మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## చన్ గోముల్ ఎస్సై భరత్ రెడ్డిని సస్పెండ్ చేయాలి

**బుస్స చంద్రయ్య**



**కొడంగల్, జులై 19(నినాదం):** పూడూరు మండలం చన్ గోముల్ ఎస్సై భరత్ రెడ్డిని సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. పూడూరు మండలంలోని సోమన్ గుర్తి, చన్ గోముల్, అంగడి చిట్టంపల్లి, కండ్లపల్లి వంటి గ్రామాల్లో రైతులు అనేక బెదిరింపులకు ,ప్రలోభాలకు గురై ఎస్సై భరత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తే, న్యాయం చేయాల్సిన తాను ఫిర్యాదు దారుల పైనే కేసులు నమోదు చేస్తున్నాడని ఆరోపించారు. ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసు అధికారి ఇలాంటి దురాఘతాలకు పాల్పడడం సరికాదని హెచ్చరించారు. చన్ గోముల్ ఎస్సై భరత్ రెడ్డి పై ఉన్నతాధికారులు విచారణ జరిపి, సస్పెండ్ చేయాలని దుద్యాల మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో మహేష్, అంజయ్య, నరేష్, పి.మహేష్, వెంకటేష్, రాములు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన



**కోదాడ,జూలై 19(నినాదం):** కోదాడ పట్టణంలో రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టడంతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి భవనం పూర్తయితే కోదాడ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని వసతులతో కూడిన ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ దశరథ్ సంబంధిత అధికారులు ఉన్నారు.

## రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో..

# వాహనదారుల ఇబ్బందులు

**పట్టించుకోని అధికారులు**

**జవహర్ నగర్, జూలై 19 (నినాదం):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో 100 ఫీట్ల ప్రధాన రహదారి విస్తరణ లెవలింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అయితే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే పనులు చేస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ దారి గుండా వెళ్లే వాహనదారుల బాధలు వర్ణనాతీతం. ఇకనైనా అధికారులు ముందే వాటినీ తొలగించి రోడ్డు వేసి ఉంటే బాగుండేదని ఇప్పటికైనా స్తంభాలను పక్కకు జరిపి రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని తద్వారా ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు వాహనదారులు, కోరుతున్నారు.





## గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా 'ఇన్వెస్ట్‌మెంట్ సెర్మనీ'

**రాజేంద్రనగర్, జూలై 19 (నినాదం):** అత్తాపూర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం (ఇన్వెస్ట్‌మెంట్ సెర్మనీ) కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. పాఠశాల నూతన విద్యార్థి సంఘం నాయకులను ఎన్నుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారితో పాటు విహెచ్‌పి కో-ఆర్డినేట్ సభ్యులు ఇంద్రారెడ్డి, సురేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు ఈ వేడుకలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను, క్రమశిక్షణను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు.

**బాధ్యతాయుతంగా వ్యవహరించాలి:**

పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు మాట్లాడుతూ... విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల క్రమశిక్షణను కాపాడటంలో నూతన విద్యార్థి నాయకులు కీలక పాత్ర పోషించాలని, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.




**ప్రమాణ స్వీకారం.. బ్యాడ్జీల ప్రదానం**

ఈ సందర్భంగా పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, వివిధ హౌస్ లీడర్లకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా బ్యాడ్జీలను, స్కార్ఫ్‌లను బహూకరించి ప్రమాణ స్వీకారం చేయించారు. తాము స్కూల్ నిబంధనలకు కట్టుబడి, బాధ్యతాయుతంగా నడుచుకుంటామని విద్యార్థి నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావ నేపథ్యంలో నేడు మంత్రుల సమీక్ష

**జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**

**నల్లగొండ ప్రతినిధి జులై 19( నినాదం ):** ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక పై సోమవారం ఉదయాదిత్య భవన్లో నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధుల బృందం సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదివారం లో తెలిపారు. జిల్లా పార్లమెంట్ సభ్యులు ,శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి జిల్లా అధికారులు హాజరవుతున్న ఈ సమావేశానికి అవసరమైన నల్గొండ ,సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వారీగా ఎల్ నినో ప్రభావిత పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు వివరించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా అధికారులందరూ సోమవారం నిర్వహించే సమీక్ష సమావేశానికి అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు సమీక్షలో భాగంగా ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేలా జిల్లాస్థాయి కార్యచరణ ప్రణాళిక పై అధికారులకు దిశా, నిర్దేశం చేస్తారని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యదావిధిగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని, జిల్లా రెవెన్యూ అధికారి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.



ఏర్పాట్ల విషయమై ఆదివారం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## ఉచిత ఎముకల వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్

**రామచంద్రపురం, జూలై 19(నినాదం) :** భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి కాలనీలోని బీ పార్క్ ప్రాంగణంలో, బీహెచ్ఈఎల్ ఎంఐజి హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో, యశోద ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత ఎముకల వైద్య శిబిరానికి భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో యశోద ఆసుపత్రికి చెందిన ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ కీర్తి, డాక్టర్ నిఖిల్ పాల్గొని కాలనీ వాసులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు అందించారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వారి నివాస ప్రాంతంలోనే ఉచితంగా అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యంగా వృద్ధులు (సీనియర్ సిటిజన్లు) ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ ఎంఐజి కాలనీ అధ్యక్షులు రాజు, డైరెక్టర్ రాధాకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాణి యాదవ్, సంపత్ గౌడ్, రాకేష్, అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- విద్యాధికారి ఎండి సలీం షరీఫ్

**కోదాడ,జూలై 19(నినాదం):** చదువుతోపాటు విద్యార్థులు క్రీడలో రాణించాలని కోదాడ మండలం విద్యాధికారి ఎండి సలీం షరీఫ్ అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఇటీవల పంజాబ్ నగరంలో నిర్వహించిన జాతీయ షూటింగ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొన్న కోదాడ పట్టణానికి చెందిన చరణ్‌ను మండల విద్యాధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సీపీఐ నాయకులు, బీకేఆర్ ట్రస్ట్ చైర్మన్ బద్దం భద్రారెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, టీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షులు ఎస్కే నయీమ్, చెరుకు అశోక్, విష్ణువర్ధన్ రావు, బద్రి గౌడ్, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎస్కే ఖలీల్ భాయ్, పంది కళ్యాణ్, కర్ల కాంతారావు, ఈదుల కృష్ణయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.



## చాకచక్యంగా దొంగను పట్టుకున్న పోలీసులు

**కొల్చారం జులై 19 ( నినాదం):** మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని నాయిని జలాల్పూర్ గ్రామానికి చెందిన ఫిర్యాదారులకు నాయిని రాయన్న తండ్రి కిష్టయ్య వయసు 62 సంవత్సరాలు కులం మున్నూరు కాపు వృత్తి వ్యవసాయం గారి ఇంట్లో తేదీ 06.07.2026 సోమవారం నాడు గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి దొంగతనం చేసినారని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు అయినది. ఇట్టి దొంగతనం విషయంలో ఈరోజు తేదీ 19.07.2026 ఆదివారం నాడు ఏడుపాయలు జంక్షన్ వద్ద కొల్చారం పోలీస్ వారు ఎస్ఐ గారి ఆధ్వర్యంలో వెహికల్ చెకింగ్ చేయుచుండగా నాయిని జలాల్పూర్ గ్రామానికి చెందిన దుబ్బగళ్ల అలియాస్ నిరుడి కృష్ణ తండ్రి రాములు వయస్సు 43 సంవత్సరంలో కులం ఎస్సీ మాల వృత్తి కూలి పని అను వ్యక్తి ప్యాసింజర్ ఆటోలో మెదక్ వైపు వెళుతుండగా అట్టి ఆటోను ఆపి విచారించగా అట్టి వ్యక్తి సమాధానము చెప్పనందున కొల్చారం పోలీస్ స్టేషన్కు తీసుకొని వచ్చి తగు విచారణ చేయగా అట్టి వ్యక్తి నాయిని జలాల్పూర్ గ్రామానికి చెందిన నాయిని రాయన్న గారి ఇంట్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అట్టి వ్యక్తి నుండి అర్ధ తులం బంగారం ఉంగరం మరియు 51 వేల నగదు రూపాయలు స్వాధీనపరచుకొని అట్టి వ్యక్తి నీ రిమాండ్ నిమిత్తం జే ఎఫ్ సి ఎం మెదక్ కోర్టుకు పంపించామని తెలియజేశారు.




## ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయాల


**తాత్కాలిక ఎంపిక జాబితా విడుదల**



**కోదాడ, జూలై 19 (నినాదం):** కోదాడ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు సంబంధించి ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల 1:1 తాత్కాలిక ఎంపిక జాబితాను మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఈఆర్‌సీ)లో ప్రదర్శించినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలంలోని ఎంపీపీఎస్ గర్ల్స్ ఆజాద్ నగర్, శ్రీనగర్ కాలనీ, బీసీ కాపుగల్లు, చీమిర్యాల, నల్లబండగూడెం, యూపీఎస్ రెడ్లకుంట పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. జిల్లా అధికారుల పరిశీలన, నిర్ధారణ అనంతరం తుది నియామక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## భగ్గుమంటున్న నాన్‌వెజ్ ధరలు..

**సామాన్యుడికి చుక్కలు!**




**కోదాడ ప్రతినిధి జులై 19 (నినాదం):** నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న వేళ కోదాడ పట్టణంలో నాన్‌వెజ్ ధరలు కూడా ఒక్కసారిగా భగ్గుమన్నాయి. చికెన్, మటన్, చేపలు, గుడ్ల ధరలు భారీగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. వారానికి ఒకసారి అయినా నాన్‌వెజ్ వండుకునే కుటుంబాలు కూడా ఇప్పుడు ఖర్చును తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం స్కిన్ చికెన్ కిలో రూ. 280, స్కిన్‌లెస్ చికెన్ రూ. 300, బోన్‌లెస్ చికెన్ రూ. 500కు విక్రయిస్తున్నారు. మటన్ ధర కిలో రూ. 900కు చేరగా, చేపల ధర కిలో రూ. 200, 30 గుడ్ల ట్రే రూ. 225 వరకు పలుకుతోంది. గత కొన్ని రోజులుగా ధరలు క్రమంగా పెరుగుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ధరల పెరుగుదలతో చాలామంది కుటుంబాలు నాన్‌వెజ్ కొనుగోలు పరిమాణాన్ని తగ్గించగా, మరికొందరు పూర్తిగా కొనుగోలు చేయకుండా ప్రత్యామ్నాయ ఆహారాల వైపు మొగ్గు చూపుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పెరిగిన ధరలను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని, సామాన్యులకు అందుబాటు ధరల్లో నాన్‌వెజ్ లభించేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు సభ్యత్వమే బలం

సిరిసిల్ల నియోజకవర్గంలో టీయూడబ్ల్యూజే హెచ్-143 సభ్యత్వ నమోదు కార్యక్రమం

అక్రిడిటేషన్, బస్‌పాస్, ఇళ్ల స్థలాల కోసం ఉద్యమానికి ప్రణాళికలు: జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా



**రాజన్న సిరిసిల్ల, (నినాదం):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) సభ్యత్వ నమోదు కార్యక్రమం ఊపందు కుంది. రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారా యణ నాయక త్వంలో కొనసాగు తున్న సంఘం సభ్యత్వ విస్తరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్య క్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల నియోజకవర్గంలోని తంగళ్లపల్లి, ఎల్లారెడ్డి పేట, ముస్తాబాద్ మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యత్వం పొందిన జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు రసీదులు అందజేశారు. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రత, హక్కుల పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే హెచ్-143 నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో బలమైన సంఘటిత శక్తి అవసర మని, సభ్యత్వ నమోదు ద్వారా సంఘం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు, ఆర్టీసీ బస్‌పాస్ సౌకర్యం, ఇళ్ల స్థలాల కేటాయింపు వంటి కీలక అంశాలపై ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసే విధంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కేవలం డిమాండ్లు చేయడం మాత్రమే కాకుండా, ప్రభు త్వంతో చర్చలు, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సంఘం సిద్ధంగా ఉందని చెప్పారు. అక్రిడిటేషన్, బస్‌పాస్, ఇళ్ల స్థలాలు వంటి అంశాలు చాలా కాలంగా జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల ప్రవీణ్ కుమా ర్, క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ సయ్యద్ రసూల్, జిల్లా కమిటీ సభ్యుడు కమటాల విజయ్, వేము లవాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి బాబ్జి, సీనియర్ పాత్రికేయులు బుగ్గ కృష్ణమూర్తి, ఎల్లారెడ్డి పేట ప్రెస్ క్లబ్ బాధ్యులు బాలరాజు, ముస్తాబాద్ బాధ్యులు లక్ష్మీనారాయణతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# విశ్వ శాంతి కోసం 91వ మహాయాగ మహోత్సవం

పీఠాధిపతి తో సందర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి జులై 19 (నినాదం):** విశ్వశాంతి, లోకక్షేమం, సమస్త జీవుల శ్రేయస్సు కోసం కల్వకుర్తి పట్టణంలో ఆదివారం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ పీఠాధిపతి పరమపూజ్య శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలిపారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ రహదారి సమీపంలో మున్సిపల్ కార్యాలయం పక్కనున్న బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో సాయంత్రం ఈ మహాయాగం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ కాలచక్రం, విష్ణు పంచాయతనం, ఆయుత చండీ, అతిరుద్ర మహాయాగం, శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం, చతుర్వేద పారాయణం, మహాగణపతి, మహాసౌర, సుదర్శన, లక్ష్మీనారాయణ సహిత పలు వైదిక మహాక్రతువులు నిర్వహించనున్నట్లు స్వామీజీ వెల్లడించారు. ఈ మహాయాగం ద్వారా ప్రపంచ శాంతి, ప్రజల సుఖ సంతోషాలు, పాడిపంటలు, రోగ నివారణ, మానసిక ప్రశాంతత, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండడం, సమాజంలో సిరిసంపదలు, ఆరోగ్యశ్రేయస్సు చేకూరాలని ప్రత్యేక సంకల్పంతో యాగం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. యాగ మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై యాగంలో పాల్గొని దైవానుగ్రహం, యాగఫలాన్ని పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి బాలాజీ, మున్సిపల్ చైర్పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు జూలూరి రమేష్ బాబు, డిసిసి కార్యదర్శి, చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెక్కర బాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్లు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# సింగారం వాటర్ పంప్ హౌస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ కొండ శ్వేత సత్య యాదవ్





**నారాయణపేట ప్రతినిధి, జులై 19, (నినాదం):** పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నారాయణపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కొండ శ్వేత సత్య యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం 7 గంటలకే సింగారం సమీపంలోని వాటర్ పంప్ హౌస్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా స్వయంగా పంప్ హౌస్ పైకి వెళ్లి నీటి నిల్వలు, పంపింగ్ వ్యవస్థ పనితీరును ఆమె పరిశీ లించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పంపింగ్ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్య వేక్షించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ముఖ్యమైన ఆదేశాలు ఇచ్చిన చేర్పర్సన్, వాటర్ పంప్ హౌస్ పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని, క్రమం తప్పకుండా బ్లీచింగ్, క్లీనింగ్ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నారాయణపేట పట్టణానికి రోజుకు సుమారు 6.6 (మీణ) నీటిని సరఫరా చేస్తున్నట్లు చైర్‌పర్సన్ వెల్లడించారు. నారాయణపేట పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే మా మొదటి ప్రాధాన్యత. ఇందుకోసం మున్సిపాలిటీ తరఫున అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం అని అన్నారు. అయితే, నీరు ఎంతో విలువైనది కాబట్టి ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకుంటూ మున్సిపాలిటీకి సహకరించాలి ఈ సందర్భంగా కోరారు.

# నవ్యభారతిలో ఫీడే రేటెడ్ ఆటగాడితో ఏకకాల చెస్ పోటీలు



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 19 (నినాదం)** :అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో ఫీడే రేటెడ్ చెస్ క్రీడాకారుడు, కోచ్ మనోజ్ కుమార్ విట్టాపు చేత ఏకకాలంలో 10 మంది క్రీడాకారులతో ప్రత్యేక చెస్ కార్యక్రమాన్ని నవ్యభారతి గ్లోబల్ పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ ఏకకాలంలో పదిమంది క్రీడాకారులతో చెస్ ఆడి తన ప్రతిభను ప్రదర్శించారు. ఇందులో ఫీడే రేటెడ్ క్రీడాకారుడు మనోజ్ కుమార్ పై నవ్యభారతి గ్లోబల్ పాఠశాల క్రీడాకారుడు జై (7వ తరగతి) విజయం సాధించడం విశేషం. మనోజ్ కుమార్ అనంతరం క్రీడాకారులకు చెస్‌లోని మెలకువలను నేర్పించారు. నవ్యభారతి గ్లోబల్ పాఠశాల చైర్మన్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలోని చెస్ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఫీడ్ రేటెడ్ చెస్ క్రీడాకారుడు, కోచ్ మనోజ్ కుమార్‌ను ప్రత్యేకంగా నిజామాబాద్‌కు ఆహ్వా నించామని తెలిపారు. విద్యార్థులు ప్రత్యక్షంగా ఉన్నత స్థాయి క్రీడాకారుడి ఆటను వీక్షించడం ద్వారా కొత్త వ్యూహాలను నేర్చుకునే అవకాశం లభిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల కృషి చేస్తోందన్నారు. ఫీడే రేటెడ్ చెస్ క్రీడాకా రుడు, కోచ్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ, చెస్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదని, ఆలో చనా శక్తి, ఏకాగ్రత, ఓర్పు, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించే గొప్ప మేధో క్రీడ అని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణతో సాధన చేస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమా లు క్రీడాకారులకు నిర్వహించడం వారిలోనే నైపుణ్యతను వెలికి తీయడమే అని అలాంటి కార్యక్రమాన్ని నవ్యభారతి గ్లోబల్ పాఠశాల యాజమాన్యం నిర్వహించడం అభినందనీయ మని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సరిత, సుధీర్, వేమా, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్ లు, తల్లిదండ్రులు, విద్యార్థులు, క్రీడాకా రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సబ్సిడీపై పండ్ల తోటలకు డ్రిప్పు సౌకర్యం

**కోడేరు,జులై 19 (నినాదం):**. కొత్తగా పల్లె తోటలు పెట్టుకునేవారు మామిడి తోటలకు సబ్సిడీపై డ్రిప్పు సౌకర్యం అందుబాటులో ఉందని హార్టికల్చర్ అధికారి లక్ష్మణ్ తెలిపారు ఆసక్తి కలిగిన రైతులు కొత్తగా నాటుకున్న పంట తోటలు మామిడి తోటలు కూరగాయ తోటలకు డ్రిప్పు సౌకర్యం సబ్సిడీపై ఉందని ఆయన అన్నారు ఎస్టి ఎస్సి రైతులకు 90% సబ్సిడీ సన్నకారు రైతులకు 80 శాతం రాయితీ పెద్దకారు రైతులకు 70 శాతం రాయితీ ఉందని ఆయన అన్నారు తెలంగాణ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు ఆసక్తి కలిగిన రైతులు మీ సేవలో దరఖాస్తు చేసుకొని పట్టాదారు పాసుబుక్కు జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ బ్యాంకు బుక్కు జిరాక్స్ ఒక పాస్పోర్ట్ సైజు ఫోటో దరఖాస్తు ఫారానికి అతికించి ఉద్యానవన శాఖ కార్యాలయము కొల్లాపూర్ లో సమర్పించాలని ఆయన అన్నారురైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

# ఖమ్మం జిల్లాకు సీఎం రాక.. ముమ్మర ఏర్పాట్లు

అంజనాపురంలో గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దివాకర టీఎస్
ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం





**ఖమ్మం ప్రతినిధి, జూలై 18: (నినాదం ):** నేడు ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. వైరా నియోజకవర్గం కొణిజెర్ల మండలం అంజనాపురంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి ప్రారంభించను న్నారు. కలెక్టర్ దివాకర టీఎస్ శనివారం సభ ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాం తాలు, వేదిక, ఇతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రోటోకాల్‌కు అనుగు ణంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, మీడియాకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని, వీఐపీ పాస్‌ల జారీని నియంత్రించాలని కలెక్టర్ సూచించారు. మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్‌ను ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు ప్రతి శాఖ తన బాధ్య తలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, సభ ప్రాంగణం, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. మీడియా, అధికారులు, వీఐపీలు, వీవీఐపీలకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సభలో ఆడియో, వీడియో వ్యవస్థలు, ఎల్ఈడీ స్క్రీన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అంబులెన్స్‌లు, నిరంతర విద్యుత్ సరఫరా, స్టాండ్‌బై జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఆర్డీవో శ్రీనివాస్, పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మణుగూరు ఘటనపై నిష్పక్షపాత విచారణకు అటవీ శాఖ ఆదేశం

బీట్ అధికారి సస్పెన్షన్.. ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు

ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు మహిళల గౌరవానికి అత్యంత ప్రాధాన్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారి

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూలై 19(నినాదం):** మణుగూరు డివిజన్‌లో ఈ నెల 17న మొక్కల పెంపకం, అటవీ భూమి పరిరక్షణ పనుల సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త ఘటనపై అటవీ శాఖ తీవ్రంగా స్పందించింది. సామాజిక మాధ్యమాలు, మీడియాలో వస్తున్న వీడియోలు, వివాదాస్పద అంశాలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణకు ఆదేశిస్తూ జిల్లా అటవీ అధికారి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్షేత్రస్థాయిలో పారదర్శకతను, బాధ్యతను నిర్ధారించేందుకు తక్షణ పరిపాలనా చర్యల్లో భాగంగా.. వీడియోలో మహిళతో తోపులాటకు దిగినట్లు కనిపిస్తున్న ఫారెస్ట్ బీట్ అధికారిని విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇది కేవలం ప్రాథమిక చర్య మాత్రమేనని, విచారణలో దోషిగా తేలేవరకు దీనిని ముందస్తు నిర్ణయంగా భావించరాదని స్పష్టం చేశారు.

**ఉన్నత స్థాయి కమిటీతో విచారణ**

ఈ ఘటన వెనుక ఉన్న పూర్తి వాస్తవాలను నిష్పక్షపాతంగా వెలికితీసేందుకు కిన్నెరసాని ఫారెస్ట్ డివిజనల్ అధికారి అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి విచారణ కమిటీని అటవీ శాఖ ఏర్పాటు చేసింది. చంద్రుగొండ, యానంబైల్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఇందులో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ క్షేత్రస్థాయి అధికారుల వివరణలతో పాటు అసలు వీడియోలు, ఫోటోలు, ప్రెస్ నివేదికలు మరియు అధికారిక రికార్డులను భద్రపరిచి అందజేస్తున్నట్లు శాఖ తెలిపింది. విచారణలో ఎవరిదైనా నిర్లక్ష్యం, దుర్వ్యవహారం లేదా అవసరాన్ని మించిన బలప్రయోగం జరిగినట్లు ఆధారాలతో నిరూపితమైతే చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని అటవీ శాఖ హెచ్చరించింది. అలాగే పోలీసు విచారణకు సైతం తాము పూర్తి స్థాయిలో సహకరిస్తున్నట్లు వెల్లడించింది.

**శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు : అటవీ శాఖ విజ్ఞప్తి**

ఈ ఉదంతాన్ని సామాజిక మాధ్యమాల్లో కొందరు రంగు పులిమే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో.. దీనిని ఏ రెండు వర్గాల లేదా సమాజాల మధ్య వివాదంగా చూడరాదని అటవీ శాఖ గట్టిగా విజ్ఞప్తి చేసింది. విలువైన ప్రభుత్వ అటవీ భూములను కాపాడటం, మొక్కల పెంపకం చేపట్టడం శాఖ చట్టబద్ధమైన బాధ్యత అని గుర్తుచేసింది. అయితే, అదే సమయంలో ప్రతి పౌరుని, ముఖ్యంగా మహిళల భద్రత, గౌరవానికి తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది. కాగా, సదరు ఘటనకు ముందు జరిగిన పరిణామాలు, ప్రభుత్వ పనులకు కలిగిన ఆటంకం, యూనిఫామ్‌లో ఉన్న అటవీ సిబ్బందిపై జరిగినట్లు చెబుతున్న దాడి వంటి అన్ని కోణాలను నిష్పక్షపాతంగా పరిశీలించాల్సి ఉందన్నారు. ?రూర ప్రాంతాలలో, క్లిష్ట పరిస్థితులలో విధులు నిర్వర్తించే సిబ్బందికి సంస్థాగత మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేస్తూనే.. భవిష్యత్తులో ఇలాంటి సున్నితమైన కార్యక్రమాలను ముందస్తు ప్రణాళిక, పోలీసు సమన్వయం, మహిళా సిబ్బంది ఉనికి వంటి సరైన నిరంతర వీడియో రికార్డింగ్‌తో మాత్రమే నిర్వహిస్తామని అటవీ శాఖ స్పష్టం చేసింది. అసంపూర్తి లేదా ఎంపిక చేసిన వీడియోల ఆధారంగా ఎవరూ ముందస్తు నిర్ణయాలకు రావద్దని, పూర్తి వాస్తవాలు బయటకు వచ్చేందుకు ప్రజలు, మీడియా సహకరించాలని జిల్లా అటవీ అధికారి కోరారు.

# 9మంది పేకాట రాయుళ్లు అరెస్టు..


నగదు మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్న పోలీసులు



**కల్వకుర్తి జులై 19 (నినాదం):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న భారీ పేకాట నెట్‌వర్క్‌ను స్థానిక పోలీసులు గుట్టురట్టు చేశారు. ఒక ఫంక్షన్ హాల్ వేదికగా, పక్కా ప్లాన్ ప్రకారం నిర్వహిస్తున్న ఈ జూద స్థావరంపై కల్వకుర్తి ఎస్ఐ-2 నేతృత్వంలోని పోలీస్ బృందం మెరుపు దాడి నిర్వహించింది. విశ్వసనీయ సమాచారం మేరకు కల్వకుర్తి పట్టణంలోని 'శుభం ఫంక్షన్ హాల్' పై పోలీసులు ఏకకాలంలో దాడికి దిగారు. పోలీసుల రాకను గమనించిన నిర్వాహకులు, జూదరులు అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, అప్పటికే వ్యూహాత్మకంగా మోహరించిన పోలీస్ సిబ్బంది నిందితులను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు బెట్టింగ్‌గా పెడుతూ, మూడు ముక్కల జూదం ఆడుతున్న తొమ్మిది మంది పురుషులను పంచుల సమక్షంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో పట్టుబడిన నిందితులు కల్వకుర్తి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వివిధ రంగాల వ్యక్తులుగా తేలింది. వీరిలో కల్యాణ్ నగర్‌కు చెందిన ఆంద్రె రవి మరియు దాసర్ల శ్రీను, పద్మశ్రీ నగర్‌కు చెందిన ఆంద్రె భరత్, జేపీ నగర్‌కు చెందిన పత్లావత్ సికందర్ మరియు పత్లావత్ లస్కర్ ఉన్నారు. అలాగే ఇందిరానగర్‌కు చెందిన కంతు బాలచందర్ రావు, కోట్ర గ్రామానికి చెందిన కలూరి కుమార్, తిలక్ నగర్‌కు చెందిన కాకమాని కిశోర్, వాసవి నగర్‌కు చెందిన పత్లావత్ రఘు ఈ జూదంలో భాగస్వాములుగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఈ ముఠా సదరు ఫంక్షన్ హాల్‌ను వేదికగా చేసుకుని నిరంతరాయంగా ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విచారణలో అంగీకరించారు. ఘటనా స్థలం నుండి పెద్ద మొత్తంలో నగదు, మొబైల్ ఫోన్లు పేకాట ముక్కలను స్వాధీనశీ చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఉమ్మడి పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

అలంపూర్ నియోజకవర్గం జేఏసీ చైర్మన్ నాయకులు రామ్మోహన్ డిమాండ్



**గద్వాల బ్యూరో జూలై 19( నినాదం):** ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ, అలంపూర్ నియోజకవర్గం చైర్మన్ రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విస్తృత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి అలంపూర్ ప్రాంతం నుంచి జేఏసీ నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఉమ్మడి జిల్లాలోని పలు కీలక ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పూర్తి కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రజాపోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు గార్లపాడు భూషణం, సర్పంచుల సంఘం జిల్లా నాయకుడు తిమ్మాజిపల్లె నాగేష్ యాదవ్, నాయకులు హనుమంతు, ఉద్యమకారుల జిల్లా కార్యదర్శి చెన్నిపాడు దుబ్బన్న, రఘు, లక్ష్మన్న, శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలను ఏకం చేసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం

పాల్గొన్న రోటరీ క్లబ్ ఆఫ్ అధ్యక్షుడు రొటేరియన్ సబ్బని కృష్ణహరి,కార్యదర్శి సోమిశెట్టి సంతోష్ కుమార్.




**కామారెడ్డి రూరల్,జులై 19 ( నినాదం ) :** రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం పర్యావరణ దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. యు. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ హాస్పిటల్,దోమకొండ హాజరై పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ గవర్నర్ రోటరీ క్లబ్ ఆఫ్ జితేంద్ర మలాని రోటరీ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినం దిస్తూ,మొక్కల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. క్లబ్ అధ్యక్షుడు రోటరీ క్లబ్ ఆఫ్ సబ్బని కృష్ణహరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రోటరీ క్లబ్ ఆఫ్ సోమిశెట్టి సంతోష్ కుమార్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఐత బాలకిషన్, జయపాల్ రెడ్డి,శ్రీశైలం,వెంకటరమణ, సుధాకర్,డాక్టర్ విజయ్ కుమార్,ఖజాంచి మోటూరి భైరయ్యతో పాటు క్లబ్ సభ్యులు ఇతర రొటేరియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా క్లబ్ కార్యదర్శి సోమిశెట్టి సంతోష్ కుమార్ ముఖ్య అతిథులు,గౌరవ అతిథులు,పాల్గొన్న సభ్యులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిరంతరం నిర్వహిస్తామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

# పాలడుగు పల్లె దవాఖాన జబ్బున పడింది

ఐద్వా, వ్యకాస డివిజన్ నాయకులు విమర్శ





**వైరా, జులై 19( నినాదం):** అనేక సమస్యలతో సతమతమవుతూ పాలడుగు పల్లె దవాఖాన జబ్బున పడిందని ఐద్వా, వ్యకాస నాయకులు గుడిమెట్ల రజిత, బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్ విమర్శించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వైరా మండలం పాలడుగు గ్రామంలోని పల్లె దవాఖానా సమస్యలపై చేసిన సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ పల్లె దవాఖానా బిల్డింగ్ శిథిలావస్థకు చేరిందని, వర్షం వస్తే బిల్డింగ్ కురుస్తుందని, కూలడానికి సిద్ధంగా ఉన్నదని, హాస్పిటల్ బిల్డింగ్ ఎప్పుడు కూలి పోతుందో అని సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. హాస్పిటల్లో బాత్ రూమ్స్ సరిగా లేవని, బాత్ రూమ్స్ లో నీళ్ళు రాక మహిళా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, హాస్పిటల్ చుట్టు ప్రక్కల పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉన్నదని అన్నారు. హాస్పిటల్ కు నూతన బిల్డింగ్ నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి పని చేసే ఆశ వర్కర్లకు కనీస వేతనం 18000/- ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అన్నారు. సుగర్, బిపి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నామని, సీజనల్ వ్యాధులకు కూడా మందులు ఇస్తున్నామని ఎఎన్ఎం బి. పద్మ సర్వే బృందానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా వైరా రూరల్ అధ్యక్షురాలు బాణాల వెంకట్రావమ్మ, ఐద్వా వైరా రూరల్ మాజి కార్యదర్శి షేక్. షహనాభి తదితరులు పాల్గొన్నారు.

# సింధును అభినందించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్.



**ఖమ్మం, జులై 19( నినాదం ):** జపాన్ ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శనతో ఛాంపియన్‌గా నిలిచి మరోసారి భారత కీర్తిని అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించిన భారత స్టార్ షట్లర్ పి. వి. సింధుకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అభినందనలు తెలిపారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ తిరిగి అత్యున్నత స్థాయిలో నిలవడం పట్ల ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో జరగనున్న ప్రపంచస్థాయి పోటీల్లో కూడా సింధు ఇదే విజయ పరంపరను కొనసాగించాలని ఆకాంక్షించారు.

# కిడ్నీవ్యాధితో బాధపడుతున్న మహిళకు సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి సాయం



**కల్వకుర్తి జులై 19 (నినాదం):** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తున్న సిబ్బంది కురుపయ్య భార్య రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బతినడంతో, గాంధీ ఆసుపత్రి ఐసి యూ లో తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పడకల్ గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి వెంటనే గాంధీ ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఈ సందర్భంగా వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా అని 10,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో మొహమ్మద్ వాజిద్, బూరిగళ్ల రమేష్, జెనిగే నర్సింహా, మొహమ్మద్ గౌస్ రామస్వామి, అంజయ్య, మొహమ్మద్ బషీర్, బూరిగళ్ల నర్సింహా, రామలింగంనర్సింహా గ్రామపం చాయతీ సిబ్బంది పాల్గొన్నారు .

# శ్రీ చక్రేశ్వర ఆలయ నూతన అభివృద్ధి కమిటీకి ఘన సన్మానం



**బోధన్ ప్రతినిధి, జులై 19: (నినాదం ):** బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ నూతన చైర్మన్ లక్ష్మణ్ పటేల్, సభ్యులు సున్నం గంగాధర్ ,వీరప్పలను బిఆర్ఎస్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ మాజీ చైర్మన్ బిర్కూర్ బుజ్జి , చంద్రయ్య, నవీన్, నారాయణ, లోకం శ్రీనివాస్, శంకర్ గౌడ్, రవిశంకర్ గౌడ్,ప్రసాద్ కిరాణా,పూజారి లింగం,కన్ను గౌడ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడే విద్యార్థులకు ప్రేరణ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 19 (నినాదం) :** పాఠశాల దశలో విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయుడు దశాబ్దాల కాలం గడిచినప్పటికీ ప్రేరణగానే నిలబడతాడని తెలియజేయడానికి ఆదివారం రెంజల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం మరొమారు స్పష్టం చేసింది. 1979-80వ విద్య సంవత్సరం లో పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య అద్భుతంగా జరిగింది. నాలుగున్నర దశాబ్దాల తరువాత సుమారు 60 సంవత్సరాలు దాటిన వారంతా ఒకచోటకు చేరి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయు లను గౌరవ మర్యాదలతో సత్కరించడం సమాజంలో ఉపాధ్యా యుని పాత్ర ఇనుమునింపజేసింది. ముందుగా పాఠశాల ప్రాంగణంలోని సరస్వతీ మాత విగ్రహానికి ఉపాధ్యాయులు అందర్నీ మంగళ వాయిద్యాలతో తోడుకొని వచ్చి పూల వర్షం నడుమ సరస్వతీ మాతకు పూజ చేసి తదనంతరం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ప్రస్తుత పాఠశాల ప్రధాన అధ్యాప కులు, ఆ పాఠశాల పూర్వ విద్యార్థి ఆంజనేయులు అధ్యక్షత వహించగా విజయానందరావు, లక్ష్మీకాంత చారి, మధు కృష్ణ, రెడ్డి ప్రకాష్, దారం గంగాధర్ తది తర ఉపాధ్యాయులని సభా వేదికపై తీసుకుని వచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దీపారాధన చేసి గతించిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సీనియర్ ఉపా ధ్యాయుడైన విజయానంద రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఎల్లవేళలా విద్యార్థులకు ప్రేరణగానే ఉంటాడని అనడానికి ఈ సమావేశం రుజువు చేస్తుందని, 40 సంవత్సరాలకు పూర్వం చదు వు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించడం ద్వారా వారిలో ఉత్సా హాన్ని నింపారని విద్యార్థులను కొనియాడారు. విచిత్రమైన సంఘ టన ఏంటంటే ఈ నలభై ఆరు సంవత్సరాల లో చాలామంది విద్యా ర్థులు ఒకరినొకరు కలుసుకోనప్పటికీ ఈ సమావేశం కారణంగా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవన్నారు. 60 సంవత్స రాల పైబడిన వయసులో కూడా పదవ తరగతి విద్యార్థుల లాగే ప్రవర్తించడం వారిలో ఉన్న వినయ విధేయతలు ఉట్టిపడ్డాయి. ఈ ఆత్మీయ సమ్మేళనం అటు ఉపాధ్యాయులను ఇటు విద్యార్థులను ఉత్సాహ పరిచింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహణకు కృషిచేసిన నాటి విద్యార్థులు స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, సుదర్శన్ రాజ్, గంగాధర్ గౌడ్, మీరా సాబ్, బాలాచారి తదితరులను ఆనాటి మిత్రులందరూ అభినందించారు. ఉపాధ్యాయులను సత్కరించ డంతోపాటు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించడం ప్రత్యేకత సంతరించుకుంది.

# ఘనంగా మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు జయంతి వేడుకలు

**చొక్కారావు ఆశయాలు, నిజాయితీ రాజకీయాలే తమకు స్ఫూర్తి**

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**





**కరీంనగర్, జూలై 19(నినాదం) :** నగరంలో దివంగత మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు జువ్వాడి చొక్కారావు జయంతి వేడుకలను కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై చొక్కారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, చొక్కారావు తన రాజకీయ గురువని పేర్కొన్నారు. రాజకీయాల్లో పారదర్శకత, నీతి, నిజాయితీకి ఆయన ప్రతీకగా నిలిచారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని జిల్లాలో రాజకీయ ప్రస్థానం కొనసాగించామని తెలిపారు. చొక్కారావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగుతామని, ఆయన జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప్పుల అంజని ప్రసాద్, ఎం.డి. తాజ్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, మడుపు మోహన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పడిశెట్టి భూమయ్య, బోనాల శ్రీనివాస్, నిహాల్ అహ్మద్, వంగల విద్యాసాగర్, కామ్రెడ్డి రాంరెడ్డి, మాదాసు శ్రీనివాస్, కంకణాల అనిల్ కుమార్, కుంభాల రాజు కుమార్, తోట అంజయ్య, కొట్టే ప్రభాకర్, పెద్ది తిరుపతి, సాయిని తిరుపతి, షబాన మహమ్మద్, ఖలీల్, నాగుల సతీష్, ముక్క భాస్కర్, స్వప్న శ్రీ, బసవరాజ్ శంకర్, పెంట శేఖర్, రాచర్ల పద్మ, కుర్ర పోచయ్య, నెల్లి నరేష్, గుండారపు శ్రీనివాస్, వీర దేవేందర్, మార్కరాజు, బత్తిని చంద్రయ్య గౌడ్, సుంకరి గణపతి పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవే నా ధ్యేయం

**125 మంది లబ్ధిదారులకు 50లక్షల 58 వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించిన ఎమ్మెల్యే**



**నిర్మల్ ప్రతినిధి/భైంసా, జూలై19 (నినాదం):** రాజకీయాలకతీ తంగా ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్అన్నారు. ఆదివారం నియోజకవర్గం లోని భైంసా లోని ఎస్. ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లో 125మంది లబ్ధిదారులకు 55 లక్షల 58 వేల రూపాయల చెక్కులను పంపిణి చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రజలకు ఆరోగ్య పరంగా ఇబ్బందులు తలెత్తితే కొంత సహాయం చేయాలన్న ఉద్దేశంతో తన కార్యాలయంనే ముఖ్యమంత్రి సహాయ నిధి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా ఇద్దరు పి. ఏ లను నియమించి గతంలో కంటే ఎక్కువగా రెండున్నర సంవత్సరాల్లో 5000 మందికి ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయంగా ముందుకు సాగుతానని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీలు, మహిళా సమైక్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర అమ్మవారి ఆలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి 325 కోట్లు కేటాయించడం అదృష్టమేనన్నారు. అదేవిధంగా ఆలయ నిర్మాణం కోసం దాత 30 కోట్లు ఇవ్వడం శుభ సూచకమన్నారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, కుంటాల మండల నాయకులు బివి రమణారావ్, కుంటాల సర్పంచ్ గజేందర్, భైంసా పట్టణ, మండల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మరెడ్డి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుపోతుల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను అందించిన ఘనత ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ దే నన్నారు.. నియోజకవర్గం లో పెద్ద మొత్తంలో అభివృద్ధి కి నిధులు తెస్తున్న ఘనత ఆయనదే నన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి. గంగా ధర్, సర్పంచులు, నాయకులు, బిజెపి బాధ్యులు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ పేరుతో రైతుల భూములను లాక్కోవడం దుర్మార్గం

**ఎంపీలు ఈటెల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి**

**బహదూర్గుడ బాధితులకు బీజేపీ నేతల సంఘీభావం**

**న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు: తోకల శ్రీనివాస్ రెడ్డి, రాజ్ భూపాల్ గౌడ్**





**రాజేంద్రనగర్, జూలై19(నినాదం):** రాజేంద్రనగర్ నియోజ క వర్గం, శంషాబాద్ మండలంలోని బహదూర్గుడ గ్రామంలో బుల్లెట్ ట్రైన్ టర్మినల్ పేరుతో బాధితులకు తగిన న్యాయం చేయకుండా, రైతుల భూములను దౌర్జన్యంగా లాక్కోవడం సరైంది కాదని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆదివారం బహదూర్గుడ గ్రామంలో భూములు కోల్పోతున్న బాధితులకు సంఘీభావం తెలిపేందుకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ఎందుకంత చిన్నచూపు?**

ఈ సందర్భంగా ఎంపీలు, మాట్లాడుతూ.. వందల మంది రైతుల జీవనాధారమైన దాదాపు 650 ఎకరాల భూమిని అన్యాయంగా లాక్కునేందుకు ప్రయత్నించడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. గతంలో భూమి పట్టాలు ఇస్తామని నమ్మబలికి, ఇప్పుడు దౌర్జన్యంగా లాక్కోవడం ప్రభుత్వ నిరంకుశత్వానికి అద్దం పడుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యపై ఎందుకు స్పందించడం లేదని, ఎక్కడికి పోయారని వారు నిలదీశారు. పేద ప్రజలపై, రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకంత చిన్నచూపు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం ఆపబోం**

అనంతరం గ్రామంలోని బాధితులతో నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామస్తులు నష్టపోకుండా వారి యొక్క సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. రైతులకు తగిన న్యాయం జరిగే వరకు ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాధితులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని, ఈ పోరాటంలో ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 19(నినాదం) :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దపల్లి కిషన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్ పటేల్, రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం పటేల్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ పటేల్, ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంఘం బలోపేతం, సామాజిక అభివృద్ధి, యువతకు విద్యా--ఉపాధి అవకాశాల విస్తరణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, సామాజిక ఐక్యత సాధనే సంఘం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథులుగా మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్ పటేల్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పటేల్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దేవా స్వాతి రమేష్‌బాబు పటేల్, నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి పటేల్ హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కౌటాల, బెజ్జూర్, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), పెంచికల్పేట్, కాగజ్‌నగర్, దహెగాం, ఆసిఫాబాద్, రెబ్బెన, తీర్యాని, వాంకిడి, జైనూర్, కెరమెరి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో మున్నూరు కాపు కులబాంధవులు, మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జగడం సత్యనారాయణ, జిల్లా కోశాధికారి మణికొండ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో 50 పడకల ఆస్పత్రి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఆమనగల్లు, జూలై 19(నినాదం):** ఆమనగల్లు పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో, రూ. 17.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 50 పడకల ఆధునిక ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి భవన నిర్మాణ పురోగతి, వివిధ విభాగాల ఏర్పాట్లు, నాణ్యత ప్రమాణాలు, పనుల వేగంపై అధికారులను, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్మాణం ప్రజల ఆరోగ్య అవసరాలకు అత్యంత కీలకమైనదని నొక్కిచెప్పిన ఎమ్మెల్యే, నిర్మాణ పనులను నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆస్పత్రి పూర్తయిన తర్వాత ఆమనగల్లుతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఆధునిక వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని ఆయన తెలిపారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కసిరెడ్డి నారాయణరెడ్డి గారు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పరామర్శకు వెళ్లి.. పాడెపై తిరిగొచ్చాడు

**ఇతరుల కన్నీరు తుడవబోయి...**

**తన కుటుంబానికే తీరని శోకం మిగిల్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి...**

**భార్య, ఇద్దరు చిన్నారులను ఒంటరి చేసి మానేరు జలాల్లో శాశ్వత నిద్ర**







**సుల్తానాబాద్, జూలై 19 (నినాదం):** ఓ కుటుంబం దుఃఖంలో ఉందని వారిని ఓదార్చేం దుకు వెళ్లిన యువకుడు... అదే రోజు తన కుటుం బా న్ని అంతులేని శోకంలో ముంచెత్తాడు. కన్నీరు తుడవ డానికి వెళ్లిన చేతులే శాశ్వతంగా నిశ్చల మవడంతో సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలోని మారుతినగర్‌లో హృదయ విదార వా తావరణం నెలకొంది. మారుతినగర్‌కు చెందిన కం కణాల శివకృష్ణ (30)హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉ ద్యోగిగా పనిచేస్తూ భార్య, ఇద్దరు చిన్నారులతో సంతోషంగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సు గ్లాంపల్లి గ్రామానికి చెందిన చొప్పరి భూమేష్ కు మార్తె రిషిక మృతి చెందడంతో, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. బాధలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చి తిరుగు ప్రయాణంలో తొగర్రాయి మానేరు పరి వాహక ప్రాంతానికి వెళ్లా డు. అక్కడ కుటుంబ సభ్యులతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాద వశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సమా చారం అందుకున్న పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టి, చివరకు అతని మృతదేహాన్ని వెలికితీ శారు. ఈ వార్త తెలియ గానే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీ రయ్యా రు. శివకృష్ణ మృతితో భార్య జీవితాంతం తీరని వేదనలో మిగి లింది. నాలుగేళ్ల కుమార్తె, రెండున్నరేళ్ల కుమారుడు తండ్రి ప్రేమకు శాశ్వతం గా దూరమయ్యారు. ఉదయం నవ్వుతూ ఇంటి నుంచి బయలుదేరిన శివకృష్ణ... సాయంత్రానికి విగత జీవిగా ఇంటికి చేరుకోవడం చూసిన ప్రతి ఒక్కరి హృద యాలను కలచివేసింది. "ఇతరుల బాధను పంచ డానికి వెళ్లిన వ్యక్తి... తన కుటుం బానికే తీరని బాధ ను మిగిల్చాడు" అంటూ గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘట నపై మృతుడి తండ్రి కంకణాల కొమురయ్య ఫి ర్యాదు మేరకు ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# స్నేహబంధం చిరస్థాయి

**వెల్జాల్ జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం**



**ఆమనగల్లు, జులై 19(నినాదం):** తలకొండపల్లి మండలం, జగబోయినపల్లి గేట్ సమీపంలోని ఎ ఎస్ఆర్ గార్డెన్‌లో 1993-94 జెడ్పీహెచ్ఎస్ వెల్జాల్ ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు అపూర్వ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 45 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు తమ పాఠశాల జీవితంలోని మధురానుభూతులను పంచుకుంటూ, వివిధ రకాల ఆటలు ఆడారు. గతంలో ఆపదలో ఉన్న స్నేహితులకు ఆర్థిక సహాయం అందించినట్లే, భవిష్యత్తులో కూడా పరస్పరం సహాయం చేసుకోవడానికి సిద్ధంగా ఉంటామని అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎం కృష్ణయ్య, అజీజ్, షాబుద్దీన్, అంజలి, సంధ్య, మంజుల, డి అశోక్, కే శ్రీధర్, ఎస్ చంద్రయ్య, కే రాజేందర్ రెడ్డి, ఎం శ్రీనివాస్ గౌడ్, టి మల్లేష్ గౌడ్, టి శ్రీనివాస్ గౌడ్, విజయ్ కుమార్, ఎన్ లక్ష్మి, ఎం. పద్మ, చంద్రమౌళి, మణిపాల్ రెడ్డి, చంద్రయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చివరగా బతుకమ్మలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

# వైశ్యులు ఐక్యతగా ఉండాలి

**పట్టణ సంఘం ఆధ్వర్యంలో వనభోజనం**



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 19 (నినాదం) :** వైశ్యులంతా ఐక్యతగా ఉండాలని రాజకీయంగా ఎదగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఉత్తర తిరుమలలో వనభోజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆషాడ మాసంలో ప్రతి సంవత్సరం వనభోజనాలను ఆనవాయితీగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆటపాటలతో వైశ్యులంతా ఒక చోటికి చేరడం సంతోషంగా ఉందన్నారు. వైశ్యులంతా ఐక్యతగా ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. వైశ్యులు అంటే కేవలం వ్యాపారమే కాదని ఆధ్యాత్మికత, ఆలయ అభివృద్ధిలో ముందుంటారని గుర్తు చేశారు. ప్రధానంగా సేవా కార్యక్రమాల్లో వైశ్యులకు సాటి ఎవరు లేరన్నారు. అంతకుముందు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ధన్ పాల్ శ్రీనివాస్ గుప్తా, ఇల్లెందుల ప్రభాకర్, కోశాధికారి గాలి నాగరాజు, కార్యవర్గ సభ్యులు, ఆలయ ధర్మకర్త సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం

**ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల**



**దమ్మపేట, జూలై 19(నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల కేంద్ర సమీపంలో ఈనెల 21 న మంగళవారం ఉదయం 10 గంటలకు పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. పామాయిల్ సాగుకు కేంద్ర బిందువైన అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో, ఈ పంట ప్రారంభమైన నాటి నుంచి సాగు విస్తీర్ణం గణనీ యంగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పామాయిల్ గెలల ధర కూడా టన్నుకు సుమారు రూ. 23 వేల వరకు పలుకుతుండ టంతో రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ములకలపల్లి మండలానికి చెందిన పలువురు పామాయిల్ రైతులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకమై ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

# ఉపసర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చావల పురుషోత్తం

**లక్ష్మీదేవిపల్లి మండల ఉపసర్పంచ్ అధ్యక్షుడు గా యాకుబ్ పాషా ఎన్నిక**





**లక్ష్మీదేవిపల్లి, జూలై 19 (నినాదం):** లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం తెలంగాణ ఉపసర్పంచుల ఫోరం సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉపసర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరై ఉపసర్పంచులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పలు నియామకాలను ప్రకటించారు. చావల పురుషోత్తంను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన లోతువాగు గ్రామ ఉపసర్పంచ్ యాకుబ్ పాషాను లక్ష్మీదేవిపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నియమించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ చేతుల మీదుగా ఇద్దరికీ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ, తమపై ఉంచిన నమ్మకానికి రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంఘ బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రామారావు, రాష్ట్ర కార్యదర్శి కిషోర్ నాయక్, ఉపసర్పంచులు వెంకట నరసయ్య, రాజు, కేశవరావు తదితరులతో పాటు వివిధ మండలాలకు చెందిన ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కదిలించిన విషాదం.. కదిలిన వైద్య బృందం

**ఆపదలో ఆదుకున్న వైద్యులు**

**ఆశావర్కర్ శ్యామల కుటుంబానికి గాయత్రీ హాస్పిటల్ చేయూత**



**దమ్మపేట, జూలై 19(నినాదం):** భద్రాది కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో మానవత్వాన్ని చాటే ఒక హృదయపూర్వక సంఘటన వెలుగుచూసింది. స్థానిక శ్రీ గాయత్రీ వైద్యశాల బృందం ఒక నిరుపేద కుటుంబానికి ఆపన్నహస్తం అందించి, తాము కేవలం రోగాలను నయం చేసే వైద్యులమే కాదు... సమాజానికి అండగా నిలిచే సేవకులమని నిరూపించుకున్నారు. మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కూరం శ్యామల పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్సీ పరిధిలో ఆశావర్కర్ గా సేవలు అందిస్తుంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, శనివారం పరిస్థితి విషమించి కన్నుమూశారు. సమాజానికి ఆరోగ్య సేవలు అందించిన ఆశావర్కర్ కుటుంబం అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా డబ్బుల్లేని తీవ్ర నిరుపేద స్థితిలో ఉండగా, ఆమె మరణంతో ఒకవైపు గుండెకోత, మరోవైపు దహనసంస్కారాల ఖర్చులకు కూడా చేతిలో పైసల్లేక ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఆ కుటుంబం పడుతున్న తపనను, ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న దమ్మపేట 'శ్రీ గాయత్రీ వైద్యశాల' యాజమాన్యం, వైద్యులు ఆదివారం ఉదయమే స్పందించారు. కేవలం సానుభూతి చూపి వదిలేయకుండా, మానవతా దృక్పథంతో ఆ నిరుపేద కుటుంబానికి దహనసంస్కారాల నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ వితరణలో వైద్యశాల యాజమా న్యంతో పాటు డాక్టర్ పి. మౌనిక, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ ఉదయ్ భాస్కర్ లు చొరవ తీసుకుని తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకున్న శ్రీ గాయత్రీ వైద్యశాల బృందానికి మృతురాలి కుటుంబ సభ్యులు కన్నీటితో కృతజ్ఞతలు తెలపగా, స్థానికులు వారి సేవాగుణాన్ని అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు పాలడుగుల అబ్బులు, ఎస్కె అజీమ్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్ ఎక్కుతున్న మెట్లు.. పాదాచారుల పాట్లు..

**హైవే పక్కనే ప్రమాదకర నిర్మాణాలు**

**కూల్చిన మెట్లు మళ్లీ నిర్మాణం**

**వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం**

**చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు**

**చేవెళ్ల, జులై 20( నినాదం):** రోడ్డుకు ఆనుకుని మెట్ల నిర్మాణాలు ఉండటం వల్ల పాదచారులకు, వాహనదారులకు తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలు రోజురోజుకు అడ్డు అదుపు పెరిగిపోతున్నాయి. పట్టించుకోవాల్సిన సంబంధిత మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పరిస్థితి దారుణంగా మారుతోంది. ముఖ్యంగా బీజాపూర్ జాతీయ రహదారి సమీపంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. హైవేకు అతి సమీపంలోనే షాపింగ్ కాంప్లెక్స్‌లు, షట్టర్లు నిర్మిస్తూ, రోడ్డు పరిమితులను పూర్తిగా లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాల వద్ద ప్రమాదంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మెట్లు రోడ్డుకు అతి దగ్గరగా ఉండ టం ప్రమాదానికి ఆహ్వానం పలుకుతోంది. వాహ నాలు రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిపై ఇటువంటి నిర్మాణాలు ఎప్పుడైనా ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని వహనదారులు ఆందోళన చెందుతున్నారు.

**కూర్చున్న మెట్లు మళ్లీ నిర్మాణం**

చేవెళ్ళ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో నిర్మించిన భవనం మెట్లు రోడ్డుకు స్టేట్ బ్యాంక్ వదలకుండా నిర్మించిన, మెట్లను మున్సిపల్ అధికారులు కొద్ది రోజుల క్రితం కూల్చేశారు.. ఆశ్చర్యకరంగా కొద్ది రోజులకే మళ్లీ అదే మెట్లు నిర్మించబడటం అనుమానాలకు తావిస్తోంది. ఎందుకు కూల్చారు? మళ్లీ ఎందుకు అనుమతించారు? అన్న ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారం 'చిదంబర రహస్యంగా' మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇక, ఈ అక్రమ నిర్మాణాల వెనుక భారీ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు మున్సిపల్ అధికారులు, రాజకీయ నాయకులకు చెందిన పలువురు వ్యక్తులకు డబ్బులు, అన్యాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.. మున్సిపల్ అధికారులు, రాజకీయ నాయకుల అండదండతోనే ఈ నిర్మాణాలు తిరిగి కొనసాగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**పాదాచారులకు భద్రత ఇక్కడ?**

రోడ్డుకు మలుపులో నిర్మించే నిర్మాణాల మెట్లు, దిగేట ప్పుడు రోడ్డుపైకి కాకుండా సైడ్ కు వచ్చే విధంగా, నిర్మించాలి.. పాదాచారులకు ద్విచక్ర వాహన దారులు రోడ్డు పక్కనుండి నడవాలంటే ప్రాణాలను అరచేతులు పెట్టుకొని భయంతో నక్కినక్కి నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రోడ్డు పక్కన బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు, స్టేట్ బ్యాక్ వదలకుండా రోడ్లపైకి రాంపులు మెట్లు నిర్మించ డంతో పాదాచారులకు, ద్విచక్ర వాహనదా రులకు ప్రాణ సంఘటనగా మారింది.. రోడ్డు పక్కనుంచి నడుచుకుంటూ వెళ్తే, వెనకనుంచి వాహనాలు ఢీకొడతాయనేమోనని భయంతో బెంబలిత్తుతున్నారు.. ప్రజల భద్రతను పక్కనబెట్టి అక్రమ కట్టడాలకు అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం? హైవే పక్కనే ప్రమాదకరంగా ఉన్న ఈ మెట్ల నిర్మాణాలను వెంటనే తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని సమీక్షించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రేడియో ఆవిష్కర్త మార్కొనీ

## జూలై 20... గుగ్లి ఎల్మో మార్కొని వర్ధంతి

**ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఇప్పుడు టివి ఉన్నట్లే కొంత కాలం క్రితం ప్రతి ఇంటిలో రేడియో సెట్ ఉండేది. నాడు ప్రధాన మనో రంజన సాధనాల్లో రేడియో ప్రధాన మైనది. రేడియో పేరు తీయగానే గుర్తుకు వచ్చేది దాని ఆవిష్కర్త మార్కొనీయే.**



గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 – 1937 జులై 20) ఇటా లియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితా మహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్ తో కలసి వైర్‌లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్‌లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్క రణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు.

రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి.

మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్‌సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమిం చబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు.

లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యా యుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాం తాలను నేర్పించాడు.18 యేళ్ళ వయస్సులో అతను తిగిరి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు. 1890 ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉప యోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం.

బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు.

ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకె ళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభిం చింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది.

మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలివైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించా నని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరిం చేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారి ణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాల యానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే.

వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పిం చింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆప రేటర్ వైర్ లెస్ ద్వారా SOS సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది.

1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు.

మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరిక రాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభా షణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం (broad casting station) పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు.1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిష్టర్ 1948 లో తయారు చేసింది.

బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటీష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది.

1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయో గాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.


**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**


## ఉద్యోగాలు... యువత భవిష్యత్తా?

# రాజకీయాల ఆయుధమా?

అంతర్మథనం




బజిగిరి శ్రీనివాస్
సంపాదకులు – నినాదం


**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి యువత కేంద్రబిందువుగా మారింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఉద్యోగాల అంశంపై సాగుతున్న మాటల యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం "70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం" అని ప్రకటిస్తుంటే, మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ "ఆ సంఖ్యను నిరూపిస్తే శాశ్వతంగా రాజ కీయాల నుంచి తప్పుకుంటాను" అంటూ సవాల్ విసురుతున్నారు. అధికార పక్షం ప్రతి సవాళ్లతో ఎదురుదాడి చేస్తోంది. ఇలా ఉద్యోగాల అంశం నిరుద్యోగ యువత ఆశలకు సంబంధించిన సమస్యగా కాకుండా, రాజకీయ బలపరీక్షగా మారడం ఆందోళన కలిగించే విషయం.**




తెలంగాణ ఉద్యమ చరిత్రను తిరగేస్తే యువత పాత్ర అపారమైనది. వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువకులు తమ చదువులు, ఉద్యోగాలను పక్కనబెట్టి రాష్ట్ర సాధన కోసం పోరాడారు. "మన రాష్ట్రం వస్తే మన ఉద్యోగాలు వస్తాయి" అనే నమ్మకమే ఉద్యమానికి శక్తినిచ్చింది. రాష్ట్రం ఏర్పడి దశా బ్దానికి పైగా గడిచినా ఉద్యోగాల ప్రశ్న ఇప్పటికీ ఎన్నికల ప్రధాన అజెండాగా ఉండటం సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని చెబుతోంది.

బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్య మయ్యాయన్న విమర్శలు వచ్చాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు వేలాది మంది యువత కలలను దెబ్బతీశాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నియామకాలపై దూకుడు చూపుతు న్నామని ప్రభుత్వం చెబుతోంది. కానీ ప్రతిపక్షం ఆ గణాంకాలను ప్రశ్నిస్తోంది. అసలు చర్చ ఎంతమంది ఉద్యోగాలు పొందారన్న దానిపై కాకుండా, ఎవరి లెక్కలు నిజమన్న రాజకీయ వివాదంగా మారిపో యింది.

ఇది కేవలం రెండు పార్టీల మధ్య రాజకీయ పోటీ మాత్రమే కాదు. తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో యువత ఓటు కీలకం కాబోతోందని అన్ని పార్టీలు గుర్తిస్తున్నాయి. అందుకే ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, కోచింగ్, నోటిఫి కేషన్లు, పరీక్షలు—ఇవన్నీ ఎన్నికల ప్రచారంలో ప్రధాన ఆయుధాలుగా మారుతు న్నాయి. కానీ ఎన్నికల సమయంలో వినిపించే హామీలు, ఎన్నికల తర్వాత కూడా అదే వేగంతో అమలవుతున్నాయా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కావాలి.

**ఆరోపణలకు ప్రతిగా ఆరోపణలు, సవాళ్లకు ప్రతిగా సవాళ్లు విసరడం ప్రజాస్వామ్య చర్చను ముందుకు తీసుకెళ్లదు. నిర్మాణాత్మక విమర్శలే ప్రజలకు ఉపయోగపడతాయి.**

### ప్రభుత్వం చేయాల్సిందేమిటి?

ప్రభుత్వం తన పనితీరును రాజకీయ సభల్లో కాదు, అధికారిక గణాంకాల ద్వారా ప్రజలకు వివరించాలి. ఏ శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయి? వాటిలో ఎన్ని భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీలు మిగిలి ఉన్నాయి? ఏ పోస్టులు శాశ్వతమైనవి? ఎన్ని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాలు? ఇవన్నీ శ్వేతప త్రంగా విడుదల చేయాలి.

ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి, అందులోని తేదీలను తప్పకుండా పాటించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పరీక్షలు సమ యానికి జరగాలి. ప్రశ్నపత్రాల భద్రతపై రాజీ పడకూడదు. నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. పారదర్శకతే ప్రభుత్వ విశ్వసనీయ తకు మూలం.

అలాగే ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు పరిశ్రమలు, తయారీ రంగం, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లోనూ పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించాలి. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే యువతకు ఏకైక మార్గం కాని పరిస్థితిని సృష్టించాలి.

### ప్రతిపక్షం పాత్ర ఏమిటి?

ప్రతిపక్షం పని కేవలం ఆరోపణలు చేయడం మాత్రమే కాదు. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచడం కూడా దాని బాధ్యతే. అధికార పార్టీ చెబుతున్న సంఖ్యలు తప్పు అనిపిస్తే, ఆధారాలతో ప్రజలకు వివరించాలి. అధికారంలోకి వస్తే ఎంత కాలంలో ఎన్ని ఉద్యోగాలు ఇస్తారు? నియామక వ్యవస్థలో ఎలాంటి సంస్కరణలు తీసుకొస్తారు? ప్రైవేట్ రంగంలో ఉపాధి ఎలా పెంచుతారు? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటిం చాలి.

ఆరోపణలకు ప్రతిగా ఆరోపణలు, సవాళ్లకు ప్రతిగా సవాళ్లు విసరడం ప్రజాస్వామ్య చర్చను ముందుకు తీసుకెళ్లదు. నిర్మాణాత్మక విమర్శలే ప్రజలకు ఉపయోగపడతాయి.

### యువత కూడా ఆలోచించాల్సిన సమయం

యువత కూడా కేవలం భావోద్వేగాలకు లోను కాకూడదు. ఏ పార్టీ సభలో ఎక్కువ చప్పట్లు కొట్టిందన్నది కాదు, ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని నియామకాలు జరిగాయి? ఎన్ని ఖాళీలు మిగిలాయి? నియామకాలు ఎంత పారదర్శకంగా జరిగాయి? భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి? అనే ప్రశ్నలు వేయాలి.

సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ప్రసంగాలు, రాజకీయ సవాళ్లు, నినాదాల కంటే అధికారిక సమాచారం, నియామకాల ప్రకటనలు, అమలు పురోగతిని పరిశీలించే రాజకీయ చైతన్యం యువతలో పెరగాలి. ప్రజాస్వా మ్యంలో ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు—భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత కూడా.

### ఉద్యోగం అంటే ప్రభుత్వ పోస్టే కాదు

ప్రభుత్వ ఉద్యోగం గౌరవప్రదమైనదే. కానీ ప్రతి యువకుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు. అందుకే నాణ్యమైన ప్రైవేట్ ఉపాధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, పారిశ్రామికీకరణ, గ్రామీణ ఉపాధి, నైపుణ్య శిక్షణ వంటి అంశాలను కూడా రాజకీయ చర్చలోకి తీసుకురావాలి. ఉద్యోగ సృష్టి అనేది సమగ్ర ఆర్థిక విధానంలో భాగం కావాలి.

తెలంగాణ యువత రాష్ట్ర సాధన కోసం పోరాడింది. ఇప్పుడు అదే యువత రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధానికి ప్రేక్షకులుగా మిగలకూడదు. ఉద్యోగాలపై జరిగే ప్రతి చర్చ చివరికి నియామకాల రూపంలో కనిపించాలి. సవాళ్లు, ప్రతిసవాళ్లు, సభలు, నినాదాలు కొంతకాలం మాత్రమే నిలుస్తాయి. కానీ ఒక యువకుడికి వచ్చిన ఉద్యోగం అతని కుటుంబ జీవితాన్నే మార్చేస్తుంది.

అందుకే అధికార పార్టీ గణాంకాలతో మాట్లాడాలి. ప్రతిపక్షం ప్రత్యామ్నాయ విధానాలతో మాట్లాడాలి. యువత ప్రశ్నలతో మాట్లాడాలి. అప్పుడు మాత్రమే ఉద్యోగాలు ఎన్నికల నినాదాల నుంచి బయటపడి, తెలంగాణ అభి వృద్ధికి నిజమైన పునాది అవుతాయి.

# చెస్ క్రీడతో మేధో వికాసం

## (20 జూలై "అంతర్జాతీయ చదరంగ దినోత్సవం" సందర్భంగా)

**20 జూలై 1024 రోజు అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్, 'ఫిడే' అనబడే ప్రపంచ చదరంగ సంస్థ స్థాపించబడిన కారణంగా యునెస్కో చొరవతో 1966 నుంచి ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ చదరంగ దినోత్సవం (ఇంటర్నే షనల్ చెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. చదరంగం ఆట ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస 2019 నుంచి అధికారికంగా నిర్వహించడం కూడా ఒక విశేషం. ఫిడే నినాదంగా "మనం ఒకే కుటుంబం" అనే అంశం తీసుకోవడంతో ప్రపంచమే ఒక కుగ్రామం అని ప్రచారం చేయడానికి కూడా ఆస్కారం దొరుకుతోంది.**



**చదరంగం ఆటతో వల్ల కలిగే ప్రయోజనాలు :**

అన్ని వయస్సుల వారు ఆడుకునే ఇండోర్ గేమ్‌గా చెక్‌కు పేరున్నది. చదరంగం ఆటతో జ్ఞాన సంబంధ నైపుణ్యాలు మెరుగుపడడం, విద్యను ప్రోత్సహించడం, జ్ఞాపకశక్తి పెరగడం, సామాజిక సమ్మిళితాన్ని సాధించడం, సుస్థిరాభివృద్ధికి మద్దతు లభించడం, వినోదాత్మక అనుభవం కలగడం, పోటీ తత్వం పెంచడం, కళా నైపుణ్యాలు, మానసిక చురుకుదనం పెరగడం లాంటి ప్రయోజనాలు కలుగుతు న్నాయి. నేడు చెస్‌ను ఆన్‌లైన్ గేమ్‌లుగా కూడా ఆడడం జరుగుతోంది. అంతర్జాతీయ చెస్ దినోత్సవ వేదికగా చదరంగం ఆడడం, పోటీలు నిర్వహించడం, చెస్ క్లబ్బులను స్థాపించడం, కొత్త వారికి నేర్పించడం, చెస్ నేపథ్య కార్యక్రమాలు నిర్వహించడం, సోషల్ మీడియాల్లో ప్రచారాలు నిర్వహించడం, హాష్‌ట్యాగ్‌లను ఉపయోగించి పోస్టులు పెట్టడం, చెక్ క్రీడాకారులను సన్మానించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

**చదరంగం ఆట విధి విధానాలు :**

16వ శతాబ్దంలో ప్రారంభమైన చెస్ క్రీడ ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరుగుతూ వినోదాన్ని, మేధో సంపదను పెంచే క్రీడగా గుర్తింపు పొందింది. బుద్ధికి కసరత్తు ఇచ్చే ఆటగా చెస్‌కు ప్రముఖ స్థానం ఇవ్వబ డింది. చదరంగం 64 గళ్ళు కలిగిన ఒక చదరపు బల్ల మీద ఆడతారు. ఈ 64 గళ్ళలో నలుపు తెలుపు గళ్ళు ఒకదాని దతర్వాత మరొకటి ఉంటాయి. ఈ ఆటలో 16 తెలుపుతో ఒకరు, 16 నలుపు పావులతో మరొకరు పోటీ పడి ఆడతారు. వీటిలో ఒక రాజు, ఒక మంత్రి, రెండు ఏనుగులు, రెండు గుర్రాలు, రెండు శకటాలు, ఎనిమిది బంట్లు/సిపా యిలు ఉంటాయి.


**ప్రపంచ చదరంగ శక్తిగా భారత్ :**

భారత్, రష్యా, ఫ్రాన్స్, చైనా, అమెరికా లాంటి దేశాల్లో చెక్ ఆటకు అధిక గుర్తింపు లభిస్తున్నది. నేడు ప్రపంచవ్యాప్తంగా 600 మిలియన్లకు పైగా క్రీడాకారులు చెస్‌ను ఆడుతూ ఆస్వాదించడం జరుగుతోందని అంచనా. భారతదేశం ప్రపంచ చదరంగంలో అగ్రశ్రేణి శక్తిగా ఎదిగింది. భారత చదరంగ ఆటలో ప్రపంచ గ్రాండ్ మాస్టర్లుగా విశ్వనాథ ఆనంద్, అర్జున్ ఎరిగైసీ, కోనేరు హంపీ, వైశాలి, గుకేష్, ప్రజ్ఞానానంద, అభిజిత్, అనుపమ గోఖలే, దివ్యేందు బారువా, హారిక, హరికృష్ణ, ప్రవీణ్, పరిమార్జన్ నేగి లాంటి ప్రఖ్యాత ఆటగాళ్ళ ఉన్నారు. ఈ ఆట దాదాపు 20 గంటల వరకు ఆడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

డిజిటల్ ఏఐ యుగంలో చిన్నారులు, కౌమార యువతను స్మార్ట్‌ఫోన్‌కు దూరం చేస్తూ, చదరంగం ఆట వైపుకు వారి దృష్టిని మరల్చాలి.


**ఆచార్య : బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**


# భాస్వరమై మండుతాయి



ఎన్నో సమరాలకు ఇరుసై నేల
మరెన్నో సిద్ధాంతాలకు కుదురై నేల
ఎన్నో వేదికలకు వేగుచుక్కై
ఎన్నో మూలాలకు దిక్సూచెయిన నేల
ఊరూర అగ్గి రాజేసిన గడ్డ
మా ఓరుగల్లు పోరుగల్లై కదిలిన అడ్డ

ఇక్కడి మట్టికి ఆరాటం ఇక్కడి
జనాలకు పోరాటం పెయ్యిలల్లో
పెనవేసుకొని ఉంటది
ఇక్కడి గాలి , ధూళిలో కూడా
చైతన్యపు రవ్వలు రంకెలేస్తూ రణం
చేస్తాయి
గడ్డి పరక కూడ మీసం మెలేసి
బరిగీసి బందూకులో బుల్లెట్టై కదులుతది

రుద్రమ్మ పౌరుషం బందగీ తెగింపు
ఇక్కడి వారి నరనరాల్లో
ఉప్పొంగుతాయి
దాశరథి , కాళన్న కవనాలు
నాలుకలపై నానుతూ భాస్వరమై
మండుతాయి
జాగిర్దారుల జమీందారులను
బొంద పెట్టి పరాయి పాలనపై
ఫిరంగులై మోగిన నేల

మా యాస మా భాష మా కల్చర్ మా
తనువులపై తాండమాడుతూనే
ఉంటాయి
బోనాలు , బతుకమ్మ, సమ్మక్క సారక్క

మమ్ముల్ని చల్లంగ చూస్తూనే ఉంటాయి
మమతలను పంచడం మా సంస్కృతి
పరపీడనను పరుషపు మాటలకు
ఘోరీ కట్టడమే మా నైజం
మా పై విషం కక్కే నక్కలకు
నడ్డి విరచడమే మా ఇజం


**తాటిపాముల రమేశ్ (తార)**
**7981566031**


## నిరాశ్రయులు, సంచార జాతులకు

# దుస్తుల పంపిణీ





సమాజ సేవలో భాగంగా స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైద రాబాద్ నగరంలోని రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు మరియు సంచార జాతుల వారికి దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహిచాము. సమాజంలోని అట్టడుగు వర్గాలకు తమ వంతు సహాయం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత, ఈ కార్యక్ర మంలో స్కై ఫౌండేషన్ ఫౌండర్ & ప్రెసిడెంట్ వై. సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని పాల్గొన్నారు.


**వై. సంజీవ్ కుమార్**
**ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్**


# నీకు నువ్వు పరిచయమైన క్షణం

నీకు నువ్వు పరిచయమైన క్షణం నీ గెలుపుకు
దారులు పడటం ఖాయం.
ఊహ తెలియని వయసు నుండి బాధ్యతలు
మోసే మనసును చేరే ప్రయాణంలో నిన్ను
నువ్వు మర్చిపోయావా నేస్తం.
నువ్వేంటో నీకు తెలిసిన నిమిషం ఎదురైన ప్రతి
అవరోధాన్ని చేయించే లక్షణం మీ సొంతం.
మరుగున పడిపోయిన నీ అద్భుతమైన ఆలోచ
నలకు పదును పెట్టే ఆయుధమే నీకు నీ
పరిచయం.
నీకు నువ్వేంటో తెలిసినా గడియ నీ గౌరవాన్ని
పతాక స్థాయికి చేర్చడం తథ్యం
నిన్ను నీకు గుర్తు చేసిన పరిస్థితులు నీ
విజయం పాలిట శ్రమించే శక్తులు.
నిన్ను నువ్వు కోల్పోకుండా చేసేది జీవితం అది
తెలుసుకోవాలంటే నీకు నువ్వు పరిచయం
అవడమే చాలా ముఖ్యం.
మనసు గాయాల జీవితానికి
అరుదైన ఓదార్పే నిన్ను నువ్వు తెలుసుకోవడం.
నువ్వు మాట్లాడే ప్రతి మాట ఆచరణకు
ఆసరయ్యేలా నీకు నీ ఆత్మ పరిశీలన
ప్రధాన అవసరం.
నీ దరిచేరే ప్రతి సమస్యకు పరిష్కారం వెతికే
మార్గం నీకు తోడై నడవడమే నిన్ను నీకు తెలిపే
లక్షణం.
అనుక్షణం నిన్ను నువ్వు వెతికితే ఈ లోకంలో
జయించిందంటూ ఉండదని తెలుసుకో నేస్తం.
భరించిన అవమానాలు, ఎదుర్కొన్న
అవహేళలు నువ్వేంటో నీకు చెప్పే పాఠాలు.
నువ్వు నీకై ఆలోచించే నేర్పే నీకు నిజజీవితం
పరిచయమయ్యేలా చేస్తుందనేది జగమెరిగిన
సత్యం.
కష్టాల కడలిలో కొట్టుమిట్టాడిన కాలం సైతం
నీ కాళ్ల దగ్గరికి చేరాలంటే నీకు నువ్వు ఎదురై
ప్రశ్నించుకోవడమే శరణ్యం.




**వంశీకృష్ణగౌడ్ బండి**
**రంగయ్యపల్లి రేగొండ**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా**
**8688063096**

# పర్వతారోహణ క్రీడకు పెరుగుతున్న ఆదరణ






8848 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగల హిమాలయ పర్వతాలలోని ఎవరెస్టు శిఖరం అధిరోహణ అత్యంత సాహసమైన కృత్యం. టెన్సింగ్ నార్కేతో పాటు ఎడ్మండ్ హిల్లరీ 1953, మార్చి 29 నాడు ఈ శిఖరాన్ని చేరుకొని ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తులుగా నిలిచారు. మౌంట్ ఎవరెస్టు పర్వతాన్ని నేపాలీలు 'సగరమతా' అని అలాగే టిబెటన్లు 'చోమోలున్గమా' పర్వతమని పిలుస్తారు. 1830- 43 శ్రీ మధ్య తొలిసారి సర్వే చేసిన భారత సర్వేయర్ జనరల్ 'సర్ జార్జ్ ఎవరెస్ట్' ఈ పర్వతాన్ని గుర్తించారు. ఆయన స్మారకార్థం ఈ పర్వతానికి 'ఎవరెస్ట్' అని నామకరణం చేశారు.

సర్ ఎడ్మండ్ పర్సీవల్ హిల్లరీ (జూలై 20, 1919 -- జనవరి 11, 2008) న్యూజిలాండ్కు చెందిన పర్వతారోహకుడు, అన్వేషకుడు. ఎడ్మండ్ హిల్లరీ 1919 జూలై 20న న్యూజిలాండ్ లోని ఆక్లాండ్‌లో జన్మించాడు. 16 సంవత్సరాల వయస్సులోనే హిల్లరీ పర్వతారోహణపై మక్కువ చూపినాడు. 1939లో దక్షిణ ఆల్ప్స్ పర్వతాలలో ఉన్న ఆలివర్ పర్వత శిఖరాన్ని అధిరోహించడం అతని జీవితంలో తొలి ప్రధాన సాహస కృత్యం. ఎవరెస్ట్ అధిరోహణే కాకుండా హిమాలయ పర్వతాలలో ఉన్న ముఖ్యమైన మరో 10 శిఖరాలను కూడా హిల్లరీ అధిరోహించాడు. ఎడ్మండ్ హిల్లరీ నేపాలీల ముఖ్యంగా షెర్పాల దృష్టిలో దైవసమానుడు. ఎవరెస్టు అధిరోహణ సమయంలో అక్కడి షెర్పాల దయనీయ జీవితాన్ని చూసి చలించి, అక్కడ పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి షెర్పాల జీవితంలో వెలుగులు నింపాడు.

ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తమ దేశ గౌరవాన్ని నిలబెట్టినందుకు న్యూజీలాండ్ ప్రభుత్వం 5 డాలర్ల కరెన్సీ నోటుపై హిల్లరీ బొమ్మను ముద్రించి అతని ప్రతిభను గౌరవించింది. బ్రిటన్ జట్టులోని సభ్యుడిగా హిల్లరీ సాధించిన విజయాన్ని గౌరవిస్తూ బ్రిటన్ రాణి రెండో ఎలిజబెత్ హిల్లరీని సత్కరించింది.

**పర్వతారోహణ సాహస క్రీడ ప్రమాదకరం:**

హిమాలయాల్లోని 'మహాలంగూర్ హిమల్' సబ్-రేంజ్లో అత్యంత ఎత్తైన ఎవరెస్టు పర్వతం చైనా-నేపాల్ సరిహద్దుల్లో ఉన్నది. ఎవరెస్ట్ పర్వతారోహణలో ప్రతికూల వాతావరణం,



బలమైన గాలులు, అవలాంచ్ ప్రమాదాలు, అల్టిట్యూడ్ సిక్నెస్, మంచు చెరియలు విరిగి పడడం లాంటి ప్రాణాంతక ప్రమాదాలు ఉంటాయి. 2019 గణాంకాల ప్రకారం 306కు పైగా ఎవరెస్ట్ పర్వతారోహకులు అధిరోహించాలనే ప్రయత్నాలలో ప్రాణాలు విడవడం, అలాంటి సాహసికుల పార్థివ దేహాలు ఆ మంచు కొండల్లోనే కలవడం జరిగింది. ఆక్సీజన్ బాటిల్ వెంట ఉన్నప్పటికీ పర్వతారోహకులు వాంతులు, అలసట, వికారం, హిమఘాతం (ఫ్రోస్బైట్), అల్పోష్ణస్థితి లాంటి పలు అనారోగ్యాల పాలు అవుతారు. పర్వతారోహణాన్ని పూర్తి చేసి దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగా జరుగుతుంది.

**పర్వతారోహణకు పెరిగిన ఆసక్తి:**

4,042 మంది పర్వతారోహకులు ఎవరెస్టు అధిరోహించగా, అందులో 635 మంది మహిళలు కూడా ఉన్నారు. పర్వతారోహణకు అనేక మాసాల శిక్షణ, తయారీ మరియు సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించుటకు దాదాపు 65,000 డాలర్ల రుసుము, ఖరీదైన పరికరాలు అవసరం అవుతాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని అత్యధికంగా 21 సార్లు అధికోహించిన రికార్డును 'అపా షెర్పా' మరియు 'పుర్బా షెర్పా'లు దక్కించుకున్నారు. ప్రతి ఏటా మే, సెప్టెంబర్ మాసాలు ఎవరెస్టు ఎక్కడానికి అనువైన సీజన్లుగా గుర్తించారు. పర్వతారోహకులకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు 19 రోజులు, అక్కడి నుండి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి దాదాపు 40 రోజుల సమయం పడుతుంది. ప్రతి ఏటా దాదాపు 800 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు, ప్రతికూలతలు ఎదురైన పర్వతారోహకులు ఎవరెస్ట్ లాంటి అత్యంత ఎత్తైన మంచు పర్వతాన్ని అధిరోహించాలని తపన పడడం అభినందనీయం. ప్రాణాలకు తెగించి సాహసం చేసే పర్వతారోహణ సాహస వీరులకు శుభాకాంక్షలు తెలియజేద్దాం, ఆ క్రీడ పట్ల యువతను ప్రోత్సహిద్దాం.

**-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## జస్ట్ రూ.210తో ప్రతి నెలా
# 5వేలు అకౌంట్‌లోకి..

### కేంద్రం తెచ్చిన ఈ సూపర్ స్కీమ్ గురించి తెలుసా..?

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత పెన్షన్ రూపంలో ఆర్థిక భద్రత ఉంటుంది. కానీ దేశంలో మెజారిటీ ప్రజలు ప్రైవేట్ ఉద్యోగాలు, స్వయం ఉపాధి లేదా రోజువారీ కూలీలుగా అసంఘటిత రంగంలో జీవనం సాగిస్తున్నారు.

ఇలాంటి వారికి వృద్ధాప్యంలో స్థిరమైన ఆదాయాన్ని అందించి, ఆర్థిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ పింఛను యోజన అనే అద్భుతమైన పథకాన్ని అమలు చేస్తుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఈ స్కీమ్‌లో నిర్దిష్ట కాలం పాటు చిన్న మొత్తాల్లో పెట్టుబడి పెడితే.. 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు గరిష్టంగా రూ. 5000 వరకు ఖచ్చితమైన పెన్షన్ పొందవచ్చు.

**అర్హతలు ఎవరికి ఉన్నాయి?**

- అటల్ పెన్షన్ యోజనలో చేరాలనుకునే దరఖాస్తుదారులు ఈ అర్హతలను కలిగి ఉండాలి.
- దరఖాస్తుదారు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి.
- కనీస వయస్సు 18 సంవత్సరాల నుండి గరిష్టంగా 40 సంవత్సరాల లోపు ఉండాలి.
- దరఖాస్తుదారుడికి ఏదైనా బ్యాంకు లేదా పోస్టాఫీసులో యాక్టివ్ సేవింగ్స్ ఖాతా ఉండాలి.
- సదరు బ్యాంక్ ఖాతాకు ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ తప్పనిసరిగా లింక్ అయి ఉండాలి.
- వీరికి ఈ పథకం వర్తించదు..

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 1, 2022న లేదా ఆ తర్వాత ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లించి ఉంటే, వారు ఈ అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరడానికి అర్హులు కారు. ఈ పథకం పూర్తిగా పన్ను పరిధిలోకి రాని, తక్కువ ఆదాయ వర్గాల అసంఘటిత రంగ కార్మికుల కోసం ఉద్దేశించబడింది.






**నెలకు ఎంత పెట్టుబడి పెట్టాలి?**

- ఈ పథకంలో ప్రీమియం మొత్తం.. మీరు చేరే వయస్సు, రిటైర్మెంట్ తర్వాత మీకు కావాల్సిన పెన్షన్ మొత్తంపై ఆధారపడి ఉంటుంది. ఈ స్కీమ్‌లో కనీసం 20 సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

**18 ఏళ్ల వయస్సులో చేరితే:** 60 ఏళ్ల తర్వాత నెలకు రూ. 5,000 పెన్షన్ కావాలనుకుంటే.. వారు నెలకు కేవలం రూ. 210 మాత్రమే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
**30 ఏళ్ల వయస్సులో చేరితే:** అదే నెలకు రూ. 5,000 పెన్షన్ కోసం, కాస్త వయస్సు పెరిగింది కాబట్టి నెలవారీ ప్రీమియం రూ. 577 గా ఉంటుంది.

**అప్లై చేయడం ఎలా?**

- అటల్ పెన్షన్ యోజనలో నమోదు చేసుకోవడం చాలా సులభం.
- ముందుగా మీ సేవింగ్స్ ఖాతా ఉన్న బ్యాంకు శాఖను లేదా పోస్టాఫీసును సందర్శించి సంబంధిత అధికారిని సంప్రదించాలి.
- అక్కడున్లా దరఖాస్తు ఫారమ్ నింపి, మీ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి.
- మీరు ఎంచుకున్న పెన్షన్ మొత్తాన్ని బట్టి నెలవారీ ప్రీమియం వివరాలను బ్యాంక్ వారు ఖరారు చేస్తారు.
- ఆ తర్వాత మీ బ్యాంక్ ఖాతా నుండి ఆటో-డెబిట్ సదుపాయాన్ని యాక్టివేట్ చేస్తారు. దీనివల్ల ప్రతి నెలా మీ ఖాతా నుండి ప్రీమియం అమౌంట్ ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది.
- యువ వయస్సులోనే చిన్న మొత్తంలో పొదుపు చేయడం ద్వారా వృద్ధాప్యంలో ఎవరిపైనా ఆధారపడకుండా గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అటల్ పెన్షన్ యోజన ఒక అద్భుతమైన మార్గం. మీ భవిష్యత్తుకు ఆర్థిక రక్షణ కల్పించుకోవడానికి ఈ ప్రభుత్వ పథకం ఎంతో ఉత్తమమైనది.

# భారీగా పెరుగుతున్న కోడి గుడ్డు ధర..
## కారణం ఏంటో తెలుసా..?

మీరు రోజూ గుడ్లు తినే వారైతే ఈ వార్త మీకు ముఖ్యమైనది. దేశవ్యాప్తంగా గుడ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. చాలా చోట్ల ఒక గుడ్డు ఇప్పుడు 8.5 నుండి 9 రూపాయలకు అమ్ముడవుతోంది. దీనికి ప్రధాన కారణం కోళ్ల మేత ధరలు పెరగడమేనని పౌల్ట్రీ పరిశ్రమ చెబుతోంది. అయితే జూలై నెలాఖరు నాటికి ధరలు తగ్గుముఖం పట్టవచ్చని ఈ పరిశ్రమ ఆశిస్తోంది. కోళ్ల మేతలో ఉపయోగించే మొక్కజొన్న, సోయాబీన్ మీల్, ఇతర ముఖ్యమైన మేత పదార్థాలు విదేశాల నుండి దిగుమతుల కారణంగా మరింత ఖరీదైనవిగా మారాయని పౌల్ట్రీ కంపెనీలు చెబుతున్నాయి. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ దిగుమతులు, సరఫరాలను ప్రభావితం చేయడం దీనికి పాక్షికంగా కారణం.

**మొక్కజొన్న, సోయాబీన్ ఖర్చులు పెరిగాయి:**

జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ (ఎన్ఈసీసీ) గణాంకాల ప్రకారం, హైదరాబాద్‌లో గుడ్ల ఎక్స్-ఫార్మ్ ధర ఒక నెలలో 15%, గత ఏడాదితో పోలిస్తే దాదాపు 40% పెరిగింది. వెంకటేశ్వర హేచరీస్ అనే పౌల్ట్రీ కంపెనీ ప్రకారం, మార్చి నుండి కోళ్ల దాణాలో ఉపయోగించే దాదాపు ప్రతి వస్తువు ధర పెరిగింది. కోళ్ల దాణాలో సుమారు 55% వాటా ఉన్న మొక్కజొన్న ధర, మార్చి నుండి ఇక్కడ 35% పైగా పెరిగింది. దాణాలో సుమారు 22% వాటా ఉన్న సోయాబీన్ మీల్ ధర 64% పైగా పెరిగింది. అంతేకాకుండా దాణాలో ఉపయోగించే ఆవశ్యక అమైనో ఆమ్లాల



ధర మార్చి నుండి 3.5 రెట్లు పెరిగింది.

**ధరలు పెరగడానికి కారణం ఏమిటి?**

మొక్కజొన్నకు డిమాండ్ ఇకపై కేవలం పౌల్ట్రీ పరిశ్రమకే పరిమితం కాలేదు. ఇథనాల్ కంపెనీలు కూడా మొక్కజొన్నను పెద్ద పరిమాణంలో కొనుగోలు చేస్తుండటంతో, దాని ధరలు పెరుగుతున్నా యి. మరోవైపు, ఈ ఏడాది అస్తవ్యస్తంగా ఉన్న రుతుపవనాలు రైతులు, పరిశ్రమ వర్గాల్లో ఆందోళనలను పెంచాయి. సకాలంలో, ఏకరీతిగా వర్షాలు కురవకపోవడం ఖరీఫ్, రబీ పంటల ఉత్పత్తిపై ప్రభావం చూపుతుందని అంచనా. సోయాబీన్ ధరలు పెరగడానికి మరో కారణం గతేడాది ఉత్పత్తి తక్కువగా ఉండటం. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం, గతేడాది భారతదేశంలో సోయాబీన్ ఉత్పత్తి సుమారు 20% తక్కువగా ఉంది. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగానే కొనసాగితే, ఉత్పత్తి మరింత క్షీణించి, ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

**తీవ్రమైన వేడి కారణంగా చికెన్ కూడా ఖరీదైపోయింది:**

ఈ ఏడాది జూన్ వరకు కొనసాగిన తీవ్రమైన వేడి గుడ్లనే కాకుండా కోడి మాంసాన్ని కూడా ప్రభావితం చేసింది. ఈ తీవ్రమైన వేడి బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తిని తగ్గించడంతో మార్కెట్లో ధరలు పెరిగాయి. పరిశ్రమ గణాంకాల ప్రకారం, అనేక నగరాల్లో చిల్లర కోడి మాంసం ధరలు కిలోకు 260 నుంచి 300కు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కిలో చికెన్ ధర రూ. 300పైగానే అమ్ముడవుతోంది.

**ఎప్పుడు ఉపశమనం లభిస్తుంది?**
జులై నెలాఖరు నుండి గుడ్ల ధరలు స్వల్పంగా తగ్గుతాయని పౌల్ట్రీ పరిశ్రమ అంచనా వేస్తోంది. దీనికి కారణం ఉత్తర భారతదేశంలో అధిక సంఖ్యలో ప్రజలు శ్రావణ మాసంలో మతపరమైన కారణాల వల్ల గుడ్లు, మాంసం వినియోగాన్ని తగ్గించుకోవడమే. డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గే అవకాశం ఉంది. అయితే, రుతుపవనాలు సాధారణంగా కురవకపోయినా, మొక్కజొన్న, సోయాబీన్ ధరలు అధికంగా ఉన్నా, రాబోయే నెలల్లో గుడ్లు, కోడి మాంసం ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక "బోనం"
### పలు సంఘాల బోనాల పండుగలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్





**నిజామాబాద్ ప్రతినిధి, జులై 19 (నినాదం) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ బోనాలు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని కోటగల్లిలో గల కట్ట మైసమ్మ ఆలయం, నాందేవ్ వాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆషాఢ మాసం తెలంగాణకు ప్రత్యేక మాసం అన్నారు. గ్రామ దేవతలకు పూజిస్తూ.. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని కొలిచే పండగ అన్నారు. బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదని, ఇది మన పూర్వీకుల సంప్రదాయాన్ని.. గ్రామదేవతల పట్ల ఉన్న విశ్వాసాన్ని తరతరాలకు అందించే ఆధ్యాత్మిక వేడుక అన్నారు. బోనం అంటే అమ్మవారికి సమర్పించే నైవేద్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు పాలు, బెల్లంతో వండిన అన్నాన్ని.. కొత్త కుండలో పెట్టి, వేపాకులు, పసుపు, కుంకుమలతో అలంకరించి తలపై మోసుకుంటూ అమ్మవారికి సమర్పిస్తారన్నారు. పోతురాజుల నృత్యాలు, ఘటం ఊరేగింపులు, రంగం వంటి సంప్రదాయాలు పండుగకు మరింత వైభవాన్ని తీసుకువస్తాయన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, కోటగల్లి మైసమ్మ ఆలయ ప్రతినిధులు దేవేందర్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


# 24 నుంచి 'హైలైఫ్ జువెల్స్' ప్రీమియం ఎగ్జిబిషన్







**హైదరాబాద్ బ్యూరో , జూలై 19 (నినాదం) :** దేశంలోని ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్లు, డిజైనర్లు పాల్గొనే హైలైఫ్ జువెల్స్ ప్రీమియం ఎగ్జిబిషన్ జూలై 24, 25, 26తేదీల్లో హెచ్ఐసీసీ--నోవోటెల్, హైటెక్ సిటీలో జరగనుంది. ఈ ఎగ్జిబిషన్ తేదీలను నటి కామాక్షి భాస్కర్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా అగ్రశ్రేణి జ్యువెలరీ కలెక్షన్లు, ప్రముఖ డిజైనర్ల ప్రత్యేక ఆభరణాలు ఒకే వేదికపై అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. జ్యువెలరీ ప్రియులకు ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు.

# గిరిజన విద్యతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట
### గొందిగూడెంలో రూ.2.50 కోట్ల పాఠశాల భవనాలకు శంకుస్థాపన..
### రూ.22 కోట్ల అశ్వాపురం-మొండికుంట బీటీ రహదారిని ప్రారంభించిన మంత్రి పొంగులేటి





**అశ్వాపురం, జూలై 19(నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో ఆదివారం అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగాయి. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు కలిసి గొందిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల భవనాలకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు. అనంతరం రూ. 22 కోట్ల వ్యయంతో నిర్మించిన అశ్వాపురం--మొండికుంట బీటీ రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించే వాతావరణాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నియోజకవర్గంలో విద్యా రంగంతో పాటు రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తూనే, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదలకు నిధులు వెచ్చిస్తున్నామని తెలిపారు. అనంతరం రూ. 22 కోట్లతో నిర్మించిన అశ్వాపురం--మొండికుంట బీటీ రహదారిని ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ రహదారి అందుబాటులోకి రావడం వల్ల మండల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కలుగుతాయని అన్నారు. గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఈ రహదారి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పర్యావరణహితంగా ఈదమ్మ-పోచమ్మ బోనాల ఉత్సవాలు!

### వచ్చే నెల 9న వేడుకలు.. సకల జనులు పాల్గొనాలని కమిటీ పిలుపు



**రాజేంద్రనగర్, జులై 19 (నినాదం ):** అత్తాపూర్ సర్కిల్ హైదర్గూడలోని చారిత్రక ఈదమ్మ-పోచమ్మ దేవాలయ బోనాల ఉత్సవాలను ఈసారి సరికొత్తగా, పర్యావరణహితంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. వచ్చే నెల తొమ్మిదో తేదీన (ఆగస్టు 9) జరగబోయే ఈ ఉత్సవాల్లో భక్తులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

**వినూత్న ఏర్పాట్లతో ఆదర్శంగా..**

హైదర్గూడ ప్రణవభక్త సమాజం, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉత్సవ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రతి ఏటా వైభవంగా జరిగే ఈ బోనాల ఉత్సవాలను, ఈసారి ప్రకృతికి ఎలాంటి హాని కలగకుండా పర్యావరణ అనుకూల పద్ధతుల్లో నిర్వహించాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించమని నిర్వాహకులు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



**అల్వాల్, జులై 19 (నినాదం):** ఇటీవలఎంఈఎస్ కాలనీ వెంకటాపురం మాధురి రెసిడెన్సీ దగ్గర విద్యుత్ షాక్ కు గురై సూర్యనారాయణ మూర్తి అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వ్యక్తి పేదరికంతో ఉన్నట్లు గమనించి మాధురి రెసిడెన్సి అ-పార్ట్మెంట్ వాసులు మానవ దృక్పథంతో సూర్యనారాయణ కుటుంబానికి రెండు లక్షలు, స్థానిక మాజీ కార్పొరేటర్ విజయశాంతి పదిహేను వేలు, అల్వాల్ సీఐ ప్రశాంత్ ఐదువేలు , సీ వై రాజు ఐదువేలు, ప్రేమ్ కుమార్ ఇతరులు కలసి 8వేలు మృతుని భార్యరాజేశ్వరి కుమారులులకు సోమేశ్ దుర్గాప్రసాద్ లోకేష్లకు మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి రెసిడెన్సికమిటీ ఉమా శరత్ సుబ్బారావు లుఅందజేశారు.

## ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతా..

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్




**కుత్బుల్లాపూర్, జులై 19 (నినాదం) :** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ను ఆదివారం షాపూర్ నగర్లోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్థానికులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, అండర్గ్రౌండ్ డ్రైనేజీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం తదితర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఆయనకు అందజేసి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వినతులను స్వీకరించిన కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, జులై 19 (నినాదం):** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఎప్పుడూ ముందుంటారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం కోసం ఎదురు చూస్తున్న ఐదుగురు అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా 6.25 లక్షల విలువ గల ఎల్వోసీ పత్రాలు మంజూరు చేయించగా ఆదివారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా డివిజన్లకు చెందిన నాయకులు నిరుపేద దరఖాస్తుదారులకు ఎల్ఓసీ పత్రాలను కుటుంబసభ్యులకు అందజేశారు. వారిలో 125 – గాజుల రామారం డివిజన్ చంద్రగిరి నగర్ కు చెందిన ఎన్. రేణుక భర్త ఎన్.సంజయ్ రెడ్డి కి 2.75 లక్షలు మంజూరి,131 – కుత్బుల్లాపూర్ డివిజన్ బాపూ నగర్ కి చెందిన చెందిన పొల్ల శ్రీనివాస్ తండ్రి పూల రాజలింగంకు 75వేలు,132 – జీడిమెట్ల డివిజన్ భూమిరెడ్డి నగర్ కి చెందిన చెందిన ఇందుకూరి ప్రభావతి భర్త లేట్ ఐ.సత్యనారాయణ రాజు కు 2 లక్షలు. సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధి సాయి నగర్ కు చెందిన ఎం. శాంత భర్త హన్మంత్ రెడ్డి 75 వేలు మంజూరు కాగా సంబంధిత ఎల్వొసి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, నిజాంపేట్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు, పెద్ది మల్లేష్, కిషోర్ చారి, నవాబ్ భాయ్, సమ్మయ్య నేత, నదీమ్ రాయ్, రాకేష్ జాలిగం, కాలే గణేష్, భూపాల్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, సమ్మయ్య, బాల మల్లేష్, రాముడు యాదవ్, రమణా రెడ్డి, మోచి ప్రకాష్, అడ్వకేట్ దూదిమెట్ల క్రిష్ణ యాదవ్, ఉపేందర్ రెడ్డి, ప్రదీప్ తాళ్లూరి, జయం చారి, దిలీప్, శివా నాయక్, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**వికారాబాద్, జులై 19(నినాదం):** సోను వాంగ్చుక్ నిరాహార దీక్షను భగ్నం చేయడం అప్రజా స్వామీకమని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి ఎస్ ఎఫ్ ఐ డిమాండ్ చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సహాయ కార్యదర్శి రాజు, చాకలి అనిల్ అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ పరిగి కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ యూజీ పరీక్షకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని నిరసన చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్ మాట్లాడుతూ మెడికల్ సీట్ల భర్తీకి నిర్వహించే నీట్ యూజీ పరీక్ష పత్రాలు లీక్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అదేవిధంగా ఎన్నో అవకతవకలతో పారదర్శకతలేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్.టి.ఏ ను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వాలకె మెడికల్ సీట్ల భర్తీకి ఎంట్రన్స్ ఎగ్జామ్ లను నిర్వహించుకునే హక్కును కల్పించాలని కేంద్రీకృత పరీక్షల విధానాల వల్ల భారతదేశంలో ఏ ఒక్క సెంటర్ల అవకతకు జరిగిన దేశమంతా పరీక్షరద్దు చేయవలసినటువంటి పరిస్థితి నెలకొందని దీంతో సంవత్సరాల తరబడి మానసిక ఒత్తిడిని తట్టుకుంటూ లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చదువుకున్న విద్యార్థులు నష్టపోతున్నారని నీట్ పేపర్ లీక్ తో 20 మంది వరకు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఇవి కేంద్ర ప్రభుత్వ హత్యలేననీ అన్నారు. పారదర్శకమైన నీటి పరీక్ష అలాగే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం కోసం శాంతియుతంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సామాజిక కార్యకర్త విద్యావేత్త అయిన సోనం వాంఛ్క్ చేస్తున్న నిరాహార దీక్షను నేడు కేంద్ర ప్రభుత్వం బలగాలు ప్రజాస్వామికంగా భగ్నం చేయడం సిగ్గుచేటని అన్నారు. ఆయన చేస్తున్నటువంటి పోరాటానికి మద్దతును ప్రకటిస్తున్నామని న్యాయమైన తన డిమాండ్లను పరిష్కరించాలని కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం లీకుల ప్రభుత్వమని నీట్ లీక్ కు బాధ్యత వహించాలని ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ తరుణంలో ఎస్ఎఫ్ఐ పరిగి కమిటీ సభ్యులు రోహిత్, శివ, సచిన్, సాయి, భాను ప్రకాష్, అరవింద్, ప్రియకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## వర్షాభావ పరిస్థితులతో రైతులు అధైర్యపడొద్దు

### అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కార్యదర్శి బుడిగె జంగం వెంకటేష్



**వికారాబాద్, జులై 19(నినాదం):** వర్షాభావ పరిస్థితిలో రైతులు అధైర్య పడకూడదని అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కార్యదర్శి బుడగ జంగం వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన తాండూర్ రేవెన్యూ పరిధిలో ఖరీఫ్ పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ధైర్యం చెప్పారు. ప్రకృతి పరంగా ఏర్పడే పరిస్థితి ని అధిగమించడం సాధ్యం కాదని అన్నారు. అంతా దైవాదినమని అన్నారు. వర్షాభావ పరిస్థితులతోనే వేసిన పంటలు మొలకల దశలోనే ఎండు ముఖం పట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. రైతులు ఏ మాత్రం అధైర్య పడొద్దని ఇది కేవలం ఒక విపత్కర కాలం మాత్రమేనని అన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు పంటలు పండించాలనే ఒక్క కళ అందరికీ ఉన్నప్పటికీ అనుకోని పరిస్థితులలో మాత్రమే ఇలా జరుగుతుందన్నారు. వర్షాలు పుష్కలంగా కురిస్తే ఇలాంటి బాధలు ఉండేవి కాదని చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికలు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడంతో రైతులు ఏమాత్రం నష్టపోరని గుర్తు చేశారు. భూమిని నమ్ముకున్న రైతులు పెట్టుబడి పెట్టామని వృధా పోతోందని అధైర్య పడకుండా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

## జ్ఞానాన్ని పెంచే వేదికలు గ్రంథాలయాలు

- జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డి

**ఆమనగల్లు, జులై 19(నినాదం):** జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు చక్కని వేదికలని,వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో నూతన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏ. మధుసూదన్ రెడ్డి,స్థానిక సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న యువతీ యువకులు, నిరుద్యోగులకు పోటీ ప్రపంచంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. గ్రంథాలయాలు ఆలోచనా విధానం, జ్ఞానం పెంపొందించుకునేందుకు దోహదపడుతాయన్నారు. పుస్తకాలు చదవడం, రాయడం ఎంతో లాభదాయకమన్నారు. రాబోవు తరాలకు మంచి నైపుణ్యం, విద్యనందించేందుకు ఎంతో ఉపయోగపడుతాయని, విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటు యువతలో చైతన్యం, జ్ఞానాభివృద్ధిని పెంపొందిస్తుందని, ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు, యువతకు విజ్ఞానాన్ని అందించే లక్ష్యంతో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా కార్యదర్శి రాణి, ఉప సర్పంచ్ శ్రీనివాస్,మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,శివలింగం,గ్రామ వార్డు సభ్యులు మహేష్ సురేష్ నాయక్, కొండల్ రెడ్డి, రాజు, విజయ్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ఆమనగల్లు, జులై 19(నినాదం):** మాడ్గుల మండలంలో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సుమారు రూ. 5.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. కొల్కులపల్లి, నర్సాయిపల్లి, కాశిగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించారు. మాడుగులలో విజయ డెయిరీ బీఎంసీ యూనిట్, పాఠశాల భవనం ప్రారంభించడంతో పాటు రూ. 2 కోట్ల వ్యయంతో గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు. మండల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**అల్వాల్, జులై 19 (నినాదం):** చిన్న రాయిని చెరువు అలుగు నుండి పెట్రోల్ బంక్ వరకు 18 లక్షల తో సిసి రోడ్డు నిర్మాణ పనులను మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టి త్వరలో ప్రజలకు అందుబాటులో తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు , నల్లబలవంత రెడ్డి, డి సత్యనారాయణ, అక్రమ పాషా , ధీరజ్ ,డివిజన్ అధ్యక్షులు జ్యోతి యాదవ్ ,ప్రీతి ,విజయ, లక్ష్మిలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రోడ్డుకు నిధులు మంజూరి చేసేందుకు కృషిచేసిన మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



# గోదావరి జలాలు రోడ్ల పాలు





### దేవేంద్ర నగర్ ప్రధాన రహదారి శివ హిల్స్ బోర్డు వద్ద రోజుల తరబడి రోడ్ల పాలవుతున్న గోదావరి జలాలు

### పట్టించుకోని జలమండలి అధికారులు, సిబ్బంది

**కుత్బుల్లాపూర్, జులై 19 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ జలమండలి నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం పుణ్యమా అంటూ విలువైన ప్రజల దాహార్తిని తీర్చే గోదావరి జిల్లాలు రోజుల తరబడి రోడ్లపాలవుతున్న పట్టించుకున్న నాథుడు లేకపోవడం తో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నీటి బొట్టు ను ఒడిసిపట్టి నీటి జలాల దుర్వినియోగాన్ని అరికట్టాలంటూ పాలకులు చేస్తున్న ప్రచారాలు జయంతి శుభాకాంక్షలు అమలుకు నోచుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ జలమండలి పరిధిలోని గాజులరామారం నుండి దేవేంద్ర నగర్ వెళ్లే ప్రధాన రహదారి హెచ్ పి పెట్రోల్ బంక్ సమీపంలో శివహిల్స్ బోర్డు వద్ద కొన్ని రోజులుగా గోదావరి జలాల సరఫరా చేసే ప్రధాన పైప్లైన్ పగిలిపోవడంతో గోదావరి జలాలన్నీ రోడ్లపాలవుతున్నాయి. ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయడంలో జలమండలి అధికారులు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నారో, గోదావరి జలాలన్నీ రోడ్ల పాలవుతున్న పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని స్థానికులు అధికారుల తీరును తప్పుపడుతున్నారు. ఎన్నో కిలోమీటర్ల సుదూర ప్రాంతాల నుండి వందల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి హైదరాబాద్ మహా నగరానికి ప్రజల దాహార్తిని తీర్చడానికి, ప్రజా అవసరాలను కోసం ప్రభుత్వం గోదావరి జలాలు తరలిస్తుంటే సురక్షితంగా ప్రజలకు అవసరమైన తాగునీటిని అందించవలసిన జలమండలి అధికారులు వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఉపయోగపడవలసిన గోదావరి జిల్లాలు రోడ్ల పాలు కావడంతో సరిపోయే నీరు దొరకక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటు వృధాను అరికట్టడంలో షాపూర్ నగర్ జలమండలి అధికారులు పూర్తిగా విఫలం విఫలమవుతున్నారని అధికారుల తీరును తప్పుపడుతున్నారు. గోదావరి జలాల పైపులు పగిలి నీరంతా రోడ్ల పాలు కావడంతో, కోట్లాది ప్రజాధనం వెచ్చించి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బీట్ రోడ్లన్నీ గుంతల మయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరి జలాలు రోడ్లపాలై రోడ్లన్ని చెరువులను తలపిస్తుండడంతోపాటు బురదమయంగా మారి రోడ్లపై వెళుతున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై ఈ బురద నీరు పడడంతో వారు ధరించిన దుస్తులన్నీ బురదమయంగా మారడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజులు, వారాల తరబడి గోదావరి జనాలు పైపులు పగిలి గోదావరి జలాలు రోడ్లపాలై భారీ నీరు వృధా అవుతున్న షాపూర్ నగర్ జలమండలి అధికారుల్లో చలనం లేకపోవడం అధికారుల పనితనానికి అద్దం పడుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు నీటి వృధాను అధికట్టడంలో ప్రత్యేక చొరవ చూపాలని, ఎక్కడ పైప్ లైన్లు పగిలి నీరు వృధా అవుతున్న విషయాన్ని ఆ ప్రాంత లైన్మెన్లు గుర్తించి విషయాన్ని స్థానిక మేనేజర్లు,డి జి ఎం వంటి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నీటి వృధాను అరికట్టడంలో అధికారుల అలసత్వాన్ని ప్రభుత్వము, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపుతూ నీటి వృధాను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక అధికారుల తప్పిదంగా భావిస్తూ వారిపై తగిన చర్యలు తీసుకుంటే నీటి వృధాను అరికట్టడం సాధ్యమవుతుందని నీటి వినియోగదారులు సూచిస్తున్నారు. నీటి నిర్వహణ బాధ్యత, పైపుల లీకేజీ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక చర్యలు చేపడితే గాని నీటి వృధాను అరికట్టడం సాధ్యపడుతుందని, ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టుకుని విధంగా ప్రభుత్వము చేస్తున్న ప్రచారానికి అర్థం పరమార్థం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

## జంగయ్యకు ఆర్థికసాయం

**ఆమనగల్లు, జులై 19(నినాదం):** ఆమనగల్ మండలం నల్లవారిపల్లి గ్రామానికి చెందిన పులకరం జంగయ్య పక్షవాతంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రాము, వెంటనే స్పందించి బాధితుడికి ఆర్థిక సాయం అందజేశారు. అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, ఎల్లయ్య, మార్పాకుల వెంకటనారి, దార్ల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# 15 ఏళ్ల స్మశాన వాటిక వివాదానికి తెర..





### గౌడ సంఘానికి న్యాయం

### 50 లక్షల నిధులతో గౌడ సంఘం స్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తా


### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, జులై 19 (నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ నేరేడ్ మెట్ గౌడ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలం విషయంలో గత పదిహేనేళ్లుగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి ఎట్టకేలకు ముగింపు లభించింది. న్యాయస్థానం గౌడ సంఘానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో, ఆ తీర్పు అమలుకు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో స్మశాన వాటిక స్థలాన్ని గౌడ సంఘానిదిగానే గుర్తిస్తూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ అధికారిక ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీంతో దశాబ్ద కాలానికి పైగా నెలకొన్న అనిశ్చితికి తెరపడటంతో గౌడ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, గౌడ సంఘానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గౌడ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలంపై ఇకపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన రక్షణ చర్యలు కూడా తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు న్యాయం జరిగే ప్రతి అంశంలో తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్ మాట్లాడుతూ స్మశాన వాటిక స్థలం విషయంలో గౌడ సంఘం సభ్యులు పదిహేనేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించలేదని, చివరకు న్యాయస్థానం తీర్పు వచ్చిన అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వెంటనే జోనల్ కమిషనర్ను కలిసి కోర్టు తీర్పు ప్రతులను అందజేయడంతో అధికారులు సానుకూలంగా స్పందించి ప్రొసీడింగ్స్ జారీ చేశారని తెలిపారు. ఈ విజయానికి ఎమ్మెల్యే అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. జోనల్ కమిషనర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ పత్రాలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్కు అందజేశారు. గౌడ సంఘం పెద్దలు మాట్లాడుతూ కోర్టు కేసు ప్రారంభమైన నాటి నుంచి ప్రతి దశలో తమకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ న్యాయం జరిగేలా కృషి చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి, సమస్య పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోర్టు తీర్పు, అధికారిక ప్రొసీడింగ్స్ జారీ కావడంతో సుమారు వంద గౌడ కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్లను ఘనంగా సన్మానించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో గౌడ సంఘం పెద్దలు టి.వి. నరేందర్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, పవన్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, జే.కే. సాయి గౌడ్, విశ్వనాథ్ గౌడ్, అభిషేక్ గౌడ్, జహంగీర్ గౌడ్, గిరి గౌడ్, గంగాధర్ గౌడ్, వినోద్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్దన్, కోటేశ్వర్, శ్రీకాంత్ గౌడ్, శ్రీధర్ గౌడ్, గౌడ సంఘానికి చెందిన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జవహర్నగర్లో బోనాల పండుగ తేదీలు ఖరారు

- అంగరంగ వైభవంగా బోనాలు పండుగ: కమిటీ సభ్యులు

**జవహర్ నగర్, జులై 19 (నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో ఘనమైన తల్లుల పండుగలైన బోనాల జాతర షురువైంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు వేదికలుగా నిలిచిన బోనాల సంబరాలు అంబరాన్ని అంటే విధంగా ఈసారి ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వ సహకారంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని అతి పెద్దదైన జవహర్ నగర్ మహంకాళి బోనాల పండుగ తేదీలను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆగస్టు 23వ తేదీ ఆదివారం రోజు బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని అలాగే ఆగస్టు 24వ తేదీన సోమవారం రంగం జాతర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వైభవంగా జరిగే ఈ ఉత్సవాలలో జవహర్ నగర్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్ల కరుణాకటాక్షాలకు పాత్రులు కావాలని జవహర్ నగర్ బోనాల పండుగ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ రాజు గౌడ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తున్నామని జవహర్ నగర్ లోని ప్రజలందరూ ఈ వేడుకకు హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కోటేష్ గౌడ్, బండ కింది ప్రసాద్, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## బుగ్గారం ఆర్యావైశ్య సంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు సంఘ ప్రతినిధుల వినతి



**బుగ్గారం, జూలై 19(నినాదం):** బుగ్గారం మండల కేంద్రంలో ఆర్యావైశ్య సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు బుగ్గారం మండల ఆర్యా వైశ్య సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, బుగ్గారం మండలంలో ఆర్యావైశ్య సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని తెలిపారు. సమాజ సేవ, పేద ప్రజలకు సహాయం, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. అయితే మండల కేంద్రంలో శాశ్వత సంఘ భవనం లేకపోవడంతో సమావేశాలు, సేవా కార్యక్రమాలు, సామాజిక , సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్యా వైశ్యుల చిరకాల కోరిక అయిన సంఘ భవన నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వారు మంత్రిని కోరారు. వినతిపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆర్యావైశ్య సంఘ భవనం అవసరాన్ని గుర్తించి, నిధుల మంజూరు కోసం తన వంతు సహకారం అందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగునూరి సత్యనారాయణ గౌడ్, మండల ఆర్యావైశ్య సంఘం అధ్యక్షుడు చెట్ల పవన్, ప్రధాన కార్యదర్శి పైడి సత్యనారాయణ, కోశాధికారి కొత్తపల్లి గంగాధర్, మల్యాల శంకర్, చెట్ల మహేష్, ఎలగందుల శ్రీకాంత్, పైడి మారుతి, చెట్ల రమేష్, చెట్ల రాజేందర్, సంఘ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జీవితానికి చదరంగమే దిక్సూచి

### జాతీయ జూనియర్ చదరంగం పోటీల విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతుల ప్రదానం

### కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్




**కరీంనగర్, జూలై19(నినాదం):** కరీంనగర్‌లో జీనియస్ చదరంగం అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగో జాతీయ జూనియర్ చదరంగం పోటీలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, నేటి విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా మేధోశక్తి, ఏకాగ్రత, మానసిక దృఢత్వాన్ని పెంపొందించే చదరంగం వంటి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. పిల్లలను ఇలాంటి క్రీడల వైపు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. చదరంగానికి జీవితానికి విడదీయరాని అనుబంధం ఉందని పేర్కొంటూ, ఆటలో ఒక తప్పు ఎత్తు ఓటమికి దారితీసినట్లే, జీవితంలో ఒక తప్పు నిర్ణయం భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు మైకేల్ శ్రీనివాస్, చదరంగం అకాడమీ నిర్వాహకుడు అనూప్ తదితరులు పాల్గొన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన ప్రాయోజకులను నిర్వాహకులు సన్మానించగా, ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

### పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

### ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ప్రణవ్



**జమ్మికుంట, జూలై 19 (నినాదం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులమతాలకు అతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. ఆదివారం హుజురాబాద్ మండల పరిధిలోని తుమ్మనపల్లి గ్రామంలో ఎండీ మౌలానా – సలీంబీ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. మొదటి విడతలో ఏ విధంగానైతే రాజకీయాలకు తావులకుండా కేవలం అర్హత ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేశామో, రాబోయే రెండో విడతలోనూ అదే విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని, సర్పంచ్ అన్నాడి మాధవి రవీందర్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్య సాయి మందిరంలో గోరింటాకు మహోత్సవం

### భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు





**జమ్మికుంట, జూలై 19 (నినాదం)** జమ్మికుంట పట్టణంలోని భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మందిరంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని మహిళా భక్తులు గోరింటాకు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. మహిళా దే ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని సత్యసాయిబాబా ఆలయంలో గోరింటాకు కార్యక్రమాన్ని మహిళలు వైభవంగా నిర్వహించుకున్నారు. అనంతరం స్వామివారి గాయత్రి వేదాన్ని 21 సార్లు భక్తులు పఠించారు. అనంతరం స్వామివారి భజన నిర్వహించి మంగళహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి మహిళా విభాగం నాయకులు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## అల్లుడి మరణం తట్టుకోలేక ఆగిన అత్త గుండె





**జమ్మికుంట, జూలై 19 (నినాదం)** అల్లుడు అనారోగ్యంతో మృతి చెందగా అతని మరణం తట్టుకోలేక ఏడుస్తున్న తరుణంలో అకస్మాత్తుగా గుండె ఆగి ఓ అత్త మృతి చెందింది. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న బుర్ర రంజిత్(36) అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం మెడికల్ షాప్ వద్దకు వెళ్లి అకస్మాత్తుగా అక్కడే పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతని అత్త గుండేటి పద్మ(56) అనే మహిళ అక్కడికి చేరుకొని అతనిపై పడి ఏడుస్తున్న తరుణంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందింది. ఒకేసారి కన్నతల్లి కట్టుకున్న భర్త మృతి చెందడంతో భార్య పిల్లలు అనాథలుగా మారిపోయారు. ఈ సంఘటన అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది.

## కమిషనర్ ఆదేశాలతో వ్యాపారస్తులలో మొదలైన మార్పు

### పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన వ్యాపారం .. ఫలించిన మున్సిపల్ అధికారుల వ్యూహం..



**జమ్మికుంట, జులై 19 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలోని పలువురు హోటల్స్ యజమానులతో పాటు తోపుడు బండ్ల పై తినుబండారాలు అమ్ముతున్న చిరు వ్యాపారస్తుల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ మల్లికార్జున స్వామి సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో కూడిన తినుబండారాలను శుభ్రంగా అందించాలని ముఖ్యంగా ముఖానికి మాస్క్ తలపై క్యాప్ పెట్టుకుని తినుబండారాలను సప్లై చేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రజలకు అందించే తినుబండారాలను భోజనాలను పరిశుభ్రమైన వస్తువులతో తయారు చేయాలని ముఖ్యంగా నాణ్యతతో కూడిన రిఫైండ్ ఆయిల్ ద్వారా టిఫిన్లు తయారుచేసి విక్రయించాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో వ్యాపారస్తులలో మార్పు మొదలైంది. పట్టణంలోని ఏ హోటల్ కి వెళ్ళిన ఏ తోపుడు బండి పై చూసిన నాణ్యతతో కూడిన వంటకాలను తయారు చేస్తూ కస్టమర్లకు అందిస్తున్నారు. స్వచ్ఛమైన నూనెను వాడుతూ రుచికరమైన తినుబండారాలను వినియోగదారులకు అందిస్తున్నారు. గతంలో ఏ అధికారి కూడా చేయని వినూత్న కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు.

### వినియోగదారుల ఆరోగ్య భద్రతే ముఖ్యం..
### మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి



ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామిని నినాదం వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో హోటల్స్ యజమానులు కానీ తోపుడుబండ్ల వ్యాపారస్తులు ఎవరైనా సరే వినియోగదారుల ఆరోగ్యానికి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో వ్యాపారస్తులకు పలు సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ అధికారుల ఆదేశాలతో వ్యాపారస్తులు సహకారం అందిస్తూ నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తున్నారని ఇంకా కొంతమంది అందించడానికి సిద్ధంగా ఉన్నారని మున్సిపల్ అధికారుల ఆదేశాలను ఎవరైనా విస్మరిస్తే వారికి జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా వినియోగదారుల సైతం ప్లాస్టిక్ వాడకండి తగ్గించాలని మార్కెట్ కు వెళ్తే బట్ట సంచిలో వెళ్లాలని సూచించారు. కమిషనర్ చేసిన ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుంది. వ్యాపారస్తులు సైతం పరిశుభ్రతతో కలిగిన నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తూ వారి అభిమానాన్ని చూర గొంటున్నారు.



## బోనం ఎత్తిన డూప్యూటీ మేయర్

### భగత్‌నగర్‌లో వైభవంగా పోచమ్మతల్లి బోనాల జాతర

### బోనం ఎత్తి ఊరేగింపును ప్రారంభించిన డూప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, జులై 19(నినాదం):** నగరంలోని భగత్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని పోచమ్మ తల్లి బోనాల జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర కాలనీ అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు స్వయంగా నెత్తిపై బోనం ఎత్తి బోనాల ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని పోచమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాజె నాగులు, నాయకులు చెప్యాల రాంరెడ్డి, తడిసిన బాల్‌రెడ్డి, ముస్కుల విద్యాసాగర్‌రెడ్డి, తిప్పారపు శ్రీనివాస్‌తో పాటు వెంకటేశ్వర కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరద కాలువలో చెత్తను తొలగించిన మున్సిపల్ సిబ్బంది



**జమ్మికుంట, జులై 19 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో గల వరద కాలువలు పేరుకుపోయిన చెత్త ను మున్సిపల్ కమిషనర్ చైర్మన్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కాల్వ లోని చెత్త చెదారాన్ని ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి చైర్మన్ ప్రశాంత్ కుమార్ ఆదేశాల మేరకు హౌసింగ్ బోర్డు లోని వరద కాలువను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందని తెలిపారు. వరద కాలువలో భారీ మొత్తంలో ప్లాస్టిక్ చెత్తతో పాటు వ్యర్థ పదార్థాలు ఉన్నాయని ఇద్దరు జవాన్లతో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చెత్తను పూర్తిస్థాయిలో తొలగిస్తున్నామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో వరద కాలువ లో ఉన్న చెత్తను తొలగిస్తేనే పలు కాలనీలను ముంపుకు గురి కాకుండా కాపాడ గలుగుతామని తెలిపారు. ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తూ కాలువలో చెత్తను వేయకూడదని సూచించారు. శనివారం కురిసిన వర్షంతో వరద కాలువలో నీరు భారీగా చేరిందని భారీ వర్షాలు కురిస్తే మరింత సమస్యగా మారుతుందని అధికారుల ఆదేశాల మేరకు వరద కాలువను శుభ్రం చేస్తున్నామని తెలిపారు.

## కేవలం రూ.50 ఓపీ రుసుముతో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు

### కరీంనగర్‌లో ప్రారంభమైన లక్ష్ ఫౌండేషన్ ఆసుపత్రి

### లక్ష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రముఖ విద్యావేత్త, న్యాయవాది మొహమ్మద్ ముస్తాక్ అలీ



**కరీంనగర్, జూలై 19 (నినాదం):** నగరంలోని ఆదర్శనగర్, రోడ్డు నంబర్– 1, శివాలయం ఎదురుగా నూతనంగా నిర్మించిన లక్ష్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ విద్యావేత్త, న్యాయవాది, లక్ష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. మొహమ్మద్ ముస్తాక్ అలీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ఆసుపత్రిని మానవ సేవే మా ధ్యేయం" అనే లక్ష్యంతో ప్రజలకు అంకితం చేశారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ ఆసుపత్రిలో బాహ్య రోగుల (ఓపీ) రుసుమును కేవలం రూ. 50గా నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణ వైద్యుల సేవలు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిపుణులైన వైద్యుల సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక వైద్య విభాగాలను ప్రారంభించి ఆధునిక వైద్య సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డా. మొహమ్మద్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ, ఆసుపత్రిని లాభాపేక్షతో కాకుండా సేవాభావంతో ప్రారంభించామని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, డబ్బుల లేమి కారణంగా ఎవరూ చికిత్సకు దూరం కాకూడదనే సంకల్పంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్లు సోమిడి వేణు ప్రసాద్, జమ్ము, నవీన్, సహకార కార్పొరేటర్ ఇక్రామ్, ముఫ్తీ సాదిక్ సాహెబ్, మొహమ్మద్ అలీ, అక్రమ్ అలీ, ఫజల్ ఉద్దీన్ బషీర్, ఫైసల్, జమాత్–ఎ–ఇస్లామీ హింద్ అధ్యక్షుడు సోహైబ్, అజ్హర్ దబీర్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బా సామి సాహెబ్‌తో పాటు వైద్యులు, విద్యావేత్తలు, సామాజిక సేవకులు, ప్రజా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, స్థానికులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ప్రణవ్..



**జమ్మికుంట, జులై 19 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ గౌడ్ దంపతుల కూతురు శౌరి ప్రియ నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు. పట్టణంలోని స్వాతి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ శుభకార్యానికి హుజురాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు చందా రాజు మాచర్ల రాజు లక్ష్మయ్య అశోక్ పాతకాల మౌనిక అనిల్ తో పాటు కాంగ్రెస్ నేతలు పొన్నగంటి మల్లయ్య దేశిని కోటి పొన్నగంటి రవీందర్ పలువురు మహిళా నేతలు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నారిని ఆశీర్వదించిన కేడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్**

మున్సిపల్ కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ గౌడుల కూతురు శౌరిప్రియ సారీ ఫంక్షన్ కు కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లు పాతకాల రమేష్ గాజుల భాస్కర్ వీణ వంక మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య జోడు కుమారస్వామి మార్కెట్ డైరెక్టర్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు ప్రసాద్ యాద సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## అల్ఫోర్స్ సీబీఎస్ఈ విద్యార్థుల ఘన విజయం

### పదో తరగతి రెండో బోర్డు పరీక్షల్లో జిల్లా ప్రథమ స్థానం..

### 495 మార్కులతో కె. ఓం కార్తికేయ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అగ్రస్థానంలో నిలిచింది: డాక్టర్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జులై19(నినాదం):** అల్ఫోర్స్ విద్యాసంస్థల సీబీఎస్ఈ విద్యార్థులు పదో తరగతి రెండో బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ, ఉపాధ్యాయులు బోధించిన అంశాలను నిరంతరం సాధన చేయడం ద్వారా అన్ని స్థాయిల పరీక్షల్లో విజయాలు సాధించవచ్చన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంపై పట్టు పెంపొందించేలా అల్ఫోర్స్ ప్రత్యేక బోధనా విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఇటీవల ప్రకటించిన సీబీఎస్ఈ పదో తరగతి రెండో బోర్డు పరీక్ష ఫలితాల్లో కె. ఓం కార్తికేయ 500 మార్కులకు గాను 495 మార్కులు సాధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. అలాగే ఎం. శ్రీహిత 494 మార్కులు, ఏ. స్వర విస్తృతి 492 మార్కులు సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు బోధనా, బోధనేతర సిబ్బందిని, సహకరించిన తల్లిదండ్రులను డాక్టర్ నరేందర్ రెడ్డి అభినందించారు. విజేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా కట్టమైసమ్మ బోనాల జాతర

### బోనం ఎత్తుకుని ప్రత్యేక పూజలు చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న



**కరీంనగర్, జులై19(నినాదం):** కట్టరాంపూర్‌లోని లేక్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎల్ఎండీ జలవిహార్ ఈతగాళ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కట్టమైసమ్మ బోనాల జాతర భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. ఎల్లమ్మ ఆలయం నుంచి శివసత్తుల పూనకాలతో, డప్పు చప్పుళ్ల మధ్య భక్తులు భారీ ఊరేగింపుగా కట్టమైసమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి జాతరను మరింత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న బోనం ఎత్తుకుని జలవిహార్ ఈతగాళ్ల సంఘం ప్రతినిధులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ నర్మదా నర్సన్న, జలవిహార్ ఈతగాళ్ల సంఘం అధ్యక్షుడు పాశం రాజిరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కలర్ సత్తన్న, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గంగ తిరుపతి పటేల్‌తో పాటు సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**వెల్గటూర్,జులై19(నినాదం న్యూస్):** వెల్గటూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గ్రామ దేవత పోచమ్మ బోనాల మొక్కులను పండుగ వాతావరణం లో ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో మహిళలు పెద్దఎత్తున బోనాన్ని ఎత్తుకొని పోచమ్మ ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాన్ని,బోనాలను సమర్పించారు. యువతీ,యువకులు, చిన్నారుల కేరింతల మధ్య బోనాలు,తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు,మహిళలు పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని వర్షాలు సమృద్ధిగా కురిసి,పంటలు బాగా పండాలని,అంటువ్యాధుల బారిన పడకుండా ప్రజలను కాపాడు తల్లి అని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా
## జువ్వాడి అమరేందర్ రావు నియామకం

### పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం సూచన



**కరీంనగర్, జులై 19(నినాదం):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా జువ్వాడి అమరేందర్ రావును నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. జువ్వాడి అమరేందర్ రావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అధిష్ఠానం, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు చిత్తశుద్ధితో పనిచేస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బైరిశెట్టి సంపత్, వెల్మ కృష్ణారెడ్డి, రాజా నరసింహారావు, కోల ప్రభాకర్, కర్ర కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన 107.90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

### స్పెషల్ బ్రాంచ్,పౌ.ర సరఫరాల శాఖ, ఆమన్‌గల్లు  పోలీసుల సంయుక్త దాడి



**ఆమనగల్లు, జూలై 19(నినాదం):** స్పెషల్ బ్రాంచ్ పోలీసుల విశ్వసనీయ సమాచారంతో, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ వై రామకృష్ణ ఆధ్వర్యంలో, అమన్‌గల్లు పోలీసులతో కలిసి మేడిగడ్డ తండాలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అక్రమంగా నిల్వ చేసిన 107.90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు టీజీ07ఖఖీ2980 నంబర్ గల ఆటోను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ సుమారు 3,50,000/– రూ ఉంటుందని అధికారులు తెలిపారు . విచారణలో నిందితుడు నేనావత్ మణిపాల్ ప్రజల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయిస్తున్నట్లు వెల్లడైందని,స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యాన్ని సంబంధిత ఎంఎల్ఎస్ పాయింట్కు అప్పగించగా, ఆటోను అమన్‌గల్లు పోలీసుల స్వాధీనంలోకి తీసుకుని, నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆమనగల్లు పోలీసులు తెలిపారు.

## పత్తిపాక పాఠశాలకు కంప్యూటర్లు మంజూరు



**ధర్మారం జూలై 19 ( నినాదం):** మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించుటలో భాగంగా విద్యాశాఖ మూడు కంప్యూటర్లు మరియు వాటికి కావాల్సిన ఫర్నిచర్ మంజూరు చేసిందని ఈ రోజు కంప్యూటర్లు మరియు సంబంధిత సామాగ్రి పాఠశాలకు అందాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న ఒక ప్రకటనలో తెలిపారు. మారుతున్న ఆధునిక బోధనాపద్ధతులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుటకు తమకు అవకాశం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో వీటిని ఇన్ స్టాల్ చేయించి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ మందాల శ్రావణి హరీష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ ఏలేటి పద్మ, ఉపాధ్యాయులు శ్రీలత, శారద, సునిల్, అరుణశ్రీ,క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ప్రేమ్ సాగర్,గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు తమ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చినందుకు మండల విద్యాధికారి ప్రభాకర్,అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షేక్,జిల్లా విద్యాధికారిణి శారద మరియు రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు ధన్యవాదములు తెలిపారు.

# అధికారుల నియామకంలో జాప్యం..

### నచ్చిన వారి కోసం ఎదురుచూపా?

### మిర్యాలగూడలో రెండు నెలలుగా ఇన్‌చార్జి పాలనతో సతమతమవుతున్న యంత్రాంగం






**మిర్యాలగూడ, జులై 19 (నినాదం ):** రాష్ట్రంలోనే కీలకమైన మిర్యాలగూడ సబ్ డివిజన్‌లో ముఖ్యమైన రెండు విభాగాలకు శాశ్వత అధికారులు లేకపోవడంతో పాలన కుంటుపడుతోంది. మిర్యాలగూడ డీఎస్పీ పోస్టు గత రెండు నెలలుగా, మున్సిపల్ డీఈ (ఇఇ) పోస్టు గత నెల నుంచి ఇన్‌చార్జిల పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయి. ఈ రెండు కీలక పోస్టులకు కొత్త అధికారులను నియమించడంలో జరుగుతున్న జాప్యం వెనుక 'పెద్దల' హస్తం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకే కావాలని ఈ జాప్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**పోలీస్ వ్యవస్థలో పట్టు సడలుతోందా?**

మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇక్కడ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉండటం వల్ల లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కృష్ణా నది సరిహద్దులో ఉండటంతో గంజాయి రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు ఈ ప్రాంతం అడ్డాగా మారుతోంది. ఇన్‌చార్జి పాలనలో కింది స్థాయి అధికారుల పనితీరు పట్ల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల నేరాల అదుపు కష్టమవుతోందని, బాధ్యతాయుతమైన అధికారి ఉంటేనే కేసులు త్వరగా పరిష్కారం అవుతాయని ప్రజలు, స్థానిక నాయకులు వాపోతున్నారు.

**మున్సిపాలిటీలో పర్యవేక్షణ కరువు**

గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఎదిగిన మిర్యాలగూడలో డీఈ పోస్టు ఖాళీగా ఉండటం అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం దాదాపు రూ. 75 కోట్ల విలువైన 15వ ఆర్థిక సంఘం నిధుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే, పర్యవేక్షించే అధికారి లేకపోవడంతో కాంట్రాక్టర్లు తమకు నచ్చినట్లుగా నాణ్యత లేని పనులు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రశ్నార్థకమవుతున్న నియామకాలు**

డిపార్ట్‌మెంట్ పరంగా బదిలీలు జరిగినప్పటికీ, కొత్త అధికారులు రాకుండా అడ్డుకుంటున్నారా? లేక తమకు కావాల్సిన వారి కోసం వేచి చూస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా క్షేత్రంలో ఉన్న ఈ కీలక విభాగాలకు తక్షణమే పూర్తిస్థాయి అధికారులను నియమించి, పాలనను గాడిలో పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే తొలి గుర్తింపు రంగాపురంలో

## 98 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి

### బీఎల్ఏ దారపోగు వెంకటేష్ వెల్లడి



**పెబ్బేరు, జూలై 19 (నినాదం):** పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ – ఎస్ఆర్ఐ ) ప్రక్రియను 98 శాతం మేర విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎస్సీ సెల్ మండల నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ) దారపోగు వెంకటేష్ తెలిపారు. గ్రామంలో మొత్తం 3,100 మంది ఓటర్లు ఉండగా, వారిలో అత్యధికుల వివరాలను డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాలు, రంగాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు బి. రామచంద్రారెడ్డి సూచనల మేరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. గ్రామంలోని బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు), బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయడంతో ఈ లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 98 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఫోన్ ద్వారా బీఎల్ఓలు, బీఎల్ఏ దారపోగు వెంకటేష్‌లను అభినందించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా గ్రామంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎస్ఐఆర్ ప్రక్రియలో 98 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసుకున్న తొలి గ్రామంగా రంగాపురం గుర్తింపు పొందడం గర్వకారణమని దారపోగు వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### మత్స్య సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో

## నేడు.. రేపు 144 సెక్షన్ అమలు

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ ప్రతినిధి, జులై 19 (నినాదం):** నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం మూసీ గ్రామానికి చెందిన మత్స్య శాఖ సహకార సంఘం లిమిటెడ్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎన్నికలు నల్గొండ పట్టణంలోని మహిళా సమాఖ్య భవన్, మిర్యాలగూడ రోడ్ (డీటీసీ సమీపంలో) నిర్వహించనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జూలై 20, 21 తేదీల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 163 (పూర్వపు సీఆర్‌పీసీ సెక్షన్ 144) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కేంద్రం మరియు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**హనుమకొండ, జూలై 19 (నినాదం):** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే జేఏసీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మడికొండ నుంచి కాజీపేట రైల్వే జంక్షన్ స్టేషన్ వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వరంగల్ ప్రాంత యువత ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగాల కల సాకారం కావాలని ఆకాంక్షించారు. ఫ్యాక్టరీలో కల్పించే ఉద్యోగాల్లో స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో రైల్వే జేఏసీ తీసుకునే నిర్ణయాలకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని, జేఏసీ నాయకత్వంలో ఉద్యమం ఐక్యంగా కొనసాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీలో సుమారు మూడు వేల ఉద్యోగాలను స్థానిక యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేని యువతకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వం, సంబంధిత సంస్థలు ముందుకు రావాలని, అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించేందుకు తాము కూడా సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక యువతకు వారి అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అదేవిధంగా, కోచ్ ఫ్యాక్టరీ కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు కూడా తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రాంత అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు మైలురాయిగా నిలవాలంటే స్థానికులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల

## భూగర్భ జలాలు పెరుగుతాయి

### మున్సిపల్ కమిషనర్ నరేష్ కుమార్



**అమరచింత, జూలై 19, (నినాదం):** ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ నరేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని రెండవ వార్డులో అమృత్ 3. 0 జల్ సంవాద్ క్యాచ్ ద రైన్ అనే కార్యక్రమం పై కాలనీవాసులకు చైర్‌పర్సన్ నాగమణి వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు తో కలిసి అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి దగ్గర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను భూమిలో ఇంకేటట్టు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి ప్రతి ఇంటిలోనే అడిగారు వడివేర్థాలు శానిటరీ వ్యర్థాలను వేరువేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఘన వ్యర్థాల విభజనను ప్రతి ఇంటిలో నిత్య కృత్యంగా మార్చుకోవాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఆరోగ్యకరమైన ఆత్మకూరును నిర్మించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వార్డు ఆఫీసర్స్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

### మహిళలకు ఎన్ఎస్‌బీఆర్ ఫౌండేషన్ ఆర్థిక చేయూత



**వేములపల్లి, జులై 19 (నినాదం):** మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌బీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన ఈట పద్మ, ఈట కవిత అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఎన్ఎస్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం పద్మకు రూ. 10 వేల ఆర్థిక సహాయం, కవితకు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్సలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఈ సహాయం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. అనారోగ్యంతో పోరాడుతున్న మహిళలు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎన్ఎస్‌బీఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన కుమ్మర సంఘం కార్యవర్గానికి సన్మానం



**పెబ్బేరు, జూలై 19 (నినాదం):** నూతనంగా ఎన్నికైన వనపర్తి జిల్లా కుమ్మర సంఘం కార్యవర్గ సభ్యులకు ఆదివారం పెబ్బేరు కుమ్మర సంఘం కమిటీ హాల్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు సుగురు రాములు, ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు, గౌరవ అధ్యక్షుడు సూర్యవంశం వెంకటస్వామి, స్టీరింగ్ కమిటీ సభ్యులు బుద్దారం నరసింహ, బొడ్డుపల్లి నరసింహ, పెబ్బేరు మండల అధ్యక్షుడు సూర్యవంశం హర్షవర్ధన్, టౌన్ కమిటీ అధ్యక్షుడు సూర్యవంశం నాగన్న ఆధ్వర్యంలో నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సుగురు రాములు మాట్లాడుతూ, పూర్వకాలం నుంచి కుమ్మరులు చేతివృత్తిని ఆధారంగా చేసుకుని జీవనం సాగించారని, ప్రస్తుతం కాలానుగుణ మార్పులతో మట్టిపాత్రల స్థానంలో స్టీల్, వెండి తదితర పాత్రల వినియోగం పెరగడంతో సంప్రదాయ వృత్తి తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. కుమ్మరుల జనాభా, వృత్తి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్‌ల ద్వారా ఆధునిక మట్టిపాత్రల తయారీ యంత్రాలను అందించడంతో పాటు, కాలానుగుణ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి అర్హ కుటుంబానికి కార్పొరేషన్ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదే విదంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు మాట్లాడుతూ, కుమ్మర కులస్తులు

### ఐక్యతతో పోరాడితే హక్కులు సాధించుకోవచ్చని పిలుపు

### జిల్లా అధ్యక్షుడు సుగురు రాములు

ఐక్యతతో ఉద్యమిస్తే తమ హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు మట్టికుండకు ప్రత్యేక స్థానం ఉందని, అలాంటి వృత్తిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు.

ఇతర సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన తరహాలోనే కుమ్మరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించి, వృత్తి అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి రూరల్ మండల అధ్యక్షుడు శివ, పెబ్బేరు మండల యువజన అధ్యక్షుడు సురేష్, సుగూరు గ్రామ అధ్యక్షుడు శివ, పెబ్బేరు సంఘం ప్రధాన కార్యదర్శి కె. పరుశరాముడు, కె. శ్రీనివాసులు, పామాపురం ఉపసర్పంచ్ శ్రీనివాసులు, సంఘం నాయకులు వెంకటస్వామి, నరేందర్, కర్ణ, తేజ, మహేష్, రమేష్, బుచ్చన్న, నాగన్నతో పాటు యువజన సంఘం సభ్యులు ధర్మతేజ, రవి, రామకృష్ణ, పవన్, శ్రీరాజ్, చింటూ, శేఖర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు.. నిర్లక్ష్యం ప్రమాదకరం

### డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాప్తికి అనుకూల పరిస్థితులు

### జ్వరం మూడు రోజులు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి వెళ్లాలి

### కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి సూపరింటెంట్ డాక్టర్ దశరథ్



**కోదాడ ప్రతినిధి, జూలై 19(నినాదం):** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలో సీజనల్ వ్యాధుల ముప్పు పెరుగుతోందని వైద్యశాఖ హెచ్చరించింది. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా, వైరల్ జ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు. వాతావరణంలో ఆకస్మిక మార్పులు, అపరిశుభ్రమైన పరిసరాలు, కలుషిత తాగునీరు, నిల్వ నీరు దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో సీజనల్ వ్యాధుల కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, ఫాగింగ్, యాంటీ లార్వా మందుల పిచికారీ చేపడుతూ దోమల నివారణ చర్యలను ముమ్మరం చేస్తున్నారు. ప్రజలు నీటిని కాచి చల్లార్చి తాగడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, నీటి ట్యాంకులకు మూతలు వేయడం, మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. చిలుకూరు మండలం బేతావోలు గ్రామంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు, పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు... డాక్టర్ దశరథ్..**

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ్ మాట్లాడుతూ, వర్షాకాలంలో జ్వరం, ఒళ్లునొప్పులు, తలనొప్పి, దగ్గు, జలుబు వంటి లక్షణాలు రెండు నుంచి మూడు రోజులకు పైగా కొనసాగితే స్వీయ వైద్యం చేయకుండా వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సలహా మేరకే మందులు వాడాలని, పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యశాఖ సూచనలు అనుసరిస్తే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు.



# డీఈఓను విధుల నుండి తొలగించాలి



**సూర్యాపేట ప్రతినిధి, జులై 19 (నినాదం):** ప్రభుత్వ అధికారిగా జిల్లా విద్యాశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రైవేటు విద్యా సంస్థలకు వత్తాసు పలుకుతున్న జిల్లా విద్యాధికారి అశోకుని తక్షణమే విధుల నుండి తొలగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు: ఆదివారం జిల్లా కేంద్రంలోని వివిఎన్ భవన్ లో ఎస్ఎఫ్ఐ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాల్సిన విద్యాశాఖ అధికారి కనుసైగలలో విచ్చలవిడిగా అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని విమర్శించారు .ప్రభుత్వ ఉపాధ్యాయులు కార్పొరేట్ విద్యాసంస్థలకు పిఆర్వో గా పని చేస్తున్న నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు .డీఈఓ ను విధుల నుండి తొలగించే వరకు దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పులుసు దిలీప్ పిడిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సింహాద్రి పిడమర్తి భరత్ పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య మహేష్ చారి తగుళ్ల జనార్దన్ వినయ్ లక్ష్మణ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు .

## మధ్యాహ్న భోజన కార్మికుల మండల కమిటీ ఎన్నిక



**పాలకీడు, జులై 19 (నినాదం):** పాలకవీడు మండల మధ్యాహ్న భోజన కార్మికుల మండల మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి ఏకలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన రూ. 10 వేల వేతనం అమలు చేయడంతో పాటు కోడిగుడ్లు, గ్యాస్, పప్పు, నూనె ప్రభుత్వమే సరఫరా చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకోగా, అధ్యక్షురాలిగా నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే నబులు, సహాయ కార్యదర్శిగా నాగమ్మ, ఉపాధ్యక్షురాలిగా రమణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# సమయపాలన మరిచిన జీపీఓలు..

### సేవల కోసం ప్రజల పడిగాపులు"!

### కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం విద్యార్థులు, ప్రజలకు తప్పని ఇబ్బందులు

### పనితీరుపై తహసీల్దార్, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్




**మోతే, జూలై 19(నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా అందించాలనే లక్ష్యంతో గ్రామ ప్రజాపాలన అధికారుల (జీపీఓ) వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ, మోతె మండల తహసీల్దార్ కార్యాలయంలో కొందరు జీపీఓలు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్ణీత సమయానికి కార్యాలయానికి హాజరు కాకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు వాపోతున్నారు...

**సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు..**

విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ప్రజలకు రేషన్ కార్డులు, కుటుంబ ధ్రువీకరణ పత్రాలు, ఇతర రెవెన్యూ సేవల కోసం మండల కార్యాలయానికి వస్తున్న వారు సంబంధిత సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా దూర ప్రాంత గ్రామాల నుంచి వచ్చే వారు కార్యాలయం వద్ద ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాపాలన లక్ష్యానికి విరుద్ధంగా..**

ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జీపీఓ వ్యవస్థలోనే సమయపాలన లోపిస్తే సేవల అందజేతపై ప్రభావం పడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కార్యాలయ వేళల్లో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ అవసరమని కోరుతున్నారు. జీపీఓల హాజరు, పనితీరుపై తహసీల్దార్‌తో పాటు ఉన్నతాధికారులు దృష్టి సారించి, సమయపాలన అమలు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై ఎస్సై అవగాహన

### తల్లిదండ్రుల అప్రమత్తతే యువతకు రక్షణ కవచం

### మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

### యువతను చెడు వ్యసనాల నుంచి కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే

### అనుమానాస్పద కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి

### సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడును ఎస్సై



**పెబ్బేరు, జూలై 19 (నినాదం):** సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్ అన్నారు. పెబ్బేరు మండలంలోని పాతపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచి చైతన్య భారతి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన యువకులు చదువు, ఉపాధి, ఆరోగ్యం కోల్పోయి నేరాల బాట పట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, మొబైల్ ఫోన్ వినియోగం ఎలా ఉంది, రోజువారీ కార్యకలాపాలు ఎలా సాగుతున్నాయనే విషయాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. యువతపై చెడు స్నేహాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, మాదకద్రవ్యాల మాయాజాలం పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు పిల్లలకు నైతిక విలువలు, మంచి అలవాట్లు అలవర్చాలని అన్నారు. పిల్లలతో తరచూ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వారు చెడు వ్యసనాల బారిన పడకుండా కాపాడవచ్చని తెలిపారు. గ్రామాలలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలను మహమ్మారిని తరిమేద్దాం గ్రామాన్ని రక్షిద్దాం అనే నినాదంతో ప్రతి గ్రామాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్న ఆయన, గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల అప్రమత్తతతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. రోడ్డు భద్రతపై కూడా అవగాహన కల్పించిన ఎస్సై, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు శాఖతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు సామాజిక బాధ్యతపై చైతన్యం పెంపొందించారు.

ప్రాణాలకు ముప్పుగా మారిన వైద్యసేవలు..!
శిథిల భవనంలోనే పశువైద్యసేవలు
మంచినీటి నుంచి మందుల నిల్వ వరకు అన్నీ సమస్యలే
వర్షం వస్తే గదంతా నీరు...
రోగాలకు నిలయంగా ఆస్పత్రి
సాయంత్రం అయితే గంజాయి, మద్యం సేవించే వారి అడ్డాగా మారుతున్న ప్రాంగణం
మమ్మల్ని సురక్షిత భవనానికి మార్చండి' అంటూ వైద్యసిబ్బంది ఆవేదన




## అస్తవ్యస్తంగా మారుతీ నగర్
# పశువైద్యశాల

### ఆస్పత్రిలో ప్రధాన సమస్యలు..

సొంత భవనం లేకపోవడం
శిథిలావస్థలో ఉన్న గదిలోనే వైద్య సేవలు
తాగునీటి సౌకర్యం లేకపోవడం
మందుల నిల్వకు ఫ్రిజ్ లేకపోవడం
వర్షం వస్తే గదిలోకి నీరు, మట్టి చేరడం
ఒకే గదిలో మొత్తం సిబ్బంది విధులు
ప్రహరీ గోడ లేక అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారడం
పశువుల భద్రతకు కూడా ప్రమాదకర పరిస్థితులు
పశువైద్య సేవలకు కీలకమైన ఈ ఆస్పత్రి పరిస్థితిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, శాశ్వత భవనం నిర్మాణంతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు, పశుపాలకులు డిమాండ్ చేస్తున్నారు.







**గోదావరిఖని, జులై 19 (నినాదం):** మారుతీ నగర్ పశువైద్యశాల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్య సిబ్బందితో పాటు పశుపాలకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత భవనం లేక కూలిపోయే ప్రమాదంలో ఉన్న మున్సిపల్ గదిలోనే ఆస్పత్రిని నిర్వహిస్తుండగా, అధికారులు మాత్రం ఇప్పటికీ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే,మారుతీ నగర్‌లోని పశువైద్యశాలకు ఇప్పటివరకు సొంత భవనం లేకపోవడంతో మున్సిపాలిటీకి చెందిన శిథిలావస్థలో ఉన్న ఒకే గదిలో వైద్య సేవలు కొనసాగుతున్నాయి. భవనం పూర్తిగా శిథిలమై ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా పైకప్పు నుంచి నీరు కారి గదంతా తడిసిపోతుంది. ఇటీవల కురిసిన వర్షంలో గదిలోకి మట్టి చేరి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని సిబ్బంది వాపోతున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడం, మందులను భద్రపరిచేందుకు అవసరమైన ఫ్రిజ్ కూడా అందుబాటులో లేకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఒకే గదిలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ విధులు నిర్వహించాల్సి రావడంతో పని చేయడానికి కూడా సరైన వాతావరణం లేదని వారు చెబుతున్నారు. ఆస్పత్రికి సరైన ప్రహరీ గోడ లేకపోవడంతో సాయంత్రం తర్వాత ఆ ప్రాంగణం గంజాయి సేవించే వారు, మందుబాబులకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వైద్య సిబ్బంది, పశు పాలకులు భయాందోళనల మధ్య ఆస్పత్రికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల ఆస్పత్రి ఆవరణలో ఒక పశువు గొయ్యిలో పడి మృతి చెందినట్లు సమాచారం. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో శిథిల భవనంలో విధులు నిర్వర్తించడం ప్రమాదకరంగా మారిందని, వెంటనే సురక్షితమైన భవనానికి ఆస్పత్రిని తరలించి శాశ్వత భవనం నిర్మించాలని వైద్య సిబ్బంది, పశుపాలకులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





## కౌన్సిలర్ పద్మ అబ్బయ్య గౌడ్ కృషికి ఫలితం

మూడేళ్ల సమస్యకు ముగింపు
14వ వార్డు వాటర్ ట్యాంక్‌కు మెట్ల నిర్మాణం
ప్రజల ఇబ్బందులకు చెక్
ఎమ్మెల్యే విజ్జన్న, చైర్మన్ రాధాకృష్ణకు కౌన్సిలర్ కృతజ్ఞతలు





**సుల్తానాబాద్, జూలై 19 (నినాదం):** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు లో ఉన్న వాటర్ ట్యాంక్‌కు మెట్లు లేకపోవడంతో గత మూడు సంవత్సరాలుగా ట్యాంక్‌ను శుభ్రం చేయలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు (విజ్జన్న) దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ చొరవతో వాటర్ ట్యాం క్‌కు మెట్లు నిర్మించారు. దీంతో ట్యాంక్‌ను క్రమం త ప్పకుండా శుభ్రపరిచే అవకాశం ఏర్పడి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందే పరిస్థితులు కలిగా యి. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన ఎ మ్మెల్యే విజ్జన్న, మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణలకు 14వ వార్డు కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞ తలు తెలిపారు. ప్రజా స మస్యల పరిష్కారానికి వారు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని పేర్కొన్నారు.

## హిందూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నవరాత్రి ఉత్సవాలు

ఉద్దేశపూర్వకంగానే ఆలయాలపై దాడులు
దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేస్తున్న హిందూ వేడుకలు
విశ్వహిందూ జిల్లా అధ్యక్షుడు స్వరూప్ కిరణ్ గౌడ్



**పెద్దపల్లి రూరల్, జూలై 19(నినాదం) :** హిందూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వినాయక నవరాత్రి ఉత్సవాలనూ నిర్వహిస్తామని విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు డా. స్వరూప్ కిరణ్ గౌడ్ అన్నారు. ఆర్. ఎస్. ఎస్ ప్రాంత కార్యవాహ్ కాచెం రమేష్ జీ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో పాల్గొన్న స్వరూప్ కిరణ్ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగానే హిందువుల ఆలయాలు, దేవీదేవతా మూర్తులపై దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. నిందితులు ఎంతటి వారైనా ఊరు కునే పరిస్థితి లేదని హెచ్చరించారు. దేశభక్తికి,ఆధ్యాత్మిక శక్తికి నవరాత్రి ఉత్సవాలు నిదర్శనమన్నా ఆయన వైభవోపేతంగా పండుగని జరుపుతామ్మన్నారు. ఉత్సవాలపై ప్రభుత్వ జోక్యం, నియంత్రణ, ఆంక్షలను సడలించి స్వేచ్ఛగా పండగ జరుపుకునేలా సహకరించాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో హిందూ పండగలు దోహదపడుతున్నాయని తెలిపారు. కేంద్ర ఎన్నికల సం ఘం చెపడుతున్న ఎస్ ఎస్ఐఆర్ ప్రక్రియలో హిందూవుల ఓట్లు గల్లంతు కాకుండా అవగాహనా కల్పిస్తామని తెలిపారు. విదేశీ చొరబాటుదారులను దేశం నుండి తరలిస్తామని స్వరూప్ కిరణ్ స్పష్టం చేసారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్



**మంచిర్యాల, జులై19 (నినాదం):** చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డులోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో ఆల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచిగా చదువుకోని తెలంగాణ రాష్ట్రంలోనే మన మంచిర్యాల నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో ఉంచాలని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావునీ శాలువాతో సన్మానించారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు..

## వన మహోత్సవంలో పాల్గొన్న ఎస్సై



**లక్ష్మణ్ చందా, జూలై 19 (నినాదం):** లక్ష్మణ్‌చందా మండలం వడ్యాల్‌లో గ్రామంలో నిర్వహించిన వనమహోత్సవం శనివారం ఎస్సై శ్రావణి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటిలను మొక్కలను గ్రామస్తులు పరిరక్షించాలని సూచించారు. అనంతరం కేజ్‌వీల్ ట్రాక్టర్లను రోడ్డుపై నడపకుండా తరలించేందుకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసిన ట్రాక్టర్స్ అసోసియేషన్‌ను అభినందించారు. దీంతో రోడ్లు దెబ్బతినకుండా ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వడ్యాల్‌ను ఆదర్శంగా తీసుకుని ఇతర గ్రామాలు కూడా ఈ విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

## బైంసాలో ఘనంగా బోనాల పండుగ

గట్టు మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్, మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రేయ
ఆలయ రహదారి నిర్మాణనికి 65 లక్షల నిధుల మంజూరు

**నిర్మల్ ప్రతినిధి, బైంసా : జూలై 19 ( నినాదం):** భైంసా పట్టణంలో బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం వేళ నుండి గట్టు మైసమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి అగుపడింది. గణేష్ నగర్, కిసాన్ గల్లీ, కోర్వగల్లీ, పలు కాలనీల నుండి ప్రజలు డప్పు చప్పులతో, బోనం కుండల తో అమ్మ వారి చెంత కు చేరుకున్నారు.. ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఆలయం లో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు పుష్కలం గా కురవాలని, పంటలు పండాలని గట్టు మైసమ్మ తల్లి ని మొక్కుకోవడం జరిగిందన్నారు.

**గట్టు మైసమ్మ ఆలయ రహదారి నిర్మాణనికి 65 లక్షల నిధులు.:**
గట్టు మైసమ్మ ఆలయ రహదారి నిర్మాణానికి 65 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే ఆషాడం వరకు పనులను పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా షెడ్డు నిర్మాణానికి 10 లక్షల రూపాయల నిధులు ఇవ్వనున్న ట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి, మాజీ మున్సిపల్ బిజెపి పట్టణ అధ్యక్షులు రావులరాము, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## స్పెషల్ డ్రైవ్‌తో ప్రజా సమస్యలపై ఫోకస్

యాదవ్‌నగర్‌లో లక్కపురుగుల సమస్యకు పరిష్కారచర్యలు
మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ





**సుల్తానాబాద్, జూలై 19 (నినాదం):** సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లిఎమ్మెల్యేచింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు కృష్ణ, 7వ వార్డు కౌన్సిలర్ వర ప్రదీప్‌తో కలిసి యాదవ్ నగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. పెగ్ గోదాముల కారణంగా లక్క పురుగులుభారీసంఖ్యలోఇళ్లలోకిచేరుతున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటంతో పా టు పాఠశాలకు వెళ్లే చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారని స్థానిక మహిళలు వివరించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లగా, సంబంధిత యాజ మాన్యంతో మాట్లాడి తక్షణచర్యలుతీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అలాగే రైతుల పొలాలు, బావుల వద్ద విద్యుత్ లోడ్ తక్కువగా ఉండటం తో విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమ స్యపరిష్కరించాలని ఎమ్మెల్యే నుకోరారు. అనంతరం 4వ వార్డు పూసాల రోడ్డులోని శ్రీచక్ర డోర్స్ షా ప్ గల్లీలో అమృత్ పైప్‌లైన్ పనులను పరిశీలించి, కాంట్రాక్టర్‌తో మాట్లాడిత్వరితగతినపూర్తి చేయాలని ఆదేశించారు. మున్సి పల్ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తనకు ఫోన్ ద్వారాతెలియజేయాలని ఆయనకోరారు. ఈకార్యక్రమంలో అమృత్ కాంట్రాక్ట్ సూపర్వైజర్ రాజేష్, పాల్గొన్నారు.

## పట్టా భూముల్లో సాగు
# అడ్డుకోవడం అన్యాయం
### ఎమ్మెల్యే హరీష్ బాబు



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 19(నినాదం):** పట్టాలు ఉన్న రైతులను సైతం సాగు చేయకుండా అడ్డుకోవడం అన్యాయమని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ శివారులోని సర్వే నంబర్ 145లో గతంలో ప్రభుత్వం సుమారు 30 మంది రైతులకు పట్టాలు మంజూరు చేయగా, దశాబ్దాలుగా వారు సాగు చేస్తున్న భూములపై అటవీ శాఖ అధికారులు హక్కు ఉందంటూ సాగును అడ్డుకుంటున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రైతులకు సంఘీభావంగా ఆ భూమిని ట్రాక్టర్‌తో దున్నించి పత్తి విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అటవీ శాఖ అధికారుల తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. పట్టాలు ఉన్న రైతుల సాగును అడ్డుకోవడం సరికాదని, గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లే ప్రస్తుతం కూడా రైతులపై ఒత్తిడి కొనసాగుతోందని విమర్శించారు. అంకుసాపూర్‌లో పట్టాదారు రైతుల జోలికి వెళ్లవద్దని అటవీ శాఖ అధికారులను హెచ్చరించారు. రైతుల హక్కులను కాపాడేందుకు అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానేపల్లి సత్తయ్య, గౌత్రే హనుమంతు, డోంగ్రే కార్తీక్‌తో పాటు గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## మంథనిలో న్యాక్ సెంటర్ ఎప్పుడు ప్రారంభమో చెప్పాలే

ఆలస్యం చేసినందుకు ఎమ్మెల్యే అవమాన పడాలే
32నెలల్లో ఏం చేసిండని ప్రజలు ఆలోచన చేయాల
ఫస్ట్ ఎమ్మెల్యేగా పొన్నం మార్చిలోనే న్యాక్ సెంటర్ తెచ్చిండు
ఓట్ల కోసం తప్ప అభివృద్ధి కోసం ఆలోచన చేయని ఎమ్మెల్యే
మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**మంథని జూలై 19 (నినాదం):** తెలంగాణ రాష్ట్రంలోనే అద్భుతం సృష్టించినట్లుగా గొప్పగా ప్రచారం చేసుకుంటున్న మంథనిలో న్యాక్ సెంటర్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ సమాజానికి జవాబు చెప్పాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మంథని పట్టణంలోని రాజగృహలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే పనితనాన్ని చూస్తే జాలి కలుగుతాందని అన్నారు. ఈ విషయాలను సమాజం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేస్తున్నానని ఆయన గుర్తు చేశారు. మంథనికి న్యాక్ సెంటర్ తీసుకువచ్చినా అని ఏదో గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 32నెలలు గడిచిన తర్వాత ఈ సెంటర్ తీసుకువచ్చినందుకు ఎమ్మెల్యే అవమాన పడాలని అన్నారు. 2004 నుంచి 2009 మధ్యలోనే జీవన్‌రెడ్డి జగిత్యాలకు తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. సమాజం మీద యాస ఉంటే అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉంటే ఈ న్యాక్ సెంటర్ ఎప్పుడు తీసుకువచ్చే వారని ఆయన అన్నారు. దుద్దిళ్ల కుటుంబం ఎనిమిదో సారి ఎమ్మెల్యే స్థానంలో ఉన్నారని, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ 25ఏండ్లు ఆయన తండ్రి 15ఏండ్లుగా అధికారంలో ఉంటున్నారని ఆయన తెలిపారు. మొదటి సారి ఎమ్మెల్యేగా, మంత్రిగా అయిన పొన్నం ప్రభాకర్ గత మార్చిలోనే న్యాక్ సెంటర్ తీసుకువచ్చారని, ఆనాడు రూ. 20కోట్లు తీసుకువస్తే ఈనాడు రూ. 40కోట్లు తీసుకురావాలే కానీ కేవలం రూ. 20కోట్లు తెచ్చి గొప్పలు చెప్పుకోవడం, దాన్ని పత్రికలు గొప్పగా రాయడం చాలా బాధాకరమన్నారు అసలు నూతనం భవనం నిర్మాణం అయిన తర్వాత న్యాక్ సెంటర్ ప్రారంభిస్తారా లేక అద్దె భవనంలో ప్రారంభిస్తారో క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32నెలలు గడిచిపోతుంది. రాష్ట్రంలో అంగన్వాడి సెంటర్లకు కోడిగుడ్డు బంద్ అని పేపర్లలో వచ్చిందని అన్నారు. పెద్దపల్లి కాటారం రోడ్డు పూర్తి చేయడానికి ఐదు ఆరు కోట్లు వచ్చించలేకపోతున్నారని, ప్రజలు సైతం రోడ్డెక్కి ధర్నా చేశారని ఆయన ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఇలాంటి పనులు పూర్తి చేయాలే కానీ 32నెలల తర్వాత న్యాక్ సెంటర్ తీసుకువచ్చి ఏదో గొప్ప పని చేశామని చెప్పుకోవడం విడ్డూరమన్నారు. మంత్రిగా 32నెలల్లో ఏం చేసిండని ఆలోచన చేయాలని, ఈ విషయంపై పత్రికలు రివ్యూ చేసి కథనాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే 32నెలలు గడిచిపోయిందని, మరో నాలుగు మాసాలు అయితే కాలం గడిచిపోతుందని అన్నారు. 32నెలల తర్వాత న్యాక్ సెంటర్ ఎందుకు తెచ్చినవో సమాజానికి జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పొన్నం ప్రభాకర్ మొదటిసారి ఎమ్మెల్యే ఆయనంక మార్చిలోనే జీఓ తెచ్చిండని, ఫస్ట్‌టైం ఎమ్మెల్యే కన్నా వెనకబడి ఉన్నావని ఆయన విమర్శించారు. సొంత నియోజకవర్గం కాకపోయినా పొన్నం ప్రభాకర్ కరీంనగర్ బిడ్డగా నీకన్నా ముందు పని చేస్తున్నాడని, కూలగొట్టుడు, అక్రమ కేసులు పెట్టడం తప్ప అభివృద్ధి మీద దృష్టి లేదన్నారు. అభివృద్ధి పనులకు కాగితాలను చూపించి మోసం చేయద్దని, న్యాక్ సెంటర్‌ను ఎప్పుడు ప్రారంభిస్తరో, ఆలస్యం అయినందుకు కారణం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## వర్షాలు కురవాలని గ్రామస్థుల ప్రత్యేక పూజలు



**చింతలమానేపల్లి, జూలై 19(నినాదం ):** చింతలమానేపల్లి మండలంలోని డబ్బా గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులతో సుభిక్షంగా జీవించాలని కోరుతూ గ్రామస్థులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిర్పూర్ నియోజకవర్గంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పొలాలు పచ్చదనంతో కళకళలాడాలని, పసిడి పంటలు పండాలని, ప్రతి కుటుంబం పిల్లాపాపలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గ్రామదేవత లక్ష్మీదేవి ఆలయం, గ్రామ పొలిమేరలోని భీమన్న ఆలయంలో పాలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో డప్పు చప్పుళ్ల నడుమ విధులగుండ నీటిని చల్లుతూ భక్తులు ర్యాలీగా సాగి భీమన్న ఆలయం, పోచమ్మ ఆలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షాలు కురవాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




## షార్ట్‌ఫిల్మ్స్‌లో ప్రజా ప్రయోజనాలే ప్రధానంగా ఉండాలి


నంది అవార్డు గ్రహీతల సత్కార సభలో కొండేల మారుతి

**మంథని, జూలై 19 (నినాదం) :** షార్ట్ ఫిల్మ్స్ మూవీ మేకర్స్ ఫోరం ఆధ్వర్యంలో నంది అవార్డు గ్రహీతల సత్కార సభ ఆదివారం మంథని విద్యార్థి యువత కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్స్ తీసేటప్పుడు వ్యాపార ధోరణి కాకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చిత్రాలు రూపొందించాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే అంశాలను తెరకెక్కించడమే అసలైన సినిమా లక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్థాయి నంది అవార్డు గ్రహీతలతో పాటు, స్థానిక షార్ట్ ఫిల్మ్ నటీమణి పుష్ప, సుమధుర గాయని జవహరిని ఫోరం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన చలనచిత్ర సెన్సార్ బోర్డు పూర్వ సభ్యులు బోగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమా అంటే కేవలం వాణిజ్యం కోసమే కాకుండా బిజనహితంబి కోసం ప్రయోగాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. యువ దర్శకులు సామాజిక స్పృహతో సినిమాలు తీయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, రైటర్ నారమల్ల కృష్ణ, షార్ట్ ఫిల్మ్ హితులు మంచిడి రవితేజ గౌడ్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి సొంతింటి కలను సహకారం చేయటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి పొంగులేటి





**మణుగూరు, జూలై19 (నినాదం):** పేదవాడి ఆత్మ గౌరవం కోసం సొంతింటి కలను సహకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సమాచార, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పినపాక నియోజకవర్గం మణుగూరు మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకి శంకుస్థాపన చేశారు. ముందుగా మణుగూరు మండలంలో సమితి సింగారం గ్రామపంచాయతీ గుట్ట మల్లారం నుండి కట్టుమల్లారం వరకు కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించు నున్న బీటి రోడ్డు నిర్మాణం కు భూమి పూజ చేశారు. అనంతరం సాయి నగర్ నుండి లంక మల్లారం వరకు రెండు కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించు నున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేశారు. మొత్తం అభివృద్ధి పనులు గాను మూడు కోట్ల 50 లక్షలు రూపాయలు నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రసం గిస్తూ.. పేదవాడు అభివృద్ధి కోసం చిరకాల కోరిక అయినా ఇందిరమ్మ ఇల్లు నిత్యం యజ్ఞంగా కొనసాగుతుందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100% సబ్సిడీతో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పేదల ఇండ్ల నిర్మాణం చేపట్టినట్టు అని తెలిపారు. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మలను మంజూరు చేయగా, ఇప్పటికే సుమారు రెండు లక్షలు ఇల్లు పూర్తయి లక్షలాది కుటుంబాలు గృహప్రవేశాలు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఆ తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షలు ఇండ్లు మంజూరు ప్రక్రియను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికి తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వము నిర్లక్ష్యంగా వదిలేసిన నిరుపేదల కు అర్హులైన అందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు కాలం పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రుణాలను ఎగనం పెట్టిందని ఆయన అన్నారు. అటువంటి డ్వాక్రా మహిళలకు రెండున్నర సంవత్సరాలలో 63 వేల కోట్ల రూపాయలు డ్వాక్రా మహిళలకు రుణాల అందించేందుకు నిధులను విడుదల చేయడం జరిగిందని ఆయన అన్నారు. సాగునీటి ప్రాజెక్టని గొప్పలు చెప్పుకుంటున్న బిఆర్ఎస్ నాయకులు కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్ష కోట్లు మిగిలించుకుని, ఆప్రాజెక్టు ఎందుకు పనికి రాకుండా పోయిం దని ఆయన అన్నారు. పదేళ్లు తెలంగాణ రాష్ట్రంలో రాక్షస పాలనతో కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులు కోట్ల రూపాయలకు అధిపతి అయ్యారని ఆయన అన్నారు. అధికారం మార్పిడితో మతిభ్రమించి ఇష్టానుసారంగా ప్రసంగిస్తున్నారని ఆయన ఆరోపించారు. రెండున్నర సంవత్సరాల క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనను అనేక రకాలుగా ఇబ్బందులు పాలు చేసేందుకు లేనిపోని ఆరోపణలు సృష్టిస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆయన అన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం లో రెండున్నర సంవత్సరాల క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి పదంలో నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఆయన అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రతి పేదవాడికి సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గం లో ప్రతి గ్రామంలో సిసి రోడ్లు నిర్మించి అభివృద్ధి పరంలో నడిపించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు, భద్రాచలం ఐడిబిఐ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ అంకిత్, సర్పంచులు ఉపసర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**ఖమ్మం, జూలై 19(నినాదం ):** ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అడవి మద్దులపల్లి గ్రామంలో రూ. 2.85 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ ఉపకేంద్రం ద్వారా ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందే అవకాశం కలగనుంది. అనంతరం రూ. 3.95 కోట్ల వ్యయంతో తాళ్లగూడెం నుంచి నర్సయ్యకుంట వరకు (యం.పి.పి.యస్. పాఠశాల మీదుగా) చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.5 కోట్ల అంచనా వ్యయంతో ఇల్లందు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కామేపల్లి స్మశాన వాటిక వరకు కామేపల్లి పెద్ద చెరువు మీదుగా నిర్మించనున్న బీటీ రహదారి పనులను ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా విద్యుత్, రహదారి మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, టీజీ ఎన్పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీజీ ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, సిఇ రాజు చౌహాన్, ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాస చారి, పీఆర్ ఎస్ఇ జి. వెంకట్ రెడ్డి, ఇఇ మహేష్ బాబు, కామేపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త డ్రైయినేజీపై నిర్లక్ష్యం..

**వర్షాకాలంలో ముంపు భయం!**

**మట్టి తొలగించకపోవడంతో డ్రెయినేజీలో పెరిగిన కలుపు మొక్కలు**

**వర్షాల వేళ రోడ్డుపైకి చేరుతున్న మురుగునీటిపై స్థానికుల ఆందోళన**



**కోదాడ, జూలై 19 (నినాదం):** కోదాడ పట్టణంలోని 13వ వార్డు అనంతగిరి రోడ్డులో ఇటీవల నిర్మించిన డ్రెయినేజీ నిర్వహణ లేక నిరుపయోగంగా మారు తోంది. డ్రెయినేజీలో పేరుకుపోయిన మట్టిని తొలగించకపోవడంతో పిచ్చిమొక్కలు విస్తారంగా పెరిగి మురుగునీటి ప్రవాహానికి ఆటం కం కలుగుతోంది. దీంతో మురుగు నీరు డ్రెయినేజీలోనే నిలిచిపోతుం డగా, వర్షాలు కురిసిన సమయంలో నీరు రోడ్డుపైకి చేరి ప్రజలకు ఇబ్బందులు కలిగించే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన డ్రెయినేజీకి క్రమం తప్పకుండా నిర్వహణ చేపట్టకపోతే ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి డ్రెయినేజీలోని మట్టి, పిచ్చిమొక్కలను తొలగించి నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎల్‌నినోను మిషన్ మోడ్‌లో ఎదుర్కొందాం

**ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు గ్రామ గ్రామానా అవగాహన కల్పించాలి**

**రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ లక్ష్యం**

**తాగునీటి సంరక్షణకు ముందస్తు కార్యాచరణపై**

**కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షలో జిల్లా ఇన్చార్జి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**కరీంనగర్, జూలై 19(నినాదం) :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులు, ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వార్డు సభ్యుడు, సర్పంచి నుంచి ఎంపీ వరకు, పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో బాధ్యత తీసుకుని పనిచేయాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, మేయర్లు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారు లు హాజరయ్యారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు గ్రామ గ్రామాన అవగాహన కల్పించాలని ఆదేశించారు. కంది, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ వంటి పంటలను నేల స్వభావానికి అనుగుణంగా ప్రోత్సహించా లని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితి, ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షాభావ పరిస్థితులపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని, గ్రామసభలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, నీటి వినియోగంలో పొదుపు పాటించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని ఆదేశించారు. మేజర్, మీడియం, మైనర్ నీటిపారుదల వ్యవస్థలపై ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలని సూచించారు. రైతుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లు విడుదల చేసిందని గుర్తు చేస్తూ, సమన్వయంతో పనిచేస్తే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోగలమన్నారు. ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా మాట్లాడుతూ ఎల్‌నినోను ఎదుర్కోవడంలో కరీంనగర్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, ప్రతి మంగళవారం 1,600 రైతు వేదికల్లో నిర్వహించే “రైతు నేస్తం” కార్యక్రమాల ద్వారా రైతులకు శాస్త్రీయ సూచనలు అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు ముందస్తు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం పరిస్థితులు, ఆరుతడి పంటల ప్రయోజనాలు, భూగర్భ జలాల సంరక్షణ, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని, రైతు వేదికల ద్వారా పంటల మార్పిడి విధానంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష తమ జిల్లాల్లో చేపట్టిన చర్యలను వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తాగునీటి సమస్యల పరిష్కారం, సాగునీటి నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, ప్రత్యేక నిధుల కేటాయింపు, రైతులకు విత్తనాలు, డ్రిప్ సౌకర్యాలు, పంటల బీమా వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, ఏంఎల్ఏ లు గంగుల కమలాకర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపెల్లి సత్యం, విజయరామణారావు, పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ కుమార్, మక్కాన్ సింగ్, సంజయ్ కుమార్, ఆది శ్రీనివాస్, కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ సూడా చైర్మన్ కోమిటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు, పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులు, వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జలాలు, మిషన్ భగీరథ, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొన్నారు.

N NADAM CINEMA

# సీతమ్మ పాత్ర లభించడం నా పూర్వ జన్మ సుకృతం


## సాయి పల్లవి



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా, దాదాపు రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'రామాయణ' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పౌరాణిక కావ్యంలో నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తుండగా.. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపిస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ యష్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టార్ డైరెక్టర్ నితీష్ తివారీ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. ఈ ఏడాది దీపావళి కానుకగా 'రామాయణ పార్ట్-1' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రెండో భాగాన్ని మాత్రం వచ్చే ఏడాది దీపావళికి థియేటర్స్‌లోకి తీసుకువచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సాయి పల్లవి, ఈ సినిమాలో సీత పాత్ర చేయడంపై చాలా ఎమోషనల్ అయ్యారు. నటీనటులకు ఇలాంటి గొప్ప పాత్రలు దక్కడం అంత సులభం కాదని ఆమె అన్నారు. ఒక దేవత పాత్రను వెండితెరపై పోషించడం సాధారణ విషయం కాదని, ఆ పాత్రను అద్భుతంగా చూపించడం కోసం చిత్ర బృందం రాత్రింబగళ్లు కష్టపడు తోందని చెప్పారు. సీతామాత పాత్ర గురించి చెబుతూ.. “ఈ పాత్రను నేనే స్వయంగా ఎంచుకున్నానని అనుకోను. ఆ పాత్రే నన్ను ఎన్నుకుంది, దీన్ని ఒక అదృష్టంగా భావిస్తున్నాను. ఇది మనం ప్లాన్ చేసుకుని, ఇలాగే నటిస్తాను అని ముందే రాసి పెట్టుకునే పాత్ర కాదు. సీతమ్మ పాత్రను పోషించే అదృష్టం నాకు లభించడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా” అని వివరించారు. ప్రయత్నించా నని.. అలా చేయడం వల్లే సీత పాత్రలో తన ఉత్తమమైన నటనను ఆవిష్కరించ గలిగానని సాయి పల్లవి చెప్పుకొచ్చారు.

# సూర్య బర్త్‌డే స్పెషల్‌గా వీడొక్కడే రీ-రిలీజ్..

## అదే మ్యాజిక్ రిపీట్ అవుతుందా




సూర్య, తమన్నా జంటగా కొన్ని సంవత్సరాల క్రితం తెరకెక్కిన 'అయాన్' చిత్రం తమిళంలో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇదే సినిమాను తెలుగులో 'వీడొక్కడే' పేరుతో విడుదల చేయగా, ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. ఇప్పటికే రీ-రిలీజ్ బుకింగ్స్ ప్రారంభించగా, జూలై 22న ఈ సినిమాను థియే టర్లలో మళ్లీ విడుదల చేయను న్నారు. గతంలో సూర్య నటించిన 'సూర్య సన్నాఫ్ కృష్ణన్' చిత్రం పలుమార్లు రీ-రిలీజ్ అయి అద్భుతమైన వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'వీడొక్కడే' కూడా అదే స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతుందా అనే ఆసక్తి నెలకొంది. కె.వి. ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ప్రభు, ఆకాశ్ దీప్ సైగల్ కీలక పాత్రలు పోషించారు. హారిస్ జయరాజ్ సంగీతం అందించిన ఈ సినిమాను ఎమ్.ఎస్. గుహన్, ఎమ్. శరవణన్ నిర్మించారు.

### లెనిన్ సక్సెస్‌తో పారితోషికం

# పెంచేసిన భాగ్యశ్రీ..



ఇప్పుడు అన్ని కోట్లు? మిస్టర్ బచ్చన్ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, అందులో తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో వరుస అవకాశాలు ఆమెను వరించాయి. అయితే ఆ తర్వాత చేసిన పలు చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో ఆమెకు నిరాశే ఎదురైంది. అలాంటి సమయంలో అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన లెనిన్ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన భాగ్యశ్రీ బోర్సేకు మంచి బ్రేక్ దక్కింది. జూలై 10న విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఇందులో ఆమె నటనకు కూడా ప్రశంసలు లభించాయి. ఈ విజయంతో భాగ్యశ్రీ బోర్సే క్రేజ్ ఒక్కసారిగా పెరిగిందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో ఆమె తన పారితోషకాన్ని కూడా పెంచినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఒక్కో సినిమాకు సుమారు రూ. 1.5 కోట్ల పారితోషకం తీసుకున్న భాగ్యశ్రీ బోర్సే, లెనిన్ విజయం తర్వాత రూ. 2.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ వార్తలు బయటకు రావడంతో మంచి అందం, నటన ఉన్న హీరోయిన్లకు భారీ విజయాలు దక్కితే పారితోషకాన్ని పెంచడం సహజమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# రాకా కోసం దీపిక డెడికేషన్ నెక్స్ట్ లెవల్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రారంభమైన కొద్ది రోజులకే దీపిక గర్భవతి అయ్యారనే వార్తలు రావడంతో, ఆమె ఈ చిత్రంలో కొనసాగుతారా? లేక తప్పుకుంటారా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే ఆ వార్తలకు తెరదించుతూ దీపిక ఈ సినిమా చిత్రీకరణలో కొనసాగుతున్నారు. ఈ చిత్రంలో దీపికపై భారీ యాక్షన్ సన్నివేశాలు ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వాటిని చిత్రబృందం ఎలా తెరకెక్కిస్తుందనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం దీపిక ఏడు నెలల గర్భంతో ఉన్నప్పటికీ, ఆమె యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటున్నట్లు సమాచారం. ఆమె భద్రత కోసం చిత్రబృందం ప్రత్యేక ఏర్పాట్లు చేసి, షూటింగ్‌ను శరవేగంగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లో ఆమెకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం.

# సల్మాన్ ఖాన్ కొత్త లుక్ వైరల్..



బాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో ప్రముఖ హీరో సల్మాన్ ఖాన్ ఎవరూ గుర్తు పట్టలేనంతగా మారిపోవడంపై ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వైరల్ గా మారిన ఓ వీడియోలో సల్మాన్ ఖాన్ పుర్తిగా వీక్ గా మారిపోయాడు. కండలు తిరిగిన శరీరంతో ఉన్న ఆయన ఒక్కసారిగా అలా ఎలా అయిపోయారని ఫ్యాన్ ఆవేదన చెందుతున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో విషయానికి వస్తే, నెటిజన్లు, అభిమానుల మధ్య దీనిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీనిని వయసు సహజ ప్రభావంగా భావిస్తుండగా, మరికొందరు ఆయన రాబోయే కొత్త సినిమా కోసం తీసుకున్న ప్రత్యేకమైన మేకోవర్ అయి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, సల్మాన్ ఖాన్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కానీ, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం ఉన్నట్లు గానీ ఆయన కుటుంబ సభ్యుల నుంచి, అధికారిక పిఆర్(గా=) బృందం నుండి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సినిమా పరిశ్రమలో నటులు తాము చేసే పాత్రల డిమాండ్ మేరకు బరువు పెరగడం, తగ్గడం, భిన్నమైన గెటప్‌లలో కనిపించడం సహజం. కాబట్టి, సామాజిక మాధ్యమాలలో వచ్చే ఇలాంటి ఊహాగానాలపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు భావిస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel,
Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787